# రాచకొండ

పద్మనాయకులు * సంస్థానాలు

కాకతి పబ్లికేషన్స్

a book by NAGESH BEEREDDY

నగేష్ బీరెడ్డి

# రాచకొండ

## పద్మనాయకులు • సంస్థానాలు

(క్రీ.శ. 1323 - 1948)

నగేష్ బీరెడ్డి

కాకతి పబ్లికేషన్స్

# రాచకొండ

పద్మనాయకులు ● సంస్థానాలు

Rachakonda
by **Nagesh Beereddy**

@ Author

**ISBN**

**Price : Rs. 120 /-**

First Edition : **February 2019**

Authour Contact
**Nagesh Beereddy**
facebook.com/nageshbeereddy
Cell No : 80966 77177

Publisher
**Kakati Publications**
Plot No : 151, Road No : 16,
Bhavani Nagar, Mansoorabad,
LB Nagar, Hyderabad - 500068

Visual promos
**Naveen Kumar Jella**

Cover page Design & Art
**Bhanu Singeetam**
**Gaddam Vinod kumar**
www.gvkgraphics.com

Page Layout & Design
**Kiran Kumar Dasari**
**Sridhar Ravula**

Printed @
**Sai Likhitha Printers,**
Khairatabad, Hyderabad

## For copies

All Leading book stores

for online bookings
flipkart.com
amazon.in

for e-books
kinige.com

# కొత్తచూపు



**కట్టా శేఖర్ రెడ్డి**
సంపాదకులు,
నమస్తే తెలంగాణ

**చరిత్ర ఒక తరగని గని. ఎంత** శోధించినా మరికొంత మిగిలే ఉంటుంది. ఎందుకంటే చరిత్ర అంతా ఆధిపత్య సంఘర్షణల మయమే. సంఘర్షణలో గెలిచినవారు పరాజిత ప్రాంతాల చరిత్రను ధ్వంసం చేసి తమ చరిత్రను స్థాపితం చేయడం గతకాలమంతా జరిగింది. గతానికి సంబంధించిన ఆనవాళ్లు, ఆధారాలు, శత్రుశేషాలు లేకుండా చేయడం అన్నది విస్తృతంగా, కొన్నిసార్లు వికృతంగా జరిగింది. చాలా సార్లు అధికార సంఘర్షణ మాత్రమే గాక మతాల సంఘర్షణగా కూడా చరిత్ర నడిచింది. శైవం, వైష్ణవం, జైనం, బౌద్ధం, మళ్లీ శైవం, వైష్ణవం.. పరస్పర విధ్వంస పునాదులపై పొరలుపొరలుగా చరిత్ర పేరుకుపోయింది. తెలంగాణ పూర్వయుగపు చరిత్రకు సంబంధించి రేఖామాత్ర ఆధారాలు తప్ప, కచ్చితమైన కాలనిర్ణయంగానీ, రాజవంశాల అనుక్రమణికగానీ లభించలేదు. ముక్కలు ముక్కలుగా అక్కడక్కడా లభించిన శాసనాలు, కథాసాహితీ గ్రంథాలు, పురాణాల ప్రస్తావనలే ఇప్పటి చరిత్రకు ఆధారాలు. ఆధారాలు లేనప్పుడు ఆధిపత్య శక్తులు తమకు తోచిన విధంగా చరిత్రను మల్చుకోవడం పరిపాటి. తెలుగునేల చరిత్రలో కూడా ఈ వైకల్యం కనిపిస్తుంది.

తెలంగాణకు సంబంధించి పురాచరిత్రకు తగిన ఆధారాలు లేవు. మధ్య యుగాల చరిత్రకు సంబంధించి కూడా ఎక్కువగా ఆధారాలు లభించలేదు. విషాదం ఏమంటే దక్కను పీఠభూమి ఉత్తర దక్షిణ భారత దండయాత్రలకు మధ్యన రంగభూమిగా మారడం. ఉత్తరాది రాజులు వింధ్య పర్వతాలు దాటిన తర్వాత మొదట విరుచుకుపడింది దక్కనుపైనే. దక్కను ధ్వంసం తర్వాతనే వారు ఇటు తూర్పునకు అటు మరింత దక్షిణానికి తమ దండయాత్రలు సాగించారు. సుల్తానులు, మొఘలులకు కూడా యుద్ధభూమి దక్కను పీఠభూమే. క్రీస్తు శకం 1300 తర్వాత దక్కను అంతా రక్తసిక్తమే. మొదట దేవగిరిలో యాదవ సామ్రాజ్యాన్ని నాశనం చేసి, తర్వాత ఓరుగల్లుపైకి వచ్చారు. రెండు చోట్ల అసాధారణ విధ్వంసం సాగించారు. సకల సంపదలను కొల్లగొట్టడమే కాదు, చరిత్ర ఆనవాళ్లు లేకుండా చేశారు. కొంతకాలం దక్కనులోనే వారు తిష్టవేసి బహమనీ సామ్రాజ్యాన్ని స్థాపించారు. యాదవ, కాకతీయ రాజులతో యుద్ధం తర్వాత, దక్షిణాదిలో మనుగడ సాగించాలంటే హిందువులతో కలసి ఉండాలన్న సోయి వారికి వచ్చింది. తమ ఆస్థానాలలో హిందువులను పెట్టుకుని దక్షిణాదిలో ఇంకా మిగిలి ఉన్న హిందూ రాజ్యాలను ఖతం పట్టించే పన్నాగాలకు దిగారు. దక్షిణాది రాజ్యాలపైకి దాడులకు వెళ్లే కొద్దీ

ముస్లిం రాజులలో మతసహిష్ణుత అనివార్యమైంది. అందుకే కర్ణాటక, తమిళనాడు, కేరళలల్లో చారిత్రక, ఐతిహాసిక, ఆధ్యాత్మిక ఆనవాళ్లపై విధ్వంసం ఎక్కువగా జరుగలేదు. క్రీస్తుశకం 1324లో ప్రతాపరుద్రుని కిరీటం పడిపోయిన తర్వాత నుంచి 1948 వరకు ముస్లిం రాజుల చరిత్రే తెలంగాణ చరిత్ర.

క్రీస్తుశకం 1331 నుంచి 1475 దాకా మలి కాకతీయులు, పద్మనాయకులు రాజ్యం చేసినప్పటికీ వారి చరిత్ర కూడా ఎక్కడా నమోదు కాలేదు. చివరకు మలి కాకతీయ రాజుల మధ్య తంపులు పెట్టి బహమనీలు తెలంగాణ నేలను మరోసారి రక్తసిక్తం చేశారు. రాజుకొండ, దేవరకొండ, ఓరుగల్లులను నామరూపాలు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. తెలంగాణలో ఇంకా అక్కడక్కడా మిగిలిఉన్న చిన్నచిన్న రాజ్యాలు, సంస్థానాలు, జాగిర్దారీలు ముస్లిం రాజుల తాకిడికి బదాబదలై పోయాయి. ఆరు వందల సంవత్సరాలపాటు తెలంగాణలో ఏం జరిగింది అని తెలుసుకోవడానికి పెద్దగా చారిత్రక ఆధారాలు లేవు. కుల చరిత్రలు, వంశచరిత్రలు, కొన్ని శాసనాలు, కొన్ని గ్రంథాలు తప్ప ఏవీ మిగలలేదు. త్రిలింగదేశాధీశ్వరులుగా సకల కీర్తులందుకున్న కాకతీయుల వైభవానికి సంబంధించి అరకొర పరిశోధనలే. పివి పరబ్రహ్మశాస్త్రి గారు నిజానికి ఎంతో శ్రమించి కాకతీయుల చరిత్ర రాశారు. అప్పుడున్న పరిస్థితుల్లో, ఆయనకున్న పరిమిత వనరుల్లో ఆయన చేసిన కృషి అమూల్యమైనది. కానీ చేయవలసింది ఇంకా చాలా ఉంది. శోధించవలసింది ఎంతో మిగిలిపోయింది. అందుకోసం పుస్తకాల సేకరణ, ఆధారాల సేకరణ, పురావస్తుశాలల శోధన అనేకం చేయాల్సి ఉంది. హైదరాబాద్, కోల్‌కత్తా, ఢిల్లీ, తంజావూరు, రాజమహేంద్రవరం వంటి చోట్ల గ్రంథాలయాల్లో, పురావస్తుశాలల్లో దాచిఉంచిన గ్రంథాలు, పత్రాలు, శాసనాలను శోధించడంతోపాటు విదేశాల్లోని ప్రముఖ గ్రంథాలయాల్లో, పురావస్తుశాలల్లో అన్వేషణ జరగాలి. ఆ అన్వేషణలో ఒక చిరు ప్రయత్నం నగేష్ బీరెడ్డి చేశారు.

ఈ నేల వేలయేళ్ల చరిత్రను తెలుసుకోవాలన్న ఆశ ఆయనను చాలా దూరం నడిపించింది. మనం ఎవరు? ఎక్కడి నుంచి ఇక్కడిదాకా వచ్చాం? ఏయే మలుపులు, ఏయే దారులు, ఏయే ఉత్పాతాలు, ఏయే యుద్ధాలు దాటుకుని ఇక్కడికి చేరాము. ఇక్కడే కదా వేల యోధుల కరవాలాలు కదను తొక్కింది. ఇక్కడే కదా వేలాదిమంది అశ్వికులు విదేశీ సేనలను ఎదురొడ్డి పోరాడింది. ఇక్కడే కదా శిల్ప, కళా, సాహితీ సౌరభాలు నలుదిక్కుల విరాజిల్లింది. ఇక్కడే కదా సుల్తానులు, బహమనీలు, మొఘలాయిలు స్థానికుల రక్తంతో స్నానమాచరించింది. ఇక్కడే కదా నేలకొరిగిన వీరయోధుల తలలు కోటగుమ్మాలకు వేలాడింది. ఇక్కడే కదా వీరగల్లుల ఊరేగింపులు జరిగింది. ఆ దారులను చూడడానికి, ఆ ఆనవాళ్లను వెతకడానికి, చరిత్ర కోనల్లోకి వెళ్లాలి. అక్కడ ప్రవహించే ఆ నులివెచ్చని జీవనధారలను శోధించి పట్టుకోవాలి. శోధన ఒక తీరని దాహం. ఆ దాహం తీర్చుకునే ప్రయత్నంలో నగేష్ విజయం సాధించారు. రాచకొండ పద్మనాయకుల చరిత్రపై ఒక కొత్త చూపు ప్రసరింపజేశారు. మరిన్ని వివరాలు, ఆధారాలతో, కొత్తగా, హృద్యంగా, కమనీయంగా వివరించారు. పద్మనాయకుల చరిత్రకు సంబంధించి ముక్కలుముక్కలుగా లభించిన ఆధారాలను, కథలను పేర్చికూర్చి వర్ణించిన తీరు, పాత్రలను నడిపించిన తీరు ఆయన రచనా మాధుర్యాన్ని మనకు పట్టి ఇస్తుంది.

# ప్రస్థానం



**నగేష్ బీరెడ్డి**
రచయిత

**ఈ అనంత కాలగమనంలో** మహా సామ్రాజ్యాల ప్రస్థానంలో చరిత్ర పొరల్ని తవ్వుకుంటూ పోతే.. యుద్ధాలు.. గెలుపులు.. ఓటములు.. రక్తపాతాలు.. రసవత్తరాలు.. రసకందాయాలు.. సువర్ణ అధ్యాయాలు.. జయజయధ్వానాలు.. జయకేతనాలు.. జయస్తంభాలు.. వైభవాలు.. తోరణాలు.. పతనాలు.. పతాకాలు.. పునాదులు.. సమాధులు.. శిథిలాలు.. శిలాఫలకాలు.. శాసనాలు.. ఎన్నో.. ఎన్నెన్నో. మొత్తంగా ఆ శతాబ్దాల నిశ్శబ్ద శబ్దం నుంచి.. చరిత్ర గర్భం నుంచి.. తరతరాల ఆ కాల నిశీధి గురించి ఈ తరానికి తెలియజెప్పేందుకు చిరు వేకువజాడగా ఏదో ఒక శిథిలం ఎప్పుడో అప్పుడు ఎక్కడో అక్కడ బయటపడుతూ ఉంటుంది. ఏదో ఒక శాసనం ఏదో ఒక రోజు వెలుగులోకి వస్తూనే ఉంటుంది. ఆ శకలాలు, శాసనాలే చరిత్ర రచనకు దారాలు.. ముఖ్య ఆధారాలు. వీటి ఆధారంగా ఎంత రాసినా చరిత్ర ఇంకా మిగిలే ఉంటుంది. ఎంత పూడ్చినా ఎక్కడో ఒక శూన్యం కనిపిస్తూనే ఉంటుంది. ఎందుకంటే చరిత్ర ఒక తరగని గని. పూర్తిగా దొరకని నిధి. దానికోసం అన్వేషణ సాగించిన మహానుభావులు ఎందరో. అలా విస్తారమైన చరిత్రను వివరించిన గ్రంథకర్తలూ ఎందరో. అయినా ఏదో వెలితి. ఎక్కడో ఒక లోటు. ఈ లోటును అణువు అంతయినా పూర్తిచేయాలనే సంకల్పంతో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్ రెడ్డి గారు నాకు 'మన చరిత్ర' రాసే అవకాశం, అదృష్టం కల్పించారు.

తెలంగాణ చరిత్రపై విస్తృత పరిశోధన జరుగాలని నిరంతరం తపించే ఆయన నన్ను ఈ పుణ్యకార్యంలో భాగం చేయడం ఎప్పటికీ మర్చిపోలేనిది.

నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో రాయడం మొదలుపెట్టాలి. కానీ ఎక్కడి నుంచి ప్రారంభించాలి?

దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల క్రితం.. సమాజంలో బలంగా వేళ్లూనుకుపోయిన పురుషాధిక్యతపై సవాలు విసురుతూ ఓ వీరనారి రాజ్యాధికారం చేపట్టింది. 'ఆడదానికి రాజ్యమా? ఆడది పరిపాలించడమా?' అని అయిన వాళ్లే జీర్ణించుకోలేకపోయారు. తిరుగుబాటు చేశారు. అయినా ఆమె అదరలేదు. బెదరలేదు. అలాంటి వారి తలలు వంచి, నోళ్లు మూయించి ధీర వనితగా, శత్రు భయంకర రుద్రరూపిణిగా నిలిచింది. నేటి స్వేచ్ఛామహిళకు ప్రతీకగా, స్త్రీ

ఆత్మగౌరవానికి సమున్నత పతాకగా.. గెలిచి నిలిచిన రాజగజకేసరి.. రణరంగ ఖడ్గధారిణి.. కాకతీయ మహాసామ్రాజ్యభార ధారణి.. రాణీ రుద్రమదేవి నుంచి మొదలుపెట్టడం సముచితం అనిపించింది. అలా మే 7, 2017 నుంచి 'మన చరిత్ర' శీర్షిక 'బతుకమ్మ'లో మొదలైంది. కాకతీయులు.. అనంతరం రెండో కాకతీయులు.. ఈ మధ్యలో ఏం జరిగింది? ముసునూరి నాయకులు.. పద్మనాయకులు.. వారి సంస్థానాలు.. తెలంగాణ సంస్థానాలు.. ఇలా.. 90 వారాలుగా 'మన చరిత్ర' శీర్షిక విజయవంతగా కొనసాగుతూనే ఉంది.

ఒక ఆశ్చర్యం.. ఒక అద్భుతం.

నేను చరిత్రకారుడిని కాదు. పాత్రికేయుడిని మాత్రమే. పైగా సైన్స్ స్టూడెంట్‌ను. ఈ చరిత్ర రాయగలనా? అనే ప్రశ్న. కానీ, రాయాలనే ఆశ. మన మూలాలు తెలుసుకోవాలనే తపన. ఇవే నన్ను ముందుకు నడిపించాయి. నడిపిస్తున్నాయి. అవసరమే అన్ని అవకాశాల్ని కల్పించడం ఒక అద్భుతమే. ఈ అద్భుత అవకాశాన్ని నాకు కల్పించిన సమగ్ర చరిత్ర స్వప్నికుడు, నా కల కూడా ఆయనే కనే తాత్వికుడు, తొలి పాఠకుడు, ప్రతి సోమవారం పాఠకుల స్పందనను ఆసక్తిగా అడిగి తెలుసుకునే  ప్రియ సంపాదకుడు కట్టా శేఖర్ రెడ్డి సర్‌కు, నమస్తే తెలంగాణ యాజమాన్యానికి నేనెప్పుడూ రుణపడి ఉంటాను.

ఈ రోజుల్లో చరిత్ర చదివేవారు ఎవరుంటారు అని చాలామంది అనుకుంటుంటారు. కానీ వారం వారం ఊహించనంతగా వచ్చే ఫోన్ కాల్స్ అది తప్పు అని నిరూపించింది. ఎంతో ఆర్ద్రతతో, ఆత్మీయంగా, ఆశీర్వదిస్తూ, అభినందిస్తూ ప్రోత్సహించిన ఎంతో మంది పాఠకులను నేనెప్పుడూ మర్చిపోలేను.

బతుకమ్మ 'మన చరిత్ర'లో ఇప్పటి వరకు ప్రచురితమైన 90 భాగాల్లో కాకతీయులకు సంబంధించిన 26 భాగాలను 'కాకతీయ ప్రస్థానం' పేరుతో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ పుస్తకంగా ముద్రించింది. ఇందుకు చొరవ తీసుకున్న ఆ శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ పరంపరలో కాకతీయుల తర్వాత.. తెలంగాణను ఏలిన రేచర్ల పద్మనాయకుల గురించి, వారి సంస్థానాల గురించి ఈ పుస్తకాన్ని అందిస్తున్నాం. తెలంగాణ సంస్థానాల గురించి ప్రత్యేక పుస్తకం కూడా త్వరలో ముద్రణలోకి రానుంది.

ఈ పుస్తకం ఇలా రూపుదిద్దుకోవడంలో ప్రత్యక్షంగా పరోక్షంగా ఎంతో సహాయం చేసిన ఆత్మీయ సోదరులు సీహెచ్ శ్రీనివాస్, ధర్మా రాంరెడ్డి, బావ శ్రావణ్ కుమార్ బీరం, స్నేహితుడు ఏనుగు వెంకట్ రెడ్డి, కవర్ పేజీ మీద చిత్రాలను గీసిచ్చిన మిత్రుడు గడ్డం వినోద్ కుమార్, కవర్ పేజీని ఆకట్టుకునేలా డిజైన్ చేసిచ్చిన మిత్రుడు భానుప్రకాష్ సింగీతం, లోపలి పేజీలను అందంగా డిజైన్ చేసి ఇచ్చిన తమ్ముళ్లు కిరణ్ కుమార్ దాసరి, శ్రీధర్‌రావుల, శ్రీనివాస్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని ప్రమోట్ చేయడంలో భాగంగా ఎంతో శ్రమకోర్చి విజ్యువల్ ప్రోమోస్

రూపొందించి అమిత ఆసక్తిని రేకెత్తించిన సోదరుడు నవీన్ కుమార్ జల్లా, విజయ్ కుమార్ సద్దల, ప్రణీత్ యండ్లూరిలకు

ఇమేజ్‌లకే ఇమేజ్ తెచ్చేలా ఇందులోని ఫొటోలను చక్కగా కలర్ కరెక్షన్ చేసిన ఈదర సురేష్‌కు..

వారం వారం నా వ్యాసాలను, అక్షరాలను సరిచేసే తొలి, మలి పాఠకులు దోర్భల బాలశేఖర శర్మ గారికి, సౌమ్య నాగపురికి..

ఈ నా పుస్తకాన్ని తమ పుస్తకంగానే భావించి అన్నింట్లో నాకు చేదోడు వాదోడుగా నిలిచిన టీమ్ జిందగీ అండ్ కాకతి తమ్ముళ్లు దాయి శ్రీశైలం, ప్రవీణ్ కుమార్ సుంకరి, అజహర్ షేక్, మధుకర్ వైద్యుల, డప్పు రవి, వనజా వనిపెంట, పసుపులేటి వెంకటేశ్వరరావు, వినోద్ మామిడాల, రవి పడమటింటి అండ్ సతీష్ గడ్డం..

పద్మనాయకులు, వారి సంస్థానాలకు సంబంధించిన అందమైన ఫొటోలు సమకూర్చిన నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్స్ అందరికీ, లైబ్రరీ శ్రీధర్ అన్న అండ్ టీమ్‌కు..

కొల్లాపూర్ సంస్థానాధీశుల గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్న సాలార్‌జంగ్ మ్యూజియం పెయింటింగ్స్ రిస్టోరేషన్ విభాగం ఇంఛార్జ్ శ్రీనివాసమూర్తి గారికి..

పిఠాపురం సంస్థానానికి సంబంధించిన అరుదైన ఫొటోలు పంచుకున్న అడ్వకేట్ అశోక్ గారికి..

బరోడా మహారాణి సీతాదేవి ఫొటోలు అందించిన అడ్వకేట్ దినావర్ రావు గారికి..

రాయడం పూర్తి కాకముందే, వారం వారం వ్యాసాలు చదువుతూ మీ పుస్తకం ఎప్పుడు వస్తుందని పదే పదే అడుగుతూ, పుస్తక రూపంలో తీసుకురండి బావుంటుంది అని.. నన్ను మరింత ప్రోత్సహించిన సహృదయులు ఎందరో ఉన్నారు. వారందరికీ ఈ సందర్భంగా పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు.

నేను చరిత్ర తిరగ రాయడం లేదు. తిరిగి రాస్తున్నానంతే. రాచకొండ పద్మనాయకులు, వారి సంస్థానాల గురించి ఇది సమగ్రంగా, సంపూర్ణంగా చరిత్రను తెలియజేప్పే గ్రంథం అని చెప్పడం లేదు. కానీ కొత్త చూపుతో.. కొంత కొత్తగా.. పూర్తి చిత్తశుద్ధితో చెప్పే ప్రయత్నం మాత్రం చేశానని చెప్పగలను. ఇంకా పద్మనాయకుల ప్రస్థానంలో నేను రాయని విషయాలు చాలా ఉండొచ్చు. సద్విమర్శకులు తమకు తెలిసిన విషయాలను చెబితే కృతజ్ఞతతో స్వీకరిస్తాను. ఇందులో తప్పులు కూడా ఉండొచ్చు. తెలియజేస్తే వాటినీ సహృదయంతో స్వీకరిస్తాను.

# విషయ సూచిక

## ఒకటో అధ్యాయం : రేచర్ల పద్మనాయకులు


1. కాకతీయుల తర్వాత ఏం జరిగింది? 13
2. మాలిక్ మక్బూల్ తెలంగాణీ 15
3. ముసునూరి నాయకులు 19
4. చిన్నచిన్న రాజ్యాలుగా చీలిపోయిన మహాసామ్రాజ్యం 11
5. రేచర్ల పద్మనాయకులు మూలాలు, తొలితరం నాయకులు 25
6. అశీతివర సింగమనేడు 29
7. మహాసంగ్రామం.. జల్లిపల్లి యుద్ధం 33
8. అనపోతానేని దిగ్విజయ యాత్ర 39
9. కుమార సింగభూపాలుడు 43
10. రెండో అనపోతానాయుడు 47
11. రావు మాదానేని 51
12. సర్వజ్ఞ సింగభూపాలుడు 55
13. పండితారాధకులు.. పద్మనాయకులు 57
14. పద్మనాయకుల్లో చివరి పరాక్రమవంతుడు లింగమనేడు 61


## రెండో అధ్యాయం : పద్మనాయకుల సంస్థానాలు


1. వెంకటగిరి 67
2. కొల్లాపూర్ (జటప్రోలు) 71
3. శ్రీకాళహస్తి (పానగల్లు) 75
4. పిఠాపురం 79
5. బరోడా మహారాణి సీతాదేవి 85
6. బొబ్బిలి సంస్థానం 93
7. బొబ్బిలి యుద్ధం 97
8. యుద్ధానంతరం బొబ్బిలి 103
9. నూజివీడు 107
11. పాల్వంచ సమేత భద్రాచలం 113
12. ఉల్లిపాలెం, మైలవరం, గురజ 117
15. నరసారావుపేట, రాచూరు (రేపల్లె), ముత్యాలపాడు 121

ఒకటో అధ్యాయం

# రేచర్ల పద్మనాయకులు

**పద్మనాయకులు.. వెలమవారు..** ఈ రెండూ పర్యాయపదాలు. ఆంధ్ర– తెలుగు లాంటి పదాలే ఇవి. రాచకొండ, దేవరకొండ వెలమల్లో దశవిధ వెలమలున్నారు. పద్మనాయకులు పదకొండు  గణాలుగా, గణం ఏడు గోత్రముల చొప్పున డెబ్బైయేడు 'సప్తసప్తతి' గోత్రజులున్నట్లు 'పద్మనాయక చరిత్ర' చెబుతున్నది.

కాకతీయ సామ్రాజ్య స్థాపనకు పూర్వం ఈ పద్మనాయకులు దక్షిణ దేశ సార్వభౌములైన చోళులు, పాండ్యుల కొలువులో ఉన్నట్లు వీరి బిరుదులు చెబుతున్నవి.

కాకతీయ రుద్రదేవుని కాలం నుంచి డెబ్బైయేడు గోత్రాలు గల పద్మనాయక వీరులు ఆ మహా సామ్రాజ్యానికి పట్టుగొమ్మలై ఖ్యాతిగడించారు.

కాకతీయ ప్రతాపరుద్రుని నిర్యాణం తర్వాత కాకతీయ మహాసామ్రాజ్యం చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయింది. అలాంటి రాజ్యాల్లో ఓ రాజ్యంగా మొదలై, విస్తరించి పాలన సాగించిన వారు పద్మనాయకులు.

రాచకొండను రాజధానిగా, దేవరకొండను ఉపరాజధానిగా చేసుకుని రేచర్లవారు పద్మనాయక సామ్రాజ్యం స్థాపించి సుమారు 120 ఏండ్ల పాటు పాలించారు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, ఢిల్లీ సుల్తానులను, బహమనీ సుల్తానులను ఎదుర్కొని తెలంగాణను పాలించిన వారు రేచర్ల పద్మనాయకులు. వీరు కొన్ని సందర్భాలలో తెలంగాణేతర ప్రాంతాలను జయించినా కొంతకాలం తరువాత కోల్పోయేవారు. అలాగే ఇతరులు కూడా తెలంగాణ ప్రాంతాలను ఆక్రమించినా వీరు తిరిగి పొందేవారు.



# కాకతీయుల తర్వాత ఏం జరిగింది?

**తురుష్కుల చేతిలో ఓడిపోయిన కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు ఆత్మార్పణతో అమరుడయ్యాడు. అంతటితో సువిశాల కాకతీయ సామ్రాజ్యం అంతమైపోయింది. ఈ పతనాన్ని, ప్రతాపరుద్రుని ఆత్మార్పణను ముస్లిం రచయితలు సమగ్రంగా పేర్కొనలేదు. ఒక్క ముక్కలోనే తేల్చేశారు. సుల్తానును ఎదిరించిన యాదవ రాజు హరగోపాలుని తోలు ఒలిచి తల నరికి కోట గుమ్మానికి వేలాడదీసినట్లు గొప్పగా రాసుకున్నారు. ఒక్కసారి తిరుగుబాటు చేసిన హరగోపాలుడిని వధించడాన్నే అంత గొప్పగా రాసుకున్న వారు, సుమారు ఇరవై రెండేండ్లు ఏకధాటిగా తురుష్కులను ఎదిరించిన ప్రతాపరుద్రుని మరణాన్ని మాత్రం అంత తేలికగా ఎందుకు తీసుకుంటారు?**

**ప్రతాపరుద్రుడిలాంటి మహాయోధుడు** తమ బందీ నుంచి తప్పించుకున్నాడంటే.. సుల్తానులు, వారి ఆస్థాన రచయితలు.. తమకు అప్రతిష్టగానే భావించి ఉండవచ్చు. అందుకే అతని మరణాన్ని గురించి సమగ్రంగా గ్రంథస్థం చేయకపోయి ఉండవచ్చు.

ప్రతాపరుద్రుని సోదరుడు అన్నమదేవుడు గోదావరి దాటి దంతేవాడలో బస్తర్ రాజ్యం స్థాపించాడు. కానీ ఇక్కడ ఈ తెలంగాణ గడ్డ మీద.. కాకతీయ మహా సామ్రాజ్యం పతనానంతరం ఏం జరిగింది?

మహాయోధుడు, దక్షిణ భారతాన్ని ఏలుతున్న చక్రవర్తి అయిన ప్రతాపరుద్రుడు తన ముందు తల వంచితే గర్వంగా మీసం తిప్పుదామనుకున్న ఉలుఘ్‌ఖాన్, ఘియాసుద్దీన్ తుగ్లక్‌ల కల మాత్రం నెరవేరలేదు. వారి పగ ఇంకా చల్లారలేదు. దాన్ని తీర్చుకొనేందుకు ప్రతాపరుద్రుడు లేడు. ఆ పగనీ, ప్రతీకారాన్ని ఇక కాకతీయ రాజ్య ప్రజలపై తీర్చుకున్నారు. ఎందుకంటే అదిప్పుడు వారి చేతుల్లోనే ఉంది. దానికిప్పుడు సుల్తాన్‌పూర్ అనే పేరు పెట్టుకున్నారు.

ఓరుగల్లును ఆక్రమించిన ఉలుఘ్‌ఖాన్ సారథ్యంలోని తుగ్లక్ సేనలు క్రమక్రమంగా కాకతీయ సామ్రాజ్యాన్ని మొత్తం స్వాధీనం చేసుకున్నాయి. ఉలుఘ్‌ఖాన్ ఓరుగల్లు పేరు మార్చాడు. ముఖ్యమైన ప్రదేశాల్లో ముస్లిం సేనల్ని నిలిపాడు. పరిపాలన కోసం అమీర్లు, మాలిక్‌లనూ నియమించాడు. తెలుగు నేల మొత్తం అప్పుడు దౌలతాబాద్ (దేవగిరి) పాలకుడైన మాలిక్ బుర్హానుద్దీన్ అధికారంలో ఉన్నది. ఇతనికి సహాయకుడిగా మాలిక్ మక్బూల్ అనే మరో అధికారిని నియమించారు. ఇతను ఓరుగల్లు రాజధానిగా తెలుగు నేలకు పాలకుడయ్యాడు. ఈ మాలిక్ మక్బూల్ ఎవరో కాదు, ప్రతాపరుద్రుని కొలువులో పనిచేసినవాడే. (ఇతని గురించి పూర్తిగా తర్వాతి అధ్యాయంలో తెలుసుకుందాం).

ముస్లిం పాలనలోకి వెళ్లిపోయిన తెలుగు ప్రజలు, వారి పరిపాలనలో అష్టకష్టాలు పడ్డారు. అసహజమైన, అక్రమమైన, దుర్భరమైన పన్నులెన్నో వేసి ముస్లిం పాలకులు ప్రజల్ని పీడించారు. ప్రజల భూముల మీద, మిద్దెలు, ఇండ్ల మీద, చివరికి భార్యల మీద కూడా పన్నులు వేశారు. స్త్రీలను చెరబట్టడం, వారిని చెరచడం వారికి సర్వసాధారణమైపోయింది. ఇది నాది అనే హక్కు లేకుండా పోయింది. గ్రామాలకు గ్రామాలనే దోచుకున్నారు. అమాయకులను ఎందరినో చంపారు. ఊళ్లకు ఊళ్లను తగులబెట్టారు. ప్రజల ఇండ్లను నేలమట్టం చేశారు. అగ్రహారాల్ని కొల్లగొట్టారు. బలవంతంగా మత మార్పిడులు చేయించారు. ధనికులు, దరిద్రులనే భేదం లేకుండా పోయింది. బీద రైతులు దరిద్రంతో బిచ్చగాళ్లయ్యారు. గ్రామాల్లో సాగుభూములు బీడు పడి వ్యవసాయం దెబ్బతిన్నది. హిందువుల ఆలయాల్ని, దేవతల విగ్రహాల్ని ముక్కలు ముక్కలు చేశారు. ఆనాడు ఘనంగా ఓ వెలుగు వెలిగిన మనోహర శిల్ప శోభితాలైన పెద్ద పెద్ద ఆలయాల్ని కూడా కూల్చారు. కొన్ని చోట్ల ఆ దిబ్బలపైనే మసీదులు నిర్మించారు.

ఇలాంటి దుర్భర స్థితిలోంచి ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఇది క్రమంగా ఒక ఉద్యమానికి, మహా విప్లవానికి దారి తీసింది. ఫలితమే స్వాతంత్ర్య పోరాటానికి నాంది అయింది.

కాకతీయుల అనంతరం ఓరుగల్లు విముక్తి పోరాటాన్ని మొదలుపెట్టిన వారు కాకతి ప్రతాపరుద్రుని సేనా నాయకులైన కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనేడు, బెండపూడి అన్నయ మంత్రి. ఈ ముగ్గురు ఈ తిరుగుబాటుకు యువ నాయకుల అవసరాన్ని గుర్తించారు.

కాకతీయ సామ్రాజ్యంలో కొనసాగిన నాయంకర సామంతులు మొత్తం 72 మంది. వీరిలో రేకపల్లి సామంతుడైన ముసునూరి ప్రోలయ నాయకుడు అన్నయమంత్రికి విధేయుడు. ఇతడిని తాము సంకల్పించిన తిరుగుబాటుకు నాయకునిగా ఎన్నుకున్నారు.



ఢిల్లీలో శిథిలావస్థలో ఉన్న మాలిక్ మక్బూల్ సమాధి

# మాలిక్ మక్బూల్ తెలంగాణీ

ఓరుగల్లులో అతడొక మంత్రి. అటు తర్వాత ఢిల్లీ దర్బారులో ప్రధానమంత్రి. కాకతీయుల వద్ద నేర్చిన పరిపాలనా పాఠాలను సుల్తానుల దగ్గర ప్రదర్శించి ప్రశంసలు పొందినవాడు. కాకతీయుల్లా వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందడమే కాదు, ఆర్థికంగా పురోగతీ సాధించవచ్చునన్న విశ్వాసంతో అలాంటి పనులు ఎప్పుడూ చేయని సుల్తానులతో వాటిని చేయించినవాడు. అతడే ఖాన్ ఎ జహాన్ తిలంగాణీ.. అలియాస్ మాలిక్ మక్బూల్ తెలంగాణీ ఉరఫ్ నాగయ గన్నయ.

**ప్రముఖ తెలుగు కవి** మారన తన మార్కాండేయ పురాణంలో ప్రతాపరుద్రుడికి సేవలం దించిన కొందరు అధికారుల గురించి పేర్కొన్నాడు. వారిలో నాగయ గన్నయ ఒక ముఖ్యాధి కారి. గొప్ప కవి, పండిత పోషకుడు అయిన గన్నయకే మారన తన పురాణ గ్రంథాన్ని అంకిత మిచ్చాడననది చరిత్ర.

దాది నాగయ గన్నయకే గన్నయ నాయుడు అనే పేరుతో పాటు యుగంధరుడు అనే బిరుదు కూడా ఉంది. కాకతీయ సామ్రాజ్యపు చివరి రాజు ప్రతాపరుద్రుడి వద్ద ఇతడు దుర్గపాలకుడిగా, కోశాధికారిగా, సర్వసైన్యాధ్యక్షుడిగా, మహామంత్రిగా పనిచేశాడు. కాకతీయ సామ్రాజ్యంపై జరి గిన ముస్లింల దండయాత్రల్ని తన వీరోచిత పోరాట పటిమతో తిప్పికొట్టిన ధీశాలి గన్నమ నాయుడు. ఓటమి సమయంలో తురుష్కులతో సంధి కోసం ప్రతాపరుద్రుని తరపున మాట ముచ్చటకు పోయింది ఇతడే.

నాగయ గన్నయ ఒక మహావీరుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈతని తాత మల్ల నాయకుడు. తండ్రి నాగయ నాయుడు. ఇతడు గణపతి దేవుని దగ్గర, ఆ తర్వాత రాణీ రుద్రమదేవి వద్ద సేనాధిపతిగా పనిచేశాడు. వీరిది దుర్జయ వంశం. ఈ ఇంటి పేరుగల సేనానులు కాకతీయ చక్రవర్తుల వద్ద ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు.

క్రీ.శ. 1323లో ఓటమి తర్వాత కాకతీయ మహా చక్రవర్తి ప్రతాపరుద్రుడు, అతని కటకపా లుడు గన్నమ నాయుడు సహా పలువురు సేనాధిపతులు తుగ్లక్‌కి బందీలయ్యారు. వీరిని ఓరు గల్లులోనే ఉంచితే ప్రమాదమని భావించిన తుగ్లక్.. తన విశ్వాసపాత్రులైన ఖాదిర్ ఖాన్, ఖ్వాజా హాజీల నేతృత్వంలో వారిని ఢిల్లీకి తరలించాల్సిందిగా ఆజ్ఞాపించాడు. ఆ ఆదేశాల మేరకు వారిని ఢిల్లీకి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ప్రతాపరుద్రుడు ఆత్మబలిదానం చేసుకున్నాడు. గన్నయ నాయకుడు, మరికొందరు సేనానులు మాత్రమే ఢిల్లీకి బందీలుగా వెళ్లారు.

ఢిల్లీకి చేరిన తర్వాత గన్నయ నాయునికి మరణమో.. మతమార్పిడినో.. ఈ రెండింట్లో ఏదో ఒకటి మాత్రమే ఎంచుకోవాల్సి వచ్చింది. ఆ కాలంలో మరణం అంటే బతికి ఉండగానే చర్మం ఒలిచి, తలను నరికి కోట గుమ్మానికి వేలాడదీసేవారు. ఇది ఢిల్లీ సుల్తానుల రివాజు.

ఆ రెంటిలో గన్నయ నాయుడు మాతమార్పిడినే ఎంచుకున్నాడు. ఫలితంగానే తన పేరును మాలిక్ మక్బూల్‌గా మార్చుకున్నాడు. నాగయ ఎంచుకున్న మార్గాన్ని ప్రశంసిస్తూ ఢిల్లీ సుల్తాను ఉలుఘ్ ఖాన్ అలియాస్ మహమ్మద్ బీన్ తుగ్లక్ మాలిక్ మక్బూల్‌గా నాగయను పంజాబ్ పాలకునిగా పంపాడు.

ప్రతాపరుద్రుని మరణానంతరం మహమ్మద్ బీన్ తుగ్లక్ ఓరుగల్లును మాలిక్ బుర్హానుద్దీన్ ఆధీనంలో ఉంచాడు. ఇతడు అప్పటికే దౌలతాబాద్ అధిపతిగా ఉన్నాడు. ఇక్కడ తెలంగాణ గడ్డపై కాకతీయుల అనంతరం ఓరుగల్లు విముక్తి పోరాటం మొదలైంది. దీనికి ముసునూరి నాయకులు నాయకత్వం వహించారు. ఇది సహించని తుగ్లక్ పెద్ద సైన్యంతో ఓరుగల్లు పైకి వచ్చాడు. అతనితో పాటు మాలిక్ మక్బూల్‌ను కూడా తోడ్కొని వచ్చాడు. ఓరుగల్లుకు

చేరుకోగానే సుల్తానుకు అంటువ్యాధి సోకింది. దీంతో అతడు భయపడిపోయాడు. తూర్పు తెలంగాణకు మక్బూల్‌ను అధిపతిని చేసి తిరిగి ఢిల్లీకి వెళ్లిపోయాడు. ముసునూరి నాయకుల్లో ప్రోలయ నాయకుని తర్వాత కాపయ నాయకుడు పోరాటాన్ని ఉధృతం చేశాడు. క్రీ.శ. 1336లో కాపయ నాయకుడు మక్బూల్‌ను ఓరుగల్లు నుంచి తరిమివేసి కోటను జయించాడు.

తాను నడిచిన నేలే.. తాను చూసిన మనుషులే! కానీ ఇప్పుడతడు నాగయ కాదు.. మాలిక్ మక్బూల్. తానున్నది ఓరుగల్లులోనే కానీ.. అతడు ఓరుగల్లు వైపు కాదు.. ఢిల్లీ దర్బారు వైపు! ఓటమి అంగీకరించి మాలిక్ మక్బూల్ తిరిగి ఢిల్లీ దర్బారులో చేరాడు. సుల్తానుకు నమ్మిన బంటుగా ఉంటూ, పలు విజయాలు సాధించి పెట్టాడు. గుజరాత్, సింధు ప్రాంతాల్లో జరిగిన యుద్ధ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. అంతులేని సంపదను తీసుకొచ్చి సుల్తానుకు అప్పగించాడు. అలా సుల్తాను మెప్పు పొందాడు మక్బూల్.

మహమ్మద్ బీన్ తుగ్లక్ మరణానంతరం ఢిల్లీ సింహాసనం కోసం అనేక కుట్రలు, కుతంత్రాలు జరిగాయి. వాటన్నింటినీ ఎదుర్కొని తుగ్లక్ కొడుకు ఫిరోజ్ షాకే సింహాసనం దక్కేలా చేయడంలో మాలిక్ మక్బూల్ కీలక పాత్ర పోషించాడు. దీనికి మెచ్చిన ఫిరోజ్ షా ఢిల్లీ పీఠం అధిష్టించిన తర్వాత మక్బూల్‌ని వజీరు (ప్రధాన మంత్రి)గా నియమించాడు. భాషా ప్రాంత మత భేదాలను అధిగమించి ఢిల్లీ దర్బారులో మక్బూల్ ఈ కీలక పదవిని పొందడం అతని ప్రతిభా పాటవాలకు తార్కాణంగా నిలిచింది.

అటు తర్వాత ఫిరోజ్ షా సింధూ దేశపు దండయాత్రకు వెళ్లాడు. ఆ సందర్భంలో ఆరు నెలలు సుల్తాను నుంచి ఎలాంటి వార్తలూ లేవు. రాజ్యంలో తిరుగుబాట్లు మొదలయ్యాయి. సామంతులు కుట్రలకు పాల్పడ్డారు. ఈ విషమ పరిస్థితుల్లో మాలిక్ మక్బూల్ సుల్తాను కోసం ఎదురుచూడక తానే తిరుగుబాటుదారులను తిప్పికొట్టాడు. తిరుగుబాటు చేసిన సామంతులను అంతమొందించాడు. అనంతరం ఇది మెచ్చిన సుల్తాన్ మక్బూలే నిజమైన సుల్తాను అని పొగిడాడు. 'ఖాన్ ఎ జహాన్ తెలంగాణీ' అనే బిరుదుతో కీర్తించాడు. అప్పటి నుంచే నాగయ 'మాలిక్ మక్బూల్ తెలంగాణీ'గా పేరొందాడు. ఫిరోజ్ షా మక్బూల్‌ను ఎప్పుడూ పూర్తి పేరుతో ఆప్యాయంగా పిలిచేవాడట. దీంతో సుల్తాన్‌కు మక్బూల్ అత్యంత విశ్వాసపాత్రుడయ్యాడు. అతడు ఎంత చెబితే అంత! ఒక సందర్భంలో తురుష్క కోశాధికారి ఐన్ ఇ మమ్రూతో మక్బూల్‌కు విభేదాలు వచ్చాయి. మమ్రూను తొలగించాలని మక్బూల్ పట్టుబట్టాడు. సుల్తాన్ అలాగే చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచీ మక్బూలే కోశాధికారిగానూ వ్యవహరించాడు.

మాలిక్ మక్బూల్ తనదంటూ ఓ ప్రత్యేక పద్ధతి, క్రమశిక్షణ, స్వామి భక్తితో ఢిల్లీ ప్రభువుల మన్ననలు పొందాడు. ఓరుగల్లు పరిపాలనా అనుభవాల్ని ఢిల్లీ చక్రవర్తి పాలనలో చక్కగా ప్రదర్శించాడు. విశేషమైన ప్రజోపయోగ నిర్మాణాలు, వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలనూ చేపట్టాడు. ప్రజల మన్ననలే కాకుండా పాలకుల ప్రశంసలూ అందుకున్నాడు. అంతకు ముందు పరిపాలించిన ఢిల్లీ సుల్తానులు చేయనటువంటి వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను మాలిక్ మక్బూల్ చేయించాడు. ఫిరోజ్ షా కాలంలో జరిగిన అనేక ప్రజోపయోగమైన నిర్మాణాలు,

మసీదులు, రాజభవనాలు, సరాయిలు, విజయస్తంభాలు, వ్యవసాయ కాలువలు, ఉద్యానవనాలకు మూలం మక్బూలే. వీటన్నింటితో ప్రధాన ఆర్థిక అభివృద్ధిని సాధించిన ప్రతిభావంతుడుగా మక్బూల్ వాసికెక్కాడు.

మక్బూల్‌కు ఓరుగల్లు, ఢిల్లీలలో వారసులున్నారు. ఓరుగల్లుకు చెందిన ఇద్దరు కొడుకులు బైచ నాయుడు, దేవరి నాయుడు కాకతీయ సేనానులుగానే ఉన్నారు. బైచ నాయునికి పులియమార్కోలుగండ, మల్లసురత్రాణ అనే బిరుదులున్నాయి.

వృద్ధాప్యంలో మక్బూల్ సహజ మరణం (1369లోనా? 1372లోనా అనేది నిర్ధారణ కాలేదు) పొందాడు. మరణం తరువాత అతని ఢిల్లీ వారసుడు జౌనా ఖాన్ (జౌనా షా) వజీరు అయ్యాడు. ఇతడు తండ్రిలాగే సమర్థుడు. కానీ మంచి సైనిక నాయకుడు కాలేకపోయాడు. ఫిరోజ్ షా హయాంలోనే వజీరు పదవి కోసం జరిగిన కుట్రలో జౌనా బలయ్యాడు. అతణ్ని బంధించి మరణ శిక్ష విధించారు. బాగా పేరొందిన ఖిడికీ మసీదుతోపాటు ఏడు పెద్ద మసీదులు జౌనా కట్టించాడు. తండ్రి మాలిక్ మక్బూల్ అలియాస్ గన్నయ నాయుడి సమాధిని కూడా ఇతడే కట్టించాడు. ఈ సమాధి భారతదేశంలోనే మొదటి అష్టకోణ కట్టడం. ఇది ఢిల్లీలోని హజరత్ ఖ్వాజా నిజాముద్దీన్ ఔలియా దర్గా సమీపంలో ఉంది. పలు ఆక్రమణలు, పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ సమాధి నేడు శిథిలావస్థలో ఉన్నది.



ఓరుగల్లు కోట

## ఓరుగల్లుపై తిరిగి జెండా ఎగరేసిన

# ముసునూరి నాయకులు

**కాకతీయుల అనంతరం ఓరుగల్లు విముక్తి పోరాటాన్ని మొదలుపెట్టిన వారు కాకతి ప్రతాపరుద్రుని సేనా నాయకులైన కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమ నేడు, బెండపూడి అన్నయమంత్రి. ఈ ముగ్గురు ఈ తిరుగుబాటుకు యువ నాయకుల అవసరాన్ని గుర్తించారు. కాకతీయ సామ్రాజ్యంలో కొనసాగిన నాయంకరుల్లో రేకపల్లి సామంతుడైన ముసునూరి ప్రోలయ నాయకుడు అన్నయమంత్రికి విధేయుడు. ఇతడిని తాము సంకల్పించిన తిరుగుబాటుకు నాయకునిగా ఎన్నుకున్నారు.**

### ప్రోలయ నాయకుడు (క్రీ.శ. 1225-1333)

ప్రోలయ నాయకుడు మహావీరుడు. సాహసి. ఇతను ఉత్తర తెలంగాణ, దక్షిణ మన్యం ప్రాంతా లలో వన, గిరి దుర్గాలను స్థావరంగా చేసుకుని ముస్లింలపై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగు

బాటులో ప్రోలయ నాయకునికి కుడి భుజంగా అతని చిన్నాన్న కొడుకు కాపయ నాయకుడు నిలిచాడు. వీరికి ఎరపోత నాయకుడు, ముమ్మిడి నాయకుడు, అనపోత నాయకుడు తోడు నిలిచారు. వీరందరూ ప్రోలయ నాయకుని దాయాదులు.

తాడితులు, పీడితులైన ప్రజల మద్దతుతో బలమైన తిరుగుబాట్లతో క్రమక్రమంగా ముస్లింల చేతిలోని మొసలి మడుగు, సాతానికోట, కందనవోలు, కలువకొలను, రాచూరిలాంటి పలు కోటలను గెల్చుకుని అక్కడి నుండి వారిని తరిమికొట్టారు. ప్రజాకంటకులైన వారిని హతమార్చారు. క్రమక్రమంగా క్రీ.శ. 1328 – 1329 నాటికి తెలంగాణ పశ్చిమ ప్రాంతం నుండి ముస్లింలను పూర్తిగా తరిమికొట్టారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజల నుండి లాక్కున్న భూములు, ఆస్తులు మన్యాలను తిరిగి వారికి అప్పగించారు. వైదిక ధర్మాన్ని తిరిగి పునరుద్ధరించారు. ఈ హైందవ జాతి విముక్తి పోరులో పాల్గొన్న వారంతా కాకతీయ సైన్యంలో శిక్షణ పొందినవారే. వీరి తండ్రులు కాకతీయ ప్రతాపరుద్రుని సేవించిన వారే.

తెలంగాణ, కోస్తా ప్రాంతాల్లోని చాలా భాగాల్ని విముక్తం చేసిన తరువాత స్వతంత్ర రాజధాని అయిన రేకపల్లిని చేరుకుని ప్రోలయ అక్కడే మరణించాడు. అప్పటికింకా ఓరుగల్లు విముక్తం కాలేదు. ప్రోలయ తర్వాత పోరాటాన్ని కాపయ నాయకుడు కొనసాగించాడు.

## కాపయ నాయకుడు (క్రీ.శ. 1333-1369)

ప్రోలయ నాయకుని మరణానంతరం అతని చిన్నాన్న కొడుకైన కాపయ నాయకుడు రేకపల్లి సింహాసనాన్ని అధిష్టించి ముస్లిం పాలకులపై సంపూర్ణ స్వాతంత్ర్య పోరును ఆరంభించాడు.

కాపయ నాయకుడు కాకతీయుల కాలంలో ఆమనగల్లు నాయంకరానికి అధిపతిగా ఉండేవాడు. ముస్లిం చరిత్రకారులు ఇతణ్ని కన్నా నాయక్, తెలంగాణ వలీ అని పిలిచేవారు. ఇతడిని ప్రతాపరుద్ర ప్రతిమా ప్రభావుడని కవులు కీర్తించారు.

ఓరుగల్లును గుప్పెట్లో పెట్టుకుని ఇంకా రాజ్యం చేస్తున్న ముస్లిం పాలకుల్ని పూర్తిగా తరిమికొట్టడానికి మహా యుద్ధాన్ని తలపెట్టాడు కాపయ. ఈ యుద్ధం విజయవంతంగా కావడానికి ద్వారసముద్ర పాలకుడైన మూడవ వీర భల్లాలుని మద్దతు కూడగట్టుకున్నాడు.

ఓరుగల్లు స్థానిక ప్రజలతో రహస్యంగా చర్చలు జరిపి, తన సహచరులైన అనపోత నాయకుడు, ముప్ప, కొప్పుల నాయకులతో కలిసి ఓరుగల్లుపై దండెత్తాడు. కాపయ నాయకుని దండయాత్రతో ఎదురు నిలువలేక తమ సైన్యం సర్వనాశనం కాగా ముస్లింలంతా ఓరుగల్లు కోటను విడిచి పారిపోయారు. ఓరుగల్లు పాలకునిగా సుల్తాన్‌తో నియమింపబడ్డ మాలిక్ మక్బూల్ ఢిల్లీకి పారిపోయాడు. ఆ తర్వాత అక్కడే తుగ్లక్ దర్బార్‌లో మంత్రిగా చేరాడు.

ముస్లింల చెర నుంచి తెలుగు ప్రాంతం ఒక్కొక్కటిగా విడివడే ప్రక్రియ పూర్తయ్యి ఓరుగల్లు కోట బురుజులపై క్రీ.శ. 1336లో మళ్లీ హిందూ పతాకం ఎగిరింది. ఈ సంపూర్ణ విజయానికి కారకుడైన కాపయ నాయకుడు ఆంధ్ర సుత్రాణ, ఆంధ్ర దేశాధీశుడు అనే బిరుదులతో ఓరుగల్లు సింహాసనాన్ని అధిష్టించాడు. తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతాలకు పాలకుడయ్యాడు.



కౌలాస్ కోట

## చిన్నచిన్న రాజ్యాలుగా చీలిపోయిన

# మహాసామ్రాజ్యం

**కాకతీయుల అనంతరం దాదాపు 13 ఏండ్ల తర్వాత ఓరుగల్లు కోట బురుజులపై మళ్లీ తెలుగు వారి పతాకం ఎగిరింది. ముస్లింల చెర నుంచి తెలుగు ప్రాంతాన్ని ఒక్కొక్కటిగా విడిపించే ప్రక్రియ మొదలుపెట్టిన ముసునూరి నాయకులు దానిని సాధించారు. ఈ సంపూర్ణ విజయానికి కారకుడైన కాపయ నాయకుడు ఓరుగల్లు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇదే సమయంలో కాకతీయ నాయంకరులు అనేక చిన్న చిన్న రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు.**

**నాయంకరులు అంతా ఏకమై** తమ ఉమ్మడి లక్ష్యం నెరవేర్చుకున్నారు. అటు తర్వాత తలో దిక్కున స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ, అంతా కలిసి కాపయ నాయకుని నాయకత్వంలో ఏకైక హిందూ దేశాన్ని ఏర్పాటు చేసుకోలేకపోయారు. తెలంగాణ ప్రాంతంలో సింహభాగం కాపయ నాయకుని పరిపాలనలో ఉండేది.

సంగమ వంశీయులైన హరిహర, బుక్కరాయలు (వీరూ కాకతీయ నాయంకరులు) అనెగొందిలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. అటు తర్వాత అదే విజయనగర రాజ్యంగా ఏర్పడింది. మరో పక్క రేచర్ల పద్మనాయకులు రాచకొండ రాజ్యం (క్రీ.శ. 1336–1369) ఏర్పాటు చేసుకున్నారు. అంతకు ముందే అద్దంకి కేంద్రంగా కొండవీటి రెడ్డి రాజ్యం (క్రీ.శ. 1325 – 1448) ఏర్పాటైంది.

ఇక ఎవరి రాజ్యం వారిది. ఎవరి పాలన వారిది. కాపయ నాయకుడు నాయంకరులను ఏకం చేసి ఢిల్లీ సుల్తాన్‌ను ఎదిరించాడు కానీ.. ఇప్పుడతడు ఒంటిరి. భవిష్యత్తులో ఢిల్లీ సుల్తాను ఓరుగల్లుపై తిరిగి దాడి చేసే ప్రమాదం ఉందని భావిస్తూనే ఉన్నాడు. అందుకే పక్క రాజ్యాలను మిత్ర రాజ్యాలుగా మార్చుకునే ప్రయత్నం చేశాడు. శత్రువుకు శత్రువు మిత్రువు. ఢిల్లీ సుల్తాన్‌పై అల్లావుద్దీన్ బహమన్ షా (హసన్ గంగూ బహమనీ) తిరుగుబాటు చేశాడు. ఈ ముస్లిం సర్దారు నేటి కర్ణాటకలోని కలుబరిగి (గుల్బర్గా) రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని పాలించేవాడు. ఈ రాజ్యాన్నే బహమనీ రాజ్యమంటారు. ఢిల్లీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్న బహమన్‌షాకు సహాయం చేస్తే తన రాజ్యం పక్కనే ఒక మిత్ర రాజ్యం ఉంటుందని కాపయ భావించాడు. ఢిల్లీ సుల్తాన్ తమపైకి దాడికి దిగితే ఇరు రాజ్యాలు కలిసి బలంగా, సులభంగా తరిమికొట్టవచ్చని కూడా భావించి అతడికి సైన్య సహాయం చేశాడు. ఈ విషయాన్ని ముస్లిం చరిత్రకారుడైన ఫెరిస్తా తన రచనల్లో ప్రస్తావించాడు. ఇంతవరకూ బాగానే ఉంది, కానీ బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ బహమన్ షా ఏరు దాటాక తెప్ప తగలేసే రకం. కాపయతో అవసరం తీరగానే స్నేహం మరిచి ఓరుగల్లుపైనే దాడి చేశాడు. క్రీ. శ. 1350లో జరిగిన ఈ యుద్ధంలో ఓడిపోయాడు. బహమనీ సుల్తాన్‌తో సంధి చేసుకున్నాడు. ఇందులో భాగంగా కాపయ నిజామాబాద్ జిల్లాలోని కౌలాస్ కోటను వదులుకోవాల్సిన వచ్చింది.

ఇది జరిగిన కొద్ది కాలానికే తమకు కప్పం కట్టడం లేదనే నెపంతో క్రీ.శ. 1356లో బహమనీ సేనలు మళ్లీ ఓరుగల్లు పైకి దాడి చేశాయి. ఆ యుద్ధంలోనూ ఓడిపోయిన కాపయ నాయకుడు ఈసారి బహమన్ షాకు భువనగిరి కోటను ఇవ్వాల్సి వచ్చింది. అటుతర్వాత కాలంలో అల్లావుద్దీన్ బహమన్ షా చనిపోయాడు. అనంతరం గుల్బర్గా సింహాసనాన్ని మొదటి మహ్మద్ షా (అహ్మద్ షా) అధిష్టించాడు. ఈ సందర్భాన్ని కాపయ అవకాశంగా తీసుకున్నాడు. బహమనీల వల్ల తాము కోల్పోయిన కోటల్ని తిరిగి స్వాధీన పరుచుకోవాలనుకున్నాడు. ఈ బాధ్యతను తన కుమారుడైన వినాయకదేవుడికి అప్పగించాడు. అతనికి సహాయంగా ఇరవై వేల విజయనగర సైన్యం కూడా బయలుదేరింది. దీన్ని పసిగట్టిన బహమనీ సేనలు మార్గ మధ్యంలోనే విజయనగర సైన్యంపై దాడి చేసి ఓడించాడు. కానీ మరోవైపు నుంచి



భువనగిరి కోట

వినాయకదేవుడు దాడి చేశాడు. క్రీ.శ. 1361లో జరిగిన ఈ యుద్ధంలో భువనగిరి కోటను తిరిగి జయించి ఓరుగల్లు రాజ్యంలో కలుపుకొన్నాయి కాపయ సేనలు.

ఈ ఆనందం ఎక్కువ రోజులు నిలువ లేదు. ఇది జరిగిన కొద్ది రోజులకే పెను విషాదం చోటు చేసుకుంది. కొందరు అరబ్బు వర్తకులు కొన్ని మేలు జాతి గుర్రాలకు తమ రాజ్యం గుండా తీసుకువెళ్తుండడం వినాయకదేవుడు చూశాడు. అబ్బుర పరిచే ఆ గుర్రాలను చూసి అరబ్బు వర్తకులను ఆపించాడు. వారి వద్ద ఉన్న గుర్రాలలో నచ్చిన వాటిని కొనుగోలు చేశాడు. అయితే అరబ్బు వర్తకులు వెళ్తున్నది బహమనీ సుల్తాన్‌కు అమ్మడానికి. ఈ విషయం వర్తకుల ద్వారా బహమనీ సుల్తాన్ మహ్మద్ షాకు తెలిసింది. ఆయన తీవ్ర ఆగ్రహంతో.. 'నేను కొనాల్సిన గుర్రాల్ని నువ్వెలా కొంటావ్' అంటూ హూంకరించాడు. వెంటనే వినాయకదేవుడు నివాసముంటున్న కోట (వెలంపుట్టన్?) పై దాడి చేశాడు. ఆ యుద్ధంలో వినాయకదేవుడు ఓడి పోయాడు. బహమనీలకు బంధీ అయిపోయాడు. వినాయనదేవుడిని నానా చిత్ర హింసలు పెట్టారు. బతికుండగానే సజీవ దహనం చేశారు. ఇలా అతిక్రూరంగా అక్కసు తీర్చుకున్న మహ్మద్ షా సైన్యాలపై హిందూ సైన్యాలు విరుచుకు పడ్డాయి. తిరుగు ప్రయాణంలో పలుమార్లు దాడిచేసి బహమనీ సైన్యాన్ని సర్వనాశనం చేశాయి. ఆ సైన్యం తమ రాజధాని గుల్బర్గా చేరుకునే లోపు కేవలం 1500 మంది మాత్రమే మిగిలారు. అంతేకాదు, చావుతప్పి కన్ను లొట్టపోయినట్లు అహ్మద్ షా భుజాన్ని సైతం హిందూ సేనలు తీవ్రంగా గాయపరిచాయి.

మిత్రుడు అవుతాడనుకుని సహాయం చేసినవాడే పలుమార్లు తమపై దాడి చేయడం కాపయ నాయకున్ని కలచివేసింది. బహమనీల దౌర్జన్యకాండ భరించలేక కాపయ వారి శత్రువైన ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్‌షా సహాయాన్ని కోరాడు. ఈ విషయం తెలిసిన మహ్మద్ షా మరింత రెచ్చిపోయాడు. తన సైన్యాన్ని వెంటనే గోల్కొండ, ఓరుగల్లు కోటలపైకి పంపాడు. సగం సైన్యమే మిగిలి ఉన్న కారణంగా కాపయ నాయకుడు ఆ యుద్ధంలో ఓడిపోయాడు. యుద్ధ పరిహారంగా

గోల్కొండ కోట బహమనీల చేతిలోకి వెళ్లిపోయింది. దీంతో పాటు అపార ధనరాశులూ ఇచ్చి బహమనీ సుల్తాన్‌తో మళ్లీ సంధి చేసుకున్నాడు కాపయ. ఈ సంఘటన క్రీ.శ. 1364–65ల మధ్య జరిగింది.

పై పరిణామాలతో కాపయ నాయకుడి గౌరవ ప్రతిష్టలు దెబ్బతిన్నాయి. నిన్నమొన్నటి దాకా పక్క రాజ్యం నుంచి ఉన్న ప్రమాదం ఇప్పుడు సొంత వారి నుంచి మొదలైంది. సామంతులే ఎదురు తిరిగారు. ఎవరికి వారే చిన్నచిన్న రాజ్యాలుగా స్వతంత్రం ప్రకటించుకున్నారు.

ముసునూరి నాయకులకు, రేచర్ల పద్మనాయకులకు మొదటి నుంచి అభిప్రాయ భేదాలు ఉండేవి. కలిసి పోరాడినంత మాత్రాన ఇప్పుడు మాపై మీరు అధికారం చేస్తామంటే ఎలా అనే అభ్యంతరాలు ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటి రాచకొండ పాలకుడైన రేచర్ల అనపోతా నాయకుడు తన సోదరులతో కలిసి ఓరుగల్లు పైకి దండెత్తాడు.

క్రీ.శ. 1369లో భీమారం (నేటి హన్మకొండలో భాగం) వద్ద రేచర్ల పద్మనాయకులకు, కాపయ నాయకునికి మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో కాపయ నాయకుడు మరణించాడు. ఓరుగల్లును ముస్లిం పాలకుల నుండి విముక్తం చేసి తెలుగు నేలపై హిందువులకు స్వేచ్ఛావాయువులు ప్రసాదించిన కాపయ నాయకుడు చివరికి సాటి హిందూ పాలకుల చేతిలోనే ఓడిపోయి మరణించాడు.

ఈ యుద్ధంతో ఓరుగల్లు పతనమై పోయి రేచర్ల పద్మనాయకుల వశమైంది. భీమారం యుద్ధంతో ముసునూరి వంశం కూడా అంతరించిపోయింది. ఈ యుద్ధం తర్వాత తెలంగాణ కంతటికీ రాచకొండ పద్మనాయకులే అధిపతులయ్యారని అయ్యనవోలు శాసనం చెబుతున్నది.



రేచర్ల పద్మనాయకుల కాలం నాటి ఆలయం, పిల్లలమర్రి

# రేచర్ల పద్మనాయకుల మూలాలు,
# తొలితరం నాయకులు

త్రిలింగ సామ్రాజ్య రాజధానియైన ఓరుగల్లు కులమత విభేదాలు, రాజకీయ వైషమ్యాలు, అంతఃకలహాలనే గాక మహమ్మదీయులనూ ఎదుర్కొని విరాజిల్లింది. ఆనాటి సామ్రాజ్యం కుల, మత, వర్గాలకు ప్రధాన కాలం అయినప్పటికీ కాకతీయ చక్రవర్తులు జాగ్రత్తగా ఆయా నాయకుల భుజ బల మేధా సంపత్తులను ఉపయోగించుకోవడంలో సఫలీకృతులయ్యారు. దేశాన్ని పరాధీనం కానీయకుండా సామ్రాజ్యాన్ని నిలుపడంలో కాకతీయులకు తోడు క్షత్రియులు, పద్మనాయకులు, బ్రాహ్మణులు, రెడ్లు ప్రధాన వర్గాలుగా నిలిచి జాతికి జీవన నాడులై దేశ సమగ్రతను కాపాడారు. కానీ ప్రతాపరుద్రుని తర్వాత ఆ మహా సామ్రాజ్యం అంతరించిపోయింది. అనేక చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. అంతఃకలహాలు చెలరేగాయి.

**మహమ్మదీయులను తరిమికొట్టి** ఓరుగల్లుపై తిరిగి మన జెండా ఎగరేసిన ముసునూరి నాయకులకు, రాచకొండ కేంద్రంగా స్వతంత్ర పాలన చేస్తున్న రేచర్ల పద్మనాయకులకు మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటి రాచకొండ పాలకుడైన రేచర్ల అనపోతా నాయకుడు తన సోదరులతో కలిసి ఓరుగల్లుపైకి దండెత్తాడు.

క్రీ.శ. 1369లో భీమారం (నేటి హన్మకొండలో భాగం) వద్ద రేచర్ల పద్మనాయకులకు, ముసునూరి నాయకులకు యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ముసునూరి నాయకుడు, ఓరుగల్లు పాలకుడు అయిన కాపయ నాయకుడు మరణించాడు. దీంతో ముసునూరి వంశం అంతరించిపోవడమే కాకుండా ఓరుగల్లు రేచర్ల పద్మనాయకుల వశమైంది. దీంతో రేచర్ల పద్మనాయకులు తెలంగాణకంతటికీ అధిపతులయ్యారు.

ఇది ఒక చారిత్రక ఘట్టం.

ఒక రాజ్యం మహా సామ్రాజ్యంగా ఎదిగే క్రమంలో ఇలాంటి ఘట్టాలెన్నింటినో దాటాలి.

ఒకరి పతనం.. మరొకరికి విజయం.

ఇది అలాంటి సందర్భమే.

రాచకొండ ఇప్పుడు రాజ్యస్థాయి నుంచి సామ్రాజ్య స్థాయికి ఎదిగింది.

ఇంతకీ ఎవరీ పద్మనాయకులు? వీరి మూలాలేమిటి?

కాకతీయ మహా యుగాన కాకతీయ రుద్రదేవుడి కాలం నుంచి, అటు తర్వాత గణపతిదేవ చక్రవర్తి, సామ్రాజ్ఞి రుద్రమదేవి, ప్రతాపరుద్ర చక్రవర్తుల కాలాల్లోనూ అనేకానేక బాధ్యతాయుత పదవులను అలంకరించిన వారిలో పద్మనాయకులూ ముఖ్యులు అని చరిత్ర చెబుతున్నది. 'కాకతీయ రాజ్య ప్రారంభానికి పూర్వం నుండే పద్మనాయకులు విఖ్యాత శౌర్యవంతులై ప్రఖ్యాతిగాంచినట్లు చారిత్రకాధారాలు స్పష్టంగా ఉన్నాయని, కాకతి రాజ్య స్థాపనాచార్యులుగా, సేనానులుగా, సామంతులుగా, కవి, పండిత, కళాపోషకులుగా కీర్తినార్జించారు' అని 'పద్మనాయక చరిత్ర' గ్రంథంలో కోటగిరి వెంకట నరసింహ సత్యనారాయణరావు రాశారు.

వీరిని 'రేచర్ల వెలమలు' అంటారు. ఈ అంశపు మూల పురుషుడైన రేచడి పేరు మీదుగా వీరు రేచర్ల వారయ్యారు. రేచడినే బేతళ నాయుడు అని కూడా అంటారు.

'రాచకొండ చరిత్రము' పుస్తకంలో తేరాల సత్యనారాయణ శర్మ బేతళ నాయుడికి సంబంధించిన ఒక కథను రాశారు.

'పద్మనాయకులకు మూలపురుషుడైన బేతళ నాయుడు అమనగంటి పురాన్ని పాలించేవాడు. రేచడు ఇతని సేవకుడు. రేచడు ఒకసారి పొలం దున్నుతుండగా రాయి తగిలి నాగలి పగిలిపోగా, అచ్చట నిధి ఒకటి గానవచ్చెను. ఆ నిధిని వారు వెలికిదీయుటకు ప్రయత్నించగా నరబలి ఇస్తేనే అది లభిస్తుందని ఆకాశవాణి వినిపించింది. తక్షణమే సేవకుడైన రేచడు అందుకు

అంగీరించి తన ప్రాణాలర్పించాడు. ఆ త్యాగానికి గుర్తుగా అతని వారసులు రేచర్ల వారు కీర్తింపబడ్డారు' – ఇదీ ఆ కథ. సామాన్యంగా పరాక్రమ శూరులైన వారి విషయంలో ఇలాంటి కథలెన్నో ప్రచారంలో ఉంటాయి. అంతేగానీ, దీనికి ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవు. ఇది ఒక పుక్కిటి పురాణమే అని కూడా తేరాల రాశారు. ఇలాంటి కథే స్థానికంగా జనబాహుళ్యంలో కూడా ఉన్నది. రేచడు గణపతిదేవుడి కొలువులో ఉండేవాడు. గణపతిదేవుడి సుస్థిర సామ్రాజ్య విస్తరణ కోసం ఒక నిధిని కట్టబెట్టే క్రమంలో ప్రాణత్యాగం చేశాడనేది ఆ కథ. రెండు కథలూ ఇంచుమించు ఒకేలా ఉన్నాయి. కాకతీయుల పరుసవేదికి సంబంధించిన కథలు కూడా మనం గతంలో చదువుకున్నాం. అవన్నీ జనబాహుళ్యంలో ఉన్న కథలే తప్ప చారిత్రక ఆధారాలు ఉన్నవి మాత్రం కాదు. బేతళ నాయుడి జన్మస్థలం అమనగల్లు (నల్లగొండ జిల్లా మిర్యాలగూడ దగ్గర). ఆ కాలంలో రేచర్ల వెలమలు కాకతీయుల సామంతులుగా అమనగల్లు, పిల్లలమర్రిని పరిపాలించేవారు.

## పద్మనాయకుల తొలితరం

కాకతీయుల సామంతుల్లో రేచర్ల నాయకులైన పద్మనాయకులు రుద్రమదేవునికి సేనానులుగా ఉండి అతనికి ఎంతో సాయం చేసినట్లు నిదర్శనాలున్నాయని, ఈ వంశంలోని తొలి నాయకులు రుద్రమదేవి, ప్రతాపరుద్రుల దగ్గర పనిచేశారని 'వెలుగోటి వారి వంశావళి' అనే తెలుగు గ్రంథం పేర్కొంటున్నది. దీని ప్రకారం రేచర్ల పద్మనాయకుల మూల పురుషుడు బేతళ నాయకునికి దామా నాయుడు, ప్రసాదిత్యనాయుడు, రుద్రానాయుడు (రుద్ర నాయకుడు) అనే ముగ్గురు కుమారులున్నారు.

'రుద్ర నాయకుడి కుమారుడైన బిచ్చి (దాచా) నాయకుడు విసునూరు ప్రాంతాన్ని నాయంకర హోదాలో పాలించాడని, అతనికి 'కాకతి రాజ్య స్థాపనాచార్య' బిరుదు ఉందని విసునూరులో వెలుగుచూసిన, ప్రచురితం కాని క్రీ.శ. 1280 నాటి శాసనం పేర్కొంటున్నదని 'కాకతీయులు' గ్రంథంలో పి.వి. పరబ్రహ్మశాస్త్రి రాశారు. ఈ గ్రామంలో ఇప్పుడు కూడా అత్యధికులు వెలమ కులస్తులే కావడాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఆ శాసనంలో ఉన్న రుద్రనాయకుడు ప్రసాదిత్యుని తమ్ముడై ఉండవచ్చని శాస్త్రి భావించారు.

## రేచర్ల రుద్రుడు

బేతళ నాయకుని కుమారుడైన రేచర్ల రుద్రుడు కాకతీయ గణపతిదేవుని పరిపాలనా ప్రారంభ రోజుల్లో రాజ్య సిరిసంపదలను, వైభోగాన్ని తిరిగి స్థాపించడంలో ప్రధానపాత్ర పోషించాడు. కాకతీయ రాజు రుద్రదేవుడు, అతని సోదరుడు మహాదేవుడు యాదవ రాజులతో జరిగిన యుద్ధంలో మరణించారు. కాకతీయ వారసుడయిన గణపతిదేవుడిని యాదవ రాజు జైతుగి దేవగిరిలో బంధించాడు. ఈ సమయంలో రాజ్యాన్ని రక్షించడంలో రేచర్ల రుద్రుడు కీలక పాత్ర పోషించాడు. యాదవరాజు నుంచి గణపతిదేవుడిని విడిపించడంలో విజయం సాధించాడు.

ఇందుకుగాను రేచర్ల రుద్రుడు తర్వాత 'కాకతి రాజ్య సామ్రాజ్యధౌరేయ' అనే బిరుదు

అందుకున్నాడు. పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని నిర్మించింది ఈ రుద్రుడే.

## రేచర్ల ప్రసాదిత్యుడు

బేతళ నాయకుని రెండో కుమారుడైన ప్రసాదాదిత్యుడు రుద్రమదేవిని కాకతీయ సింహాసనంపై కూర్చోబెట్టాడని, రుద్రమదేవి పట్టాభిషేకాన్ని వ్యతిరేకించిన వారందరినీ అణిచివేశాడనీ 'వెలుగోటి వారి వంశావళి' చెబుతున్నది. ఇతనికి ఉన్న కాకతి రాజ్య స్థాపనాచర్య, రాయపిత మహాంక బిరుదులు కూడా ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. కాకతీయ పాలనలో నాయంకర వ్యవస్థను ప్రవేశ పెట్టిన ఘనత కూడా ఇతనికే దక్కుతుందని కూడా ఆ గ్రంథం పేర్కొంటున్నది.

## వెన్నమ నాయుడు

దామానాయుడు, ప్రసాదిత్యుని కుమారుల్లో వెన్నమ నాయుడు, సబ్బి నాయుడు ప్రఖ్యాతులు. వెన్నమ నాయుడి వీరత్వం గురించి శాసనాలలో, వెలుగోటి వారి వంశావళిలో ప్రస్తావనలు ఉన్నాయి. ఉత్తరాదినంతా జయించిన తర్వాత తురుష్కుల కన్ను దక్షిణాదిపై పడింది. ఢిల్లీ సుల్తాను అల్లావుద్దీన్ ఖిల్జీ దేవగిరిని జయించాడు. క్రీ.శ. 1303లో తొలిసారి తురుష్కులు ఓరుగల్లుపై దాడి చేశారు. ఈ ప్రమాదాన్ని ముందే ఊహించిన కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు తన సేనాధిపతులను సిద్ధం చేశాడు. కాకతీయ సైన్యానికి వెన్నమ నాయుడు, పోతుగంటి మైలి నాయకత్వం వహించారు. మాలిక్ ఫక్రుద్దీన్ జునా, కర్రాకు చెందిన ఝూజాల నాయకత్వంలో మహమ్మదీయ సైన్యం వింధ్య పర్వతాలను దాటి కాకతీయ సామ్రాజ్య సరిహద్దుల దాకా రాగలిగింది. కానీ కాకతీయ సైన్యం తురుష్కుల సైన్యాన్ని ఉప్పరపల్లి వద్ద దెబ్బతీసింది. ఇక్కడ జరిగిన చండప్రచండ యుద్ధంలో తురుష్కులు తోక ముడిచారు. తురుష్కుల తొలి దండయాత్రను తిప్పి కొట్టడంలో సఫలీకృతమైనందుకు వెన్నమనాయుడు ప్రతాపరుద్రుని ప్రశంసలు అందుకున్నాడు.

## ఎఱదాచ నాయుడు, నలదాచ నాయుడు

వెన్నమ నాయునికి ఎఱదాచ నాయుడు, సబ్బి నాయునికి నలదాచ నాయుడు అనే కుమారులున్నారు. ఎఱదాచ నాయుడు శౌర్య పరాక్రమాలతో కాకతీయులకు సాధించిన కంచి విజయం గొప్పదిగా చరిత్రకారులు పేర్కొన్నారు. కాకతీయులు చేసిన సహాయాన్ని మరిచిన పాండ్యులు తిరిగి కంచిని ఆక్రమించుకున్నారు. వీరిని ఎదుర్కొనే బాధ్యతను ప్రతాపరుద్రుడు రేచర్ల ఎఱదాచ నాయునికి అప్పగించాడు. ఇతనికి తోడు ముప్పిడినాయకుడు, కొలని రుద్రదేవులు కూడా వెళ్లారు. క్రీ.శ. 1316లో జరిగిన ఈ యుద్ధంలో ఎఱదాచ నాయునితో పాటు అతని సోదరుడు నలదాచ నాయుడు, కుమారుడు ఒకటవ సింగమనాయుడు కూడా పాల్గొన్నారు. ఎఱదాచ నాయుడు అసామాన్య సాహస పరాక్రమాలతో భీకరమైన పాండ్య గజదళాన్ని ఎదిరించి, పంచపాండ్యులైన వీర, విక్రమ, పరాక్రమ, సుందర, కులశేఖర పాండ్యులను జయించి కంచిని అవలీలగా సాధించాడు. ఇతడు చూపిన పరాక్రమ సాహసాలను ప్రతాపరుద్రుడు మెచ్చుకుని పంచపాండ్య దళవిభాళ, పాండ్య గజకేసరి, కంచికవాట చూరకార అనే బిరుదులతో సత్కరించాడు.



రాచకొండ కోట ముఖద్వారం

# అశీతి వర సింగమనేడు

ప్రతాపరుద్రుని ప్రసిద్ధ సేనానులలో ఒకడైన ఎఱదాచ నాయుని పుత్రులలో జ్యేష్ఠుడు రేచర్ల సింగమ నాయుడు. ఇతడు పద్మనాయకుల వంశ చరిత్రలో ముఖ్యుడు. రాచకొండ.. చిన్న రాజ్యం స్థాయి నుంచి సామ్రాజ్య స్థాయికి విస్తరించడంలో ఇతను కీలక భూమిక పోషించాడు. సింగమ నాయుడు తన జీవిత కాలంలో కొంత కాలం కాకతీయ సైన్యాధ్యక్షునిగా, మరికొంత కాలం స్వతంత్ర రాజుగా పాలన సాగించాడు. ఈ రెండు నేపథ్యాల్లోనూ సింగమ చూపిన పరాక్రమ శౌర్యాలు అతని వీరత్వానికి, ధీరత్వానికి సూచికలు. ప్రతాపరుద్రునికి చేసిన అనేక సహాయాలకు మెచ్చి సింగమకు ఎన్నో బిరుదులు ఇచ్చాడు. దీంతో తొలి సింగభూపాల నామధేయుడిగా, అశీతి వర బిరుదాంకితుడుగా రేచర్ల సింగమనాయుడు చరిత్రకెక్కాడు.

**రేచర్ల సింగమ నాయుడినే** సింగభూపాలుడు, సింగమనేని, సింగమనేడు, ఒకటవ సింగ భూపాలుడు అని కూడా పిలుస్తారు. ఇతనికి వెన్నమ నాయుడు, ఏచమ నాయుడనే సోదరులు న్నారు. సింగమనేని కాలంలోనే కాకతీయ రాజ్యంలో అనేక చారిత్రక ఘట్టాలు జరిగాయి. కాకతీయ మహా సామ్రాజ్యం అంతరించి తెలుగు దేశంలో తిరిగి స్వతంత్ర రాజ్యాలు ఏర్పడడం ఈ పరిణామాల్లో ముఖ్యమైనది.

సింగమనాయుడు మహావీరుడు, పరాక్రమశాలి, యుక్త వయస్సు నుంచే తండ్రి ఎఱదాచ నాయడితో పాటు యుద్ధాల్లో పాల్గొనేవాడు. పాండ్యులను ఎదుర్కొనే బాధ్యతను ప్రతాపరు ద్రుడు ఎఱదాచ నాయుడికి అప్పగించినప్పుడు ఆ యుద్ధంలో సింగమ పాల్గొన్నాడు. ఈ యుద్ధంతో కంచిని సాధించి పెట్టినందుకు ప్రతాపరుద్రుడు ఎఱదాచను పంచపాండ్య దళవిఫాళ, పాండ్య గజకేసరి, కంచికవాట చూరకార అనే బిరుదులతో సత్కరించాడు. ఇదే యుద్ధంలో సింగమనాయుడి పరాక్రమాన్ని మెచ్చుకోవడమే కాక ప్రతాపరుద్రుడు అతనిని సైన్యాధ్యక్షుడుగా చేర్చుకున్నాడు.

కంపిలి (ప్రస్తుతం కర్ణాటకలోని బళ్లారి జిల్లా)ని ఏలుతున్న కుమార రాముడు ప్రతాపరు ద్రుడితో వైరం వహించి కాకతీయ రాజ్యంలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నాడు. ఇతన్ని ఎదు ర్కొనేందుకు క్రీ.శ.1320లో ప్రతాపరుద్రుడు సింగమనాయుడిని పంపాడు. ఇతనికి తోడు బెండ పూడి అన్నయమంత్రి కూడా వెళ్లాడు. కమ్మటం (ప్రస్తుత కర్ణాటక కొప్పల్ జిల్లాలోని హెమగుడ్డ గ్రామానికి చేరువలో ఉండే గ్రామం) వద్ద జరిగిన యుద్ధంలో సింగమనేడు కంపిలి రాముడిని అవలీలగా ఓడించాడు. దీంతో కుమార రాముడు సంధి చేసుకుని నష్టపరిహారంగా ఆరు వేల గుర్రాలను సమర్పించుకున్నాడు. కన్నడ భాషలోనున్న కుమార రాముని చరిత్ర, ద్విపద బాల భాగవతంలో ఈ వివరాలున్నాయి.

'ప్రతాపరుద్రుని పరిపాలనా కాలంలో మగతల (ప్రస్తుత మహబూబ్‌నగర్‌లోని మక్తల్) అనే గ్రామం వద్ద మచ్చి కొమ్మ నాయుడిని, జిలుగుపల్లి వద్ద రుద్రమ నాయుడు అనే వాడిని యుద్ధాల్లో సంహరించి 'మచ్చనాయకరగండ' అనే బిరుదును, 'సామంతరాగోల', 'కొదమనా యక తలగుండుగండ' అనే బిరుదులను ప్రతాపరుద్రుని వల్ల పొందాడు' అని వెలుగోటి వారి వంశావళి చెబుతున్నది.

సర్వ సైన్యాధ్యక్షుడిగా సింగమనేడు అనేక యుద్ధాలు చేశాడు. ప్రభువైన ప్రతాపరుద్రునికి ఎన్నో విజయాలు సాధించి పెట్టాడు. ఇందుకు సంతోషించిన ప్రతాపుడు సింగమ పరాక్రమాన్ని కొనియాడుతూ బిరుదులిచ్చాడు. మొత్తంగా 'సింగమనాయునికి ఎనభై (అశీతి) బిరుదులున్నా యని, అందుకే సింగమనాయుడు అశీతి (80) వర సింగమ నాయుడిగా ప్రసిద్ధి కెక్కాడ'ని వెలుగోటి వారి వంశావళి పేర్కొంటున్నది. సింగమనాయునికి 'రాయబందీ విమోచక' అనే బిరుదు కూడా ఉన్నట్లు ఈ గ్రంథం చెబుతున్నది.

'ప్రతాపరుద్రుని యుగంధరామాత్య సహాయుడై ఢిల్లీ సుల్తాను చెరవిడిపించి 'రాయబందీ విమోచక' అనే బిరుదు కూడా పొందాడు' సింగమనాయుడు అని 'పద్మనాయక చరిత్ర'లో కోట

గిరి వెంకట నరసింహ సత్యనారాయణరావు రాశారు. యుగంధరుడు అంటే నాగయ గన్నయ అలియాస్ మాలిక్ మక్బూల్. ప్రతాపరుద్రుడి తురుష్క సేనాలు బంధించి ఢిల్లీకి తీసుకెళ్తున్న ప్పుడు మార్గ మధ్యలో యుగంధరుడు, సింగమనాయుడు కలిసి తప్పించారని అందువల్లనే ఈ సింగమకు ఆ బిరుదు వచ్చినట్లు చెబుతారు కొందరు చరిత్రకారులు. దీనిని బట్టే ప్రతాపరు ద్రుడు నర్మదా నదిలో ఆత్మార్పణం చేసుకోలేదని, బందీ విముక్తుడై కొంత కాలం ప్రతాపగిరిపై ఉన్నాడనే కథ మహదేవ్‌పూర్ (కాళేశ్వరం సమీపంలో) పరిసర జన బాహుళ్యంలో ఉంది. ఇవి 'యైతిహ్యములే గానీ ఆధారాము లేవీ లేని కథ' అని 'రాచకొండ చరిత్రము'లో తేరాల సత్య నారాయణ శర్మ రాశారు.


ప్రతాపరుద్రుని అనంతరం కాకతీయ సామ్రాజ్యం తురుష్కుల వశమైంది. దానికి వారు సుల్తాన్ పూర్ అనే పేరు పెట్టుకున్నారు. అప్పటి వారి పాలన ఎలా ఉండేదో గతంలో చదువ కున్నాం. మొత్తంగా హైందవ జాతి మనుగడకు ముప్పు ఏర్పడింది. ఇది నాటి ప్రజలను, నాయ కులను కలవరపెట్టింది. ఎంతటి త్యాగమైనా చేసి తురుష్కులను ఈ దేశం నుంచి తరిమివేయా లని నాయకులందరు నిశ్చయించుకున్నారు. ఒకచోట సమావేశమయ్యారు. కొలని రుద్రదేవుడు, బెండపూడి అన్నయమంత్రితో పాటు రేచర్ల సింగమనాయుడు కూడా ఈ సమావేశంలో పాల్గొ న్నాడు. ముసునూరి ప్రోలయ నాయకుడిని ఓరుగల్లు విముక్తి పోరాటానికి నాయకునిగా ఎంచు కున్నారు. క్రీ.శ. 1325 నాటికే మొదలైన ఈ పోరాటాన్ని ప్రోలయ తరువాత అతని సోదరుడు కాపయ నాయకుడు కొనసాగించాడు. కాపయ ఆధ్వర్యంలో హొయసల (ప్రస్తుత కర్ణాటక హసన్ జిల్లాలోని హళేబీడు రాజధానిగా ఉన్న రాజ్యం) రాజైన మూడో భల్లాలుడు, రేచర్ల సింగ మనాయుడు కలిసి సాగించిన పోరుతో క్రీ.శ. 1336 నాటికి ఓరుగల్లుపై తిరిగి తెలుగు పతాకం ఎగిరింది. ఈ స్వాతంత్ర్య పోరాటాన్ని తెలుగు నాయకులందరూ సమైక్యంగా సాధించినా తమకు గల స్వతంత్ర రాజ్య కాంక్ష కారణంగా ఎవరికి వారు సర్వస్వతంత్రంగానే ఉన్నారు. ఓరుగల్లు విముక్తి తర్వాత కాపయ నాయకుడు ఆంధ్ర సుత్రాణ, ఆంధ్ర దేశాధీశ్వర అనే బిరుదులతో ఓరు గల్లు సింహాసనాన్ని అధిష్టించాడు. తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతాలకు పాలకుడయ్యాడు.

సింగమనాయుడు అప్పటికే (కాకతీయ సామ్రాజ్య పతనానంతరం) తమ రాజధానిని పిల్ల లమర్రి (సూర్యాపేట సమీపంలోని గ్రామం) నుంచి రాచకొండ (యాదాద్రి భువనగిరి, రంగా రెడ్డి జిల్లాల సరిహద్దు)కు మార్చి అక్కడ దుర్గ నిర్మాణం ప్రారంభించాడు. కృష్ణ, తుంగభద్రల మధ్య ప్రాంతాలను జయిస్తూ తన రాజ్యాన్ని విస్తరించుకున్నాడు సింగమ. ఇదే సమయంలో కాపయ నాయకుడు ఢిల్లీ సుల్తానుపై తిరుగుబాటు చేసిన బహమనీ సుల్తానుకు సహాయం చేయ సాగాడు. స్థానికంగా 'ఆంధ్ర దేశాధీశ్వర' బిరుదుతో కేంద్రాధికారం కూడా చలాయించడానికి ప్రయత్నించ సాగాడు. ఢిల్లీ సుల్తానును ఎదుర్కొనేందుకు బహమనీలకు సహాయం చేస్తే అటు తర్వాత ఆ బహమనీలే కాపయ రాజ్యాన్ని కొల్లగొట్టడం మొదలెట్టారు. రెండుసార్లు బహమ నీలు చేసిన దండయాత్రలో కాపయ కౌలాస్ కోట (ప్రస్తుత కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం), భువనగిరి కోట (యాదాద్రి భువనగిరి జిల్లా)లను కోల్పోయాడు.

అల్లావుద్దీన్ బహమన్ షా మరణానంతరం పరిస్థితులు వేగంగా మారాయి. ఇదే అదునుగా భావించిన కాపయ నాయకుడు తిరిగి తన కోటలను స్వాధీనం చేసుకునే పనిలో పడ్డాడు. ఇందుకు విజయనగర సైన్యమూ కాపయకు తోడొచ్చింది. క్రీ.శ. 1361లో భువనగిరి కోటను బహమనీల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోగలిగాడు. అదే ఏడాది.. కాపయకు లోబడిన కొందరు క్షత్రియులు రేచర్ల సింగమనాయుని బావమరది అయిన చింతపల్లి (ప్రస్తుత ఖమ్మం జిల్లాలోని గ్రామం) సింగమనాయుడిని జల్లిపల్లి (ప్రస్తుత ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండంలోని గ్రామం) కోటలో బంధించారు. దీనికి కోపోద్రిక్తుడైన రేచర్ల సింగభూపాలుడు జల్లిపల్లి కోట ముట్టడికి బయలుదేరాడు. కానీ క్షత్రియులు కపటోపాయంతో సింగభూపాలుడిని హతమార్చారు.

దీంతో కాకతీయ సామ్రాజ్యంలో చివరి నాయకుడు, ప్రతాపరుద్రుని ప్రియ సైన్యాధ్యక్షుడు, అనేక చారిత్రక ఘట్టాలకు సాక్షి అయిన అశీతి వర బిరుదాంకితుడు, అతివీర భయంకరుడు రేచర్ల సింగభూపాలుడు చివరికొక ఆకృత్యానికి గురై ప్రాణాలు వదలాల్సి వచ్చింది.

ఈ దుస్సంఘటన పర్యవసానంగా సాగిన పరిణామాలు జల్లిపల్లి మహా సంగ్రామానికి దారితీశాయి.



ప్రతీతాత్మక చిత్రం

## మహాసంగ్రామం..

# జల్లిపల్లి యుద్ధం

బహమనీ సుల్తాను అల్లావుద్దీన్ బహమన్ షా మరణానంతరం గుల్బర్గాలోనే కాదు, త్రిలింగ దేశంలోనూ పరిస్థితులు వేగంగా మారాయి. బహమనీ సుల్తాను మరణాన్ని అదునుగా భావించిన ముసునూరి కాపయ నాయకుడు తిరిగి తన కోటలను బహమనీల నుంచి స్వాధీనం చేసుకొనే పనిలో పడ్డాడు. ఇందుకు విజయనగర సైన్యమూ కాపయకు సహాయం చేసింది. క్రీ.శ. 1361లో భువనగిరి కోటను బహమనీల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోగలిగాడు కాపయ. అదే ఏడాది.. కాపయకు లోబడిన కొందరు క్షత్రియులు రేచర్ల సింగమనాయుని బావమరది అయిన చింతపల్లి (ప్రస్తుత ఖమ్మం జిల్లాలోని గ్రామం) సింగమనాయుడిని జల్లిపల్లి (ప్రస్తుత ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని గ్రామం) కోటలో బంధించారు. దీనికి కోపోద్రిక్తుడైన రేచర్ల సింగభూపాలుడు జల్లిపల్లి కోట ముట్టడికి బయలుదేరాడు. మహా సంగ్రామానికి దారితీసిన ఈ చారిత్రక జల్లిపల్లి యుద్ధాన్ని కవులు వేనోళ్ల కీర్తించారు.

**జల్లిపల్లి మహాసంగ్రామం,** అందుకు దారితీసిన పరిస్థితులు, అనంతర పరిణామాల గురించి తెలుసుకొనే ముందు చింతపల్లి సింగమనాయుడు, అతని మూలాల గురించి తెలుసు కుందాం. చింతపల్లి సింగమనాయుడు పైశాల పద్మనాయక వంశానికి చెందినవాడు. ఈ పైశాల వారు ప్రాచీన పద్మనాయకులలో ప్రఖ్యాతులు. వేటూరి ప్రభాకర శాస్త్రి మెకంజీ కైఫీయత్తుల నుంచి వీరి ప్రాచీన విషయాలను సేకరించి మనకందించారు. మల్లంపల్లి సోమశేఖర శర్మ 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము'లో కూడా వీరి గురించి వివరించారు. 'వేలుగోటి వారి వంశావళి' ఆధా రంగా కోటగిరి వెంకట సత్యనారాయణరావు కూడా 'పద్మనాయక చరిత్ర'లో వీరి గురించి జల్లి పల్లి సంగ్రామం గురించి రాశారు.

కాకతీయ సామ్రాజ్యపు మహానాయక ప్రముఖుల్లో ఒకడుగా పేరుగాంచిన పోతుగంటి మైలి పైశాల వంశ మూలపురుషుడు. ఇతనికి మల్లానాయకుడు, మల్లినీడు, మైలిభూపాలుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. పోతుగల్లు (కరీంనగర్ జిల్లాలోని యదుపల్లెను మైలి పోతుగల్లుగా మార్చాడు) ఇతని రాజధాని. కాకతీయ రుద్రదేవుని కాలంలో తెలుగు బిజ్జలుడిని జయించి 'తె లుగు బిజ్జలు మణిమూపుర తలాటరాయ' అనే బిరుదు పొందాడు. పోతుగంటి మైలి కుమా రుడు నాగానాయకుడు. రేచర్ల ప్రసాదిత్యునికి ఇతడు సమకాలికుడు. నాగానాయకుని కొడుకు అబ్బునృపుడు. ఇతుడు సామ్రాజ్ఞి రుద్రమదేవి కాలంలో అశ్వదళాధ్యక్షుడుగా పని చేశాడు. అబ్బయ కుమారుడు ఖండ్యారావు, మనుమడు వల్లభుడు.. రుద్రమ, ప్రతాపరుద్రుని కాలం వారు. ఖండ్యారావు తన రాజధానిని పోతుగల్లు నుంచి కృష్ణా తీర ప్రాంతమైన వెల్లటూరు (ప్ర స్తుతం ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా)కు మార్చి కాకతీయ సామంతుడుగా వెల్లటూరు పురవ రాధీశుడయ్యాడు. ఈయన కుమారుడు వల్లభుడు వెల్లటూరుకు ఉపరాజధానిగా చింతపల్లిని చేసి పాలించసాగాడు.

వల్లభునికి ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు. అశీతి వర బిరుదాంకితుడయిన రేచర్ల సింగ మనాయుడికి ఈ వల్లభుడు తన కుమార్తె (పేరు?)నిచ్చి వివాహం చేశాడు. దీంతో పైశాల వారికి, రేచర్ల వారికి బంధుత్వం ఏర్పడింది.

వల్లభుని ముగ్గురు కుమారుల్లో పెద్దవాడు గన్నమ నాయుడు వెల్లటూరు పురవరాధీశ్వరు డుగా, రెండోవాడు సింగమనాయుడు చింతపల్లి పాలకుడుగా తాత, తండ్రి అనంతరం పాలన సాగించారు. గన్నమ నాయుడు పేరు మీదనే గన్నవరం (ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లోని) నిర్మించారు. చింతపల్లి సింగమనాయుడిని బంధించడం వల్లనే చారిత్రక జల్లిపల్లి యుద్ధం(క్రీ.శ. 1361) జరిగింది.

కాకతీయ సామ్రాజ్యానంతరం పద్మనాయకుల ప్రాబల్యం తెలుగు నాట అంతకంతకూ పెరు గసాగింది. దీన్ని అంతకుముందు రాజబంధువులుగా, సామంతులుగా ఉన్న కొందరు సోమ వంశ క్షత్రియులు జీర్ణించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో విజయవాడ దుర్గాధీశుడైన పూస పాటి మాధవవర్మ నాయకత్వంలో మిత్రకోటి (అనేక మంది రాజుల) సమావేశం జరిగింది. రేచర్ల సింగమనాయుడిని నిర్జించడమే లక్ష్యంగా ఆ సమావేశ తీర్మానం జరిగింది. కాపయనా

యకుడు తిరిగి తన కోటను స్వాధీనం చేసుకునేందుకు బహమనీలతో యుద్ధంలో ఉన్నాడు. రేచర్ల సింగమనాయుని కుమారులు దక్షిణ దేశ దండయాత్రలో ఉన్నారు. రేచర్ల శార్దూలాన్ని ఎదుర్కోవడానికి ఇంతకు మించిన మంచి సమయం దొరుకదని భావించి ఓ పథకం రచించారు. రేచర్ల సింగనాయుడిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక ఓ కపటోపాయం చేశారు. ఇందులో భాగంగా రేచర్ల వారి బావమరిది చింతపల్లి సింగమనాయుడిని బంధించాలనుకున్నారు.

చింతపల్లి సింగముడు ఏమరుపాటునున్న సమయాన్ని గమనించి మిత్రకోటి సభ్యులైన కొండమరాజు, మచ్చ ఓబులరాజు, కమ్మలదేవ, పిన్నమరాజులు (జల్లిపల్లి పోరాటంలో క్షత్రియులకు సహాయం చేసిన వారి పేర్లు 'వెలుగోటి వారి వంశావళి' విస్తారంగా పేర్కొన్నది. కానీ వారందరినీ గుర్తించడం కష్టమని 'రాచకొండ చరిత్రము'లో తేరాల సత్యనారాయణ శర్మ రాశారు) అకస్మాత్తుగా చింతపల్లిపై దాడి చేసి సింగమనాయుడిని బంధించారు. తర్వాత అతన్ని జల్లిపల్లి దుర్గానికి తీసుకెళ్లి బంధించారు. శత్రు దుర్భేద్యంగా కోటను పటిష్ఠపరిచారు.

తన తమ్ముడు సింగమనాయుడిని బంధించారన్న వార్త వినగానే వెల్లటూరు పురవరాధీశుడు గన్నమ నాయుడు కోపోద్రిక్తుడై తన సేనలతో జల్లిపల్లికి బయలుదేరి కోట ముట్టడికి యత్నించసాగాడు.

ఈ వార్త రాచకొండాధినేత రేచర్ల సింగమనాయుడికి తెలిసింది. తన బావమరిదిని బంధించినందుకు ప్రచండ రుద్రుడయ్యాడు. వెంటనే పరిస్థితులను అవగాహన చేసుకున్నాడు. క్షత్రియ రాజుల బలం, బలగం రేచర్ల సింగమకు తెలుసు. గన్నమ ఒక్కడే అయితే ఆ క్షత్రియుల యుద్ధ దావాగ్నికి ఆహుతి అవుతాడని భావించాడు. సింగమ కుమారులు వెంట లేరు. అపరిమిత సైన్యం కూడా యుద్ధంలో ఉంది. అయినప్పటికీ ఉన్న సైన్యంతోనే బావమరుదులకు బాసటగా జల్లిపల్లికి బయలుదేరాడు.

అశీతి వర బిరుదాంకితుడు, అరిరాయ భయంకరుడు అయిన రేచర్ల సింగభూపాలుడు యుద్ధానికి బయలుదేరాడనే వార్త వేగుల ద్వారా తెలుసుకున్న క్షత్రియులు హడలిపోయారు. గన్నమను ఎదుర్కోవడం అటుంచి భయంతో ప్రత్యర్థి లోకం అత్యవసర సమావేశానికి హాజరైంది. ముదిబెబ్బులి రేచర్ల సింగమపై కత్తినెత్తే సాహసానికి చేతులెత్తేసిన వారేకానీ, ఆ సమావేశంలో చేతులెత్తిన  వారు ఎవరూ లేరు. కాకతీయ సామ్రాజ్యపు వీరుల్లోకెల్ల వీరుడు, అశీతి యుద్ధ వీరుడు అయిన సింగమపై కత్తి దూయలేక కపటోపాయానికే కంకణం కట్టుకున్నారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిన పూసపాటి మాధవవర్మకు జీవన్మరణ సమస్య అయింది. రణం, మరణం నడుమ కుటిలాలోచన అమలు వైపే అతడూ మొగ్గు చూపాడు. ఇందుకు మాధవవర్మ తన రాజకీయ సలహాదారుడు అయిన తంబళ్ల బొమ్మజియ్యడి (బ్రహ్మజీ)ని ఎంచుకున్నాడు.

బొమ్మజియ్యడు సంధికోసం రేచర్ల సింగమనాయుడికి రాయబారం పంపాడు. సింగమ అప్పుడు గుడారంలో విడిది చేసి యుద్ధ వ్యూహం రచిస్తున్నాడు. అతడి సైన్యం గన్నమకు తోడుగా జల్లిపల్లి కోట ముట్టడికి ప్రయత్నిస్తున్నది. అక్కడ హోరాహోరి యుద్ధం జరుగుతున్నది.

ఇక్కడ రాజీకోసం వచ్చిన బొమ్మయ్యని గుడారంలోనికి ఆహ్వానించాడు సింగమ. గుడారానికి ఆనుకొని కూర్చున్నాడు సింగముడు. రాజీకోసం ఇష్టాగోష్ఠి పేరుతో లోనికి వచ్చిన బొమ్మయ్య అదును చూసి విషం పూసిన కైజారుతో రేచర్ల సింగమనాయుడిని బలంగా పొడిచాడు. వెంటనే మాయావి బొమ్మయ్య తన గుర్రం ఎక్కి జల్లిపల్లి కోటకు పారిపోయాడు.

ప్రతాపరుద్రునిచే అశీతి వరాలు పొందిన అరిరాయ భయంకర రేచర్ల సింహం ఆకృత్యానికి బలై ఇప్పుడు చావు బతుకుల మధ్య ఉన్నది. అయినా పద్మనాయక సేనలు అధైర్య పడలేదు. రేచర్ల సహిత పైశాల వీరులు ముట్టడిని వీడక మహారుద్రులై కోటలోని పురుగును కూడా బయటికి రానీయకుండా కట్టుదిట్టం చేశారు. ఈ పోరుకు నాయకత్వం వహిస్తున్న గన్నమ నాయుడు 'విజయమో, వీరస్వర్గమో!' అని సేనలను ఆవేశపర్చి, తన బావగారి చెంతకు బయలుదేరాడు.

సింగభూపతి మరణవేదనలో ఉండగా గన్నమ సకల బాధ్యతలు స్వీకరించాడు. తన మేనల్లుళ్లకు, తెలుగునాట ఉన్న ఇతర పద్మనాయకులకు, సింగభూపాలుని అభిమానగణానికి ఈ ఆకృత్యాన్ని తెలియజేసేందుకు వార్తాహరులను హుటాహుటినా రంగంలోకి దింపాడు. ఈ వార్త నిమిషాల్లో తెలుగునాట దావానంలా వ్యాపించింది.

సామంతులు సానుభూతి చూపారు. సామాన్యులు భయపడ్డారు. ప్రజల్లో హాహాకారాలు మొదలయ్యాయి.

రేచర్ల సింగముని పెద్ద కుమారుడు ఆ సమయాన దక్షిణ దండయాత్రలో భాగంగా చేజెర్ల( గుంటూరు జిల్లా) యుద్ధభూమిలో ఉన్నాడు. రెండో కుమారుడు మాదానేడు మొగుళ్లూరు (కృష్ణా జిల్లా) రణక్షేత్రంలో ఉన్నాడు. తండ్రికి జరిగిన ఆకృత్యం తెలియగానే ఇద్దరూ యుద్ధవిరమణ చేశారు. సేనలను వెంటనే వెనక్కు రావాలని ఆదేశించి, సేనానాయకుల సమేతంగా హుటాహుటినా జల్లిపల్లికి చేరుకున్నారు. జాతి సింహం, రేచర్ల సింగం అంత్య దర్శనం కోసం తెలుగునాట నాయకులందరూ తమ అశ్వాలను, రథాలను జల్లిపల్లి వైపు పరుగెత్తించారు.

మరణవేదనలో ఉన్న రేచర్ల సింగం తన కుమారులను చూసి, చేతిలో చేయి వేసి 'శత్రు రక్తంతో తనకు తిలతర్పణం చేయమని' తుదికోర్కె కోరి కన్నుమూశాడు.

దీంతో కాకతీయ సామ్రాజ్యంలో చివరి నాయకుడు, ప్రతాపరుద్రుని ప్రియ సైన్యాధ్యక్షుడు, అనేక చారిత్రక ఘట్టాలకు సాక్షి అయిన అశీతి వర బిరుదాంకితుడు, అతివీర భయంకరుడు అయిన రేచర్ల సింగభూపాలుని ప్రస్థానం ముగిసింది.

ఈ దుస్సంఘటన పర్యవసానంగా జల్లిపల్లి మహాసంగ్రామం వైపు రేచర్ల వంశ కిశోరులైన అనపోతానాయుడి, మాదానాయుడి అడుగులు మొదలయ్యాయి.

ఈ మహోద్రిక్త పరిస్థితుల మధ్య గన్నమ నాయుని ఆధిపత్యంలో అత్యవసర సమావేశం జరిగింది. రేచర్ల సింగముని తుది కోర్కె తీర్చేందుకు నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు జరిగిన ఈ సమావేశంలో యువకుడు, రేచర్ల వంశవర్ధనుడు అనపోతానాయుడు ఏకగ్రీవంగా ఎంపిక

య్యాడు. ఈ సమావేశానికి హాజరైన వీరులందరూ  నెత్తుటి సాక్షిగా తమ కత్తులపై ప్రమాణం చేశారు. విజయమో, వీరస్వర్గమో కాదు.. విజయమే లక్ష్యంగా నినాదాలు మిన్నంటాయి. దీన్నే చారిత్రక జల్లిపల్లి ప్రతిజ్ఞగా కవులు కీర్తించారు.

జల్లిపల్లి కోటలో భయం మొదలైంది. అలజడి..అంతర్ యుద్ధం. కొందరు క్షత్రియులు పూస పాటి వారికి సహాయం చేసేందుకు నిరాకరించారు. ఇంకొందరు తమ బలగంతో కోటను విడిచి పారిపోయారు. మిగిలిన క్షత్రియులు కోటను విడిచి బయటికి వచ్చి శత్రువులను ఎదుర్కోవాలని భావించారు.

తెలతెలవారుతున్నది.

తూర్పున పద్మనాయకుడు ఉదయిస్తున్నాడు.

ఆయుధాలు దించి సింగభూపాలుని అభిమాన యోధులు సూర్య నమస్కారం చేశారు.

అనపోతానాయకుడు తమ కులదైవమైన బేతాళునికి ప్రణామం చేశాడు. రణభేరులు దిక్కులు పిక్కటిల్లేలా మోగాయి. జయజయ ధ్వానాలు, ఏనుగుల ఘీంకరింపులు, గుర్రాల సకి లింపులు.. వీరుల సింహనాదాలు నలుదిశలా మారుమోగాయి. పద్మనాయక వీరుల్లో వీరావేశం, శత్రువీరుల్లో నిరుత్సాహం.. క్షత్రియులది రాజ్యకాంక్ష, పద్మనాయకులది అభిమాన రక్షణ.. ఈ రెండింట్లో ఏది గెలుస్తుంది? ధర్మం ఎటువైపు ఉంటుంది?? తేల్చుకునే సమయం ఆసన్నమైంది.

అప్పటివరకు కోట ముట్టడిలో ఉండడం వల్ల వేగులకు లోపలికి వెళ్లే అవకాశం దొరుకలేదు. సింగమనేని మరణంతో ఆ సైన్యానికి నాయకుడు లేరని కోట లోపలి క్షత్రియులు భావించారు. అరవై వేల సైన్యంతో బయలు దేరి కోట ద్వారం తెరిచి రణరంగానికి ప్రవేశించారు. కానీ ఇక్కడ పరిస్థితి వారు ఊహించనట్లు లేదు. ప్రత్యర్థి సైన్యం అపారంగా ఉంది. అనపోత, మాదా నాయుడి మహా సేనలకు తోడు సింగభూపాల అభిమాన గణం తోడయ్యింది. అది చూసి శత్రు వులు కంగుతిన్నారు. జల్లిపల్లి సైన్యం వెన్నులో వణుకు పుట్టింది. సగం ధైర్యం చచ్చిపోయింది.

రణనినాదం.. సమర శంఖారావం..

యుద్ధం మొదలయ్యింది. నాయకులు నాయకులను, సైనికులు సైనికులను ఢీకొన్నారు. పోరు హోరెత్తింది. గడియ గడియకూ అది భీకరమవ్వసాగింది. అతివీర భయంకరమవ్వసా గింది. గన్నమ నాయుడు బెబ్బులి వలె యుద్ధరంగాన గాండ్రిస్తున్నాడు. అనపోతానాయుడు అనితర యుద్ధం చేస్తున్నాడు. మాదానాయుడు వేటుకొక శత్రువును  మట్టుపెడుతున్నాడు.

పద్మనాయకుల ఆగ్రహావేశాలతో, రణగొణ ధ్వనులతో కోట దద్దరిల్లింది. శత్రువులు తోక ముడిచి ఒక్కొక్కరుగా కోటలోకి పారిపోయారు. మాధవవర్మ కోట ద్వారాలు మూసేయించాడు. పద్మనాయక సేన లోపలికి ప్రవేశించకుండా రక్షణ బాధ్యత చేపట్టాడు. పద్మనాయకులు ముఖ ద్వారాన్ని ఢీకొట్టసాగారు. సైనికులు కత్తులు నోట పట్టుకొని కందకాలను ఈద సాగారు. అన

పోత, మాదానేని గజాలు ముఖద్వారాన్ని ఛేదించాయి. పద్మనాయక సేన కోటలోకి ప్రవేశించింది. ఇక ఊచకోత మొదలైంది. అనపోతానీడు నూటొక్క రాజుల శిరస్సులు ఖండించాడు. గన్నమ, మాదా ఎవరికి వారు శత్రు రాజులను ఊచ కోత కోయసాగారు. క్షత్రియులు, వారికి తోడొచ్చిన రాజులు, మద్దతిచ్చిన నాయకుల తలలు తెగిపడసాగాయి. కాళ్లు, వేళ్లు, చేతులు, ఛాతులు, కండలు, నరాలు తెగిపడుతున్నాయి. రక్తం ఏరులై పారుతున్నది. కోట పై నుంచి నెత్తుటి జలపాతం జాలువారసాగింది. ఆకేరు వాగు రక్తవర్ణంలోకి మారిపోసాగింది.

అనపోతానేడు తండ్రి తుదికోర్కె, ఆదేశానుసారం శత్రువుల రక్తంతో తిలతర్పణం ఇచ్చాడు. 'రణంకుడుపు'గావించాడు.

'అని' అంటే యుద్ధం. 'పోతు' అంటే పురుషుడు అనపోతానాయుడు అలా యుద్ధపురుషుడుగా సార్థక నామధేయుడయ్యాడు. చరిత్ర ప్రసిద్ధికెక్కిన జల్లిపల్లి పోరాటంతో క్షత్రియులను త్రిలింగదేశం నుంచి వెల్లగొట్టినందుకు గాను అనపోతానేని 'సోమకుల పరుశురామ' అనే బిరుదాంకితుడయ్యాడు. రేచర్ల వారు ఈ యుద్ధం నుంచే 'జల్లిపల్లి క్షేత్ర భారతీకమల్లా', పైశాల గన్నమనేని 'జల్లిపల్లి రణక్షేత్ర నిర్వహణ ధురీణ' అనే బిరుదులతో కీర్తి పొందారు.




జల్లెపల్లి గుట్ట



గుట్టపైకి కోట ద్వారం



కోటలో మండలం



రాచకొండ దుర్గంపై ఓ ద్వారం

అనపోతానేని

# దిగ్విజయ యాత్ర

**జల్లిపల్లి మహా సంగ్రామం అనంతరం కూడా రేచర్ల అనపోతానాయుడు, అతని సోదరుడు మాదానాయుడు తమ దిగ్విజయ యాత్రను కొనసాగించారు. పద్మనాయక సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా ఈ సోదరులు సాగించిన విజయ పరంపర వారిని ఆంధ్రదేశాధీశ్వరులను చేసింది. తరతరాలుగా ఆధిపత్య పోరుకు, కేంద్రాధిపత్యానికి మకుటాయమానంగా ఉన్న ఈ 'ఆంధ్రదేశాధీశ్వర' అనే బిరుదు తెలుగు నాట సరికొత్త చరిత్రను లిఖించింది.**

**కాకతీయ ప్రతాపరుద్రుని** అనంతరం తెలుగు నాట జరిగిన స్వాతంత్ర్య పోరాటానికి ముసునూరి నాయకుడు ప్రోలయ, అనంతరం అతని సోదరుడు కాపయ నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ సుల్తానుల పాలనను ఎదురించి పదమూడేండ్ల తర్వాత తిరిగి ఎంతో మంది తెలుగు రాజుల సహాయంతో ఓరుగల్లు కోటపై తెలుగు జెండా ఎగురవేయగలిగాడు కాపయ నాయకుడు. ఇంతటితో ఆగకుండా ఆంధ్రదేశాధీశ్వర, ఆంధ్రసురత్రాణ అనే బిరుదులను అలంకరించాడు కాపయ.

పూర్వం కాకతీయ రాజులు పరిపాలించిన రాజ్యంలో చాలా భాగం.. అంటే పడమర కౌలాస్ కోట (ప్రస్తుత కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఉంది) నుంచి తూర్పున బంగాళాఖాతం వరకు వ్యాపించిన దేశం కాపయ నాయకుని అధికారం కిందకు వచ్చింది. ఆంధ్రదేశాధిపతి అయిన తర్వాత కాపయ తనకు సహకరించిన బంధువులకు నాయకత్వాలిచ్చి తన స్థితిని పటిష్టం చేసుకోసాగాడు. అంతకుముందు సహాయం చేసిన తెలుగు రాజులపై మాత్రం అధికారం చెలాయించసాగాడు. పైగా పక్క రాజ్యమైన బహమనీ సుల్తానుతో చేయి కలిపాడు. ఇదంతా అశీతి వర బిరుదాంకితుడయిన రేచర్ల సింగమనాయుడికి, కొందరు తెలుగు రాజులకు నచ్చలేదు. వారు సహింపక అతని కేంద్రాధిపత్య యత్నాన్ని ధిక్కరించారు.

కాలం గడుస్తున్నది. తెలుగు నాట చిన్న చిన్న రాజ్యాలుగా ఎవరి పాలన వారు సాగిస్తున్నారు. రాజ్య విస్తరణ లక్ష్యంగా కాపయ బహమనీలకు చేసిన సహాయం వారు మరిచి కాపయకే అటుతర్వాత పక్కలో బల్లెంలా తయారయ్యారు. బహమనీల వరుస దాడుల్లో బల హీనపడుతూ కాపయ వరుసగా తన కోటల్ని వదులుకుంటున్నాడు. అవకాశం వచ్చినప్పుడల్లా తిరిగి ఆక్రమించుకునే, విస్తరించుకునే ప్రయత్నాలు కూడా చేస్తూనే ఉన్నాడు. ఇదే ప్రయత్నం ఇతర స్వతంత్ర రాజులు కూడా ఎవరికి వారూ చేస్తూనే ఉన్నారు.

చక్రవర్తిగా చలామణి అయ్యే లక్ష్యంగా కాపయ నాయకుడు రేచర్ల సింగమనాయుడు పాలిస్తున్న ఆమనగల్లు (నల్లగొండ జిల్లా మిర్యాలగూడ దగ్గర), పిల్లలమర్రి (సూర్యాపేట జిల్లాలోని గ్రామం)లను ఆక్రమించి ఎరబోతు లెంకను నియమించాడు. అటు తర్వాత సింగమనేని కాపయతో యుద్ధం చేసి ఆ రెండు ప్రాంతాలను క్రీ.శ. 1360 నాటికి తిరిగి సాధించుకున్నాడు. (క్రీ.శ. 1326 నుంచి 1361 మధ్య సింగమనేనికి సంబంధించిన ఏ శాసనాలు దొరకలేదు. కాబట్టి ఈ ఇరువురి నాయకుల మధ్య యుద్ధం ఎప్పుడు, ఏ ప్రాంతంలో జరిగిందో చెప్పడం సాహసమే అవుతున్నది– అని 'రాచకొండ చరిత్రము'లో తేరాల సత్యనారాయణ శర్మ రాశారు. క్రీ.శ. 1360 నాటికి తిరిగి జయించినట్లు మాత్రం ఆధారాలు ఉన్నాయి.)

ఈ యుద్ధం తర్వాతనే సింగమనాయుడు తన రాజధానిని పిల్లలమర్రి నుంచి రాచకొండ (యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దు)కు మార్చి దుర్గ నిర్మాణం చేపట్టాడు. తన రాజ్య విస్తరణలో భాగంగా తన కుమారులు అనపోతానాయుడు, మాదానాయకులను దక్షిణ దేశ దండయాత్రకు పంపాడు. అనపోతానాయుడు చేజెర్ల (గుంటూరు జిల్లా) యుద్ధభూమిలో

ఉన్నాడు. రెండో కుమారుడు మాదానేడు మొగుళ్లూరు (కృష్ణా జిల్లా) రణక్షేత్రంలో ఉన్నాడు. ఆ సమయంలోనే జల్లిపల్లి యుద్ధం జరిగింది. కపటోపాయంతో తన తండ్రిని హతమార్చిన వారిపై ప్రతీకారం తీర్చుకున్నారు. శత్రుశేషం మిగులకుండా ఊచకోత కోశారు. జల్లిపల్లి కోటలోనే కాక, తప్పించుకుపోయిన క్షత్రియులను, వారికి సహాయంగా వచ్చిన వారినీ వెంటాడి పట్టుకొని చంపారు. క్షత్రియులకు సహాయంగా వచ్చిన కొండవీటి రెడ్డి రాజులపై కూడా పోరు సాగించారు. ధరణికోట (అమరావతి)ను ముట్టడించి రెడ్డిరాజ్య ప్రభువైన అనపోతారెడ్డిని ఓడించారు. చరిత్రలో పద్మనాయకులకు, రెడ్డి రాజులకు జరిగిన తొలి యుద్ధం ఇది.

భారతంలో రాజసూయ యాగ సమయంలో దిగ్విజయ యాత్ర చేసిన అర్జునునిలా మాదా నాయుడు తన అన్న అనపోతను ఆంధ్రదేశాధీశ్వరుడిని చేసేందుకు తెలుగు నాట దక్షిణాన కాంచీ పురం (తమిళనాడులోని తొండాయిమండలం) నుంచి ఉత్తరాన సింహాచలం (విశాఖపట్నం) వరకు విజయయాత్ర సాగించాడు. ఈ విజయాలకు సంబంధించి శాసనాలు కూడా వెలుగు చూశాయి.

జల్లిపల్లి పోరాటం తరువాత రేచర్ల వారి దిగ్విజయ యాత్రను తట్టుకోలేక హతాషులైన క్షత్రి యులు, విజయవాడ దుర్గాధీశులైన పూసపాటి వారు కళింగాధీశుల చెంతకు వలస వెళ్లారు. కళిం గాధీశులు అటుతర్వాత తమ సామ్రాజ్య తెలుగు ప్రాంత సామంతులుగా పూసపాటి వారిని నియమించుకున్నారు.

ఇక మిగిలింది కాపయనాయకుడు. బహమనీ సుల్తాను మహమ్మద్ షా చేతిలో కాపయ కుమారుడు వినాయకదేవుడు హతమయ్యాక ఇక పోరాడే శక్తి లేక సంధి (క్రీ.శ. 1364–65) చేసుకున్నాడు. యుద్ధ నష్టపరిహారంగా గోల్కొండ కోటను మహమ్మద్ షాకు ఇచ్చుకున్నాడు.

ఇదే సమయంలో పైశాల గన్నమనాయుడు తన మేనల్లుడైన అనపోతానేనిని ఆంధ్రదేశాధీ శ్వర బిరుదాంకితుడను చేస్తూ తెలుగు నాడంతా ప్రజారంజకంగా పాలించసాగాడు. క్రీ.శ. 1365 నుంచి పద్మనాయకులు 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదు వహించినట్లు శాసనాలు లభించాయి. కాప యనాయకునికి అప్పటికే ఈ బిరుదు ఉంది. తెలుగు నాట సర్వాధిపత్యం కోసమే ఈ నాయకులు ఎవరికి వారు ఈ బిరుదులు అలంకరించుకున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో రేచర్ల అనపోతా నాయకుడు తన బిరుదును సార్థకం చేసుకునేందుకు తన సోదరులతో కలిసి ఓరుగల్లు పైకి దండెత్తాడు. క్రీ.శ. 1369లో భీమారం (నేటి హన్మకొం డలో భాగం) వద్ద రేచర్ల పద్మనాయకులకు, కాపయ నాయకునికి మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో కాపయనాయకుడు మరణించాడు. ఈ యుద్ధంతో ఓరుగల్లు పతనమై పోయి రేచర్ల పద్మనాయకుల వశమైంది.

ఢిల్లీ సుల్తానును ఎదిరించడంలో సింగమనాయకుడి తోడ్పాటును మరచి చక్రవర్తి కావాలనే దురాశతో కాపయ సింగమనాయుడి అమనగంటి రాజ్యాన్ని ఆక్రమించాడు. అటుతర్వాత తన తండ్రిని చంపడంలో మౌనం వహించాడనే కోపంతో అనపోత నాయకుడు కాపయ నాయకుడితో యుద్ధం చేసి సంహరించాడు.

భీమారం యుద్ధంతో ముసునూరి వంశం అంతరించిపోయింది. ఈ యుద్ధం తర్వాత ఓరుగల్లు, భువనగిరి, సింగవరం మొదలైన ప్రాంతాలు పద్మనాయకుల వశమయ్యాయి. క్రీ.శ. 1369లో పద్మనాయకులకు సంభవించిన ఈ విజయప్రశస్తి గురించి 'తెలంగాణకంతటికీ రాచకొండ పద్మనాయకులే అధిపతులయ్యార'ని అయ్యనవోలు శాసనం చెబుతున్నది. పద్మనాయకుల చరిత్రకిది ముఖ్య శాసనం.

ఇలా క్రీ.శ. 1361లో మొదలైన పద్మనాయక ప్రాభవం క్రీ.శ. 1475 వరకు కొనసాగింది. రాచకొండ.. రాజ్య స్థాయి నుంచి సామ్రాజ్య స్థాయికి చేరిన ఈ కాలం పద్మనాయక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపతగినది.

పద్మనాయక రాజధాని రాచకొండకు రాజాద్రి, రాజగిరి, రాజాచలం అనే పేర్లు కూడా ఉన్నాయి. కానీ వీటన్నింటికంటే రాచకొండ అనే పేరే ప్రజాబాహుళ్యంలోనూ, చరిత్రలోనూ ఎక్కువగా వాడుకలో ఉంది.

రాచకొండ దుర్గ ప్రాంతం హైదరాబాద్ – విజయవాడ రహదారిపై హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో కొయ్యల గూడానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాచకొండ దుర్గంలో ప్రాకారాలు, రాజభవనాలు, సభా మందిరాలు, పురవీధులు, గజశాలలు, కొలువు కూటములు, దేవాలయాలు, శాసనాలు వెలుగు చూశాయి.

రాచకొండ సామ్రాజ్య స్థాయిని అందుకున్న తరువాత అనపోతా నాయుడు దేవరకొండను ఉపరాజధానిగా నిర్మించాడు. ఈ దుర్గం నిర్మాణం, రక్షణ బాధ్యతలను తన మేనమామ పైశాల గన్నమనాయునికి అప్పగించాడు. గన్నమనాయుని ఆధ్వర్యంలో అతని సోదరుడు కృష్ణమనాయుడు కూడా కోట నిర్మాణంలో పాలుపంచుకున్నాడు. ఈయన వాస్తు శాస్త్రం తెలిసిన ప్రతిభాశాలి అని చరిత్రకారులు చెబుతారు. అందుకుగాను కృష్ణభూపమాల్ (కృష్ణభూపతి మహాల్) అనే భవనాన్ని చూపుతారు.

దేవరకొండ దుర్గం చరిత్రలో సాటిలేని దుర్గ రాజమని చరిత్రకారులు రాశారు. ఏడు పర్వాతాల చుట్టూ మహోన్నత శిలాప్రాకారం, 360 బురుజులు, 9 పెద్ద దర్వాజాలు, 32 దిడ్డి దర్వాజలు, 5 కొలనులు, 3 దిగుడు బావులు, ధాన్యపు గిడ్డంగులు, గరిసెలు ఉన్నాయని చరిత్ర చెబుతున్నది.



రాచకొండ దుర్గంపై ఓ మండపం

# కుమార సింగభూపాలుడు

(క్రీ.శ. 1384 - 1399)

**రేచర్ల అనపోతానాయుని దిగ్విజయ యాత్ర ముగిసింది. రాచకొండ రాజ్య స్థాయి నుంచి సామ్రాజ్య స్థాయికి ఎదిగింది. దేవరకొండ దుర్గం నిర్మాణం కూడా పూర్తయింది.**

**రాజ్య విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో** పరిపాలనా సౌలభ్యం కోసం అనపోతానాయుడు తన సోదరుడైన మాదానేనిని దేవరకొండ ప్రాంతానికి అధిపతిని చేశాడు. ఈ విభజన రాజ్యపం పకం కాదు. కేవలం పరిపాలనా సౌలభ్యం, రక్షణ కోసం మాత్రమే జరిగింది. రాజ్యపాలనకు సంబంధించిన ముఖ్య నిర్ణయాలన్నీ రాచకొండ నుంచే జరిగేవి. అందరూ కలిసి నిర్ణయం తీసు కున్నాకే పాలనా కార్యాలు జరిపేవారు. అంతేకాదు రాచకొండ దేవరకొండ సంతతిలో కుటుం బాభివృద్ధి అమితంగా ఉన్నా వారిలో ఎప్పుడూ అభిప్రాయ భేదాలు కలిగినట్లుగానీ, ఐక్యత నశించినట్లుగానీ ఏ ఒక్క సంఘటనా పద్మనాయక చరిత్రలో కనిపించదు. సామాన్యంగా రాచ కుటుంబాల్లో ఇలాంటి ఐక్యత కనిపించడం అరుదైన విషయం. ఇది పద్మనాయకుల గొప్పదనం, ప్రత్యేకత.

అనపోతానాయునికి సింగభూపాలుడు, ధర్మానాయుడు అను ఇద్దరు కుమారులు కలిగారు. దేవరకొండ మాదానాయునికి వేదగిరి నాయుడు అను కొడుకు కలిగాడు. వీరిలో 'కుమార' అనే ఉపమానం సింగభూపాలునికి, 'పెద' అను ఉపమానం వేదగిరికి చరిత్రలో వాడారు. దీనికి కారణం అశీతి వర సింగభూపాలుడు జీవించి ఉన్నప్పుడే అనపోతానాయుని పెద్ద కుమారుడు జన్మించాడు. అనపోతానాయుడు తండ్రి మీద ఇష్టంతో కుమారునికి ఆయన పేరునే పెట్టుకు న్నాడు. అందుకే అనపోతానేని కుమారున్ని కుమార సింగభూపాలుడు అని పిలిచేవారు. ఇత డినే రెండో సింగభూపాలుడు, రెండో సింగమనేనీ అని కూడా అంటారు.


కుమార సింగభూపాలుడు క్రీ.శ. 1365 నుంచే యువరాజుగా తండ్రితో పాటు రాజ్య వ్యవ హారాలు చూసుకునేవాడు. తండ్రి అనపోతానేడు యుద్ధ యాత్రల్లో ఉన్నప్పుడు కుమార సింగ భూపాలుడు రాజధానిలో ఉండి రాజకార్యాలు తలపెట్టేవాడు. ఆస్థాన మందున్న కవి పండితు లను ఆదరించేవాడు. యువరాజుగా ఉన్నప్పుడే సింగభూపాలుడు కల్యాణ (గుల్బర్గా) దుర్గాన్ని జయించి, అక్కడ విజయస్తంభం నాటి 'కల్యాణ భూపతి' అనే బిరుదు పొందినట్లు ఆయన ఆస్థాన కవి విశ్వేశ్వరుని 'చమత్కార చంద్రిక' అనే గ్రంథం చెబుతున్నది.

క్రీ.శ. 1384లో కుమార సింగభూపాలుడు రాచకొండ రాజ్యాధికారం చేపట్టాడు. ఇదే సమ యంలో దేవరకొండకు మాదానేని కొడుకు పెద వేదగిరి నాయుడు (క్రీ.శ. 1384 – 1410) రాజయ్యాడు. ఈ రాజ్యాధికార మార్పు సమయాన్ని అదునుగా చేసుకున్న విజయనగరరాజు రెండో హరిహర రాయలు (క్రీ.శ. 1377 – 1404) రాచకొండ భూభాగమైన కొత్తకొండ (ప్ర స్తుత వనపర్తి జిల్లాలోని ప్రాంతం) పైకి దండెత్తాడు. రాయల కుమారుడు, యువరాజు అయిన రెండో బుక్కరాయలు వెంటరాగా రాయల సైన్యానికి సాళువ రామదేవుడు నాయకత్వం వహిం చాడు. కొత్తకొండలో రాయల సైన్యానికి, రాచకొండ వారికి తీవ్రమైన యుద్ధం జరిగింది. రాజ్యా ధికార ఆరంభంలోనే ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పటికీ సింగభూపాలుడు చాకచక్యంగా, విజ యవంతంగా రాయల సైన్యాన్ని తిప్పికొట్టాడు. సాళువ రామదేవుడు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. రెండో బుక్కరాయలు ఓటమి భారంతో విజయనగరం చేరాడు. దీనినే కొత్త కొండ యుద్ధం అంటారు. సింగభూపాలుని అధికారంలో ప్రథమ విజయం ఈ కొత్తకొండ

పోరాటం.ఈ యుద్ధం తర్వాత రెండో సింగభూపాలుడు తన సోదరుడు దేవరకొండ పెద వేద గిరి నాయుడును వెంటబెట్టుకొని కళింగ దేశాన్ని జయించడానికి బయలుదేరాడు. ఈ దిగ్విజయ యాత్రలో భాగంగానే గోదావరి ప్రాంతములందున్న వేములకొండ, బెండపూడి మొదలైన దుర్గా లను సింగభూపాలుడు వశం చేసుకున్నట్లు 'వెలుగోటి వారి వంశావళి' చెబుతున్నది. రెండో సింగభూపాలుని ఈ విజయాల గురించి సింహాచల క్షేత్ర శాసనం మనకు తెలియజేస్తున్నది.

ఈ సమయంలోనే కళింగాధిపతి నాలుగో వీరనరసింహదేవుడు (క్రీ.శ. 1378–1409) పద్మనాయకుల చేతిలో యుద్ధంలో ఓడిపోయాడు. పద్మనాయకులతో అతడు సంధి చేసుకొని తన కూతురు కనకలక్ష్మీ దేవిని సింగభూపాలుని పెద్ద కొడుకైన రెండో అనపోతానాయునికి ఇచ్చి వివాహం చేశాడు. ఇది మొదటి అనపోతానాయుని కళింగ విజయయాత్ర సందర్భంగా జరిగి నట్లు కొందరు చరిత్రకారులు రాశారు. కొందరు రెండో సింగభూపాలుని విజయయాత్ర సంద ర్భంగా జరిగినట్లు రాశారు. ఏ సమయంలో అనే దానికి శాసనాధారాలు లేవు. కానీ చమత్కార చంద్రిక ఆధారంగా పరిశీలిస్తే రెండో సింగభూపాలుని కొడుకు రెండో అనపోతానాయుడు కన కలక్ష్మీ దేవిని వివాహమాడినట్లు చరిత్ర చెబుతున్న నిజం. కనకలక్ష్మీ దేవి సింహాచల క్షేత్రానికి వెళ్లి స్వామి వారిని దర్శించిన సందర్భంగా అక్కడ శాసనం వేయించింది.

కళింగ విజయం తర్వాత రెండో సింగభూపాలుడు పది సంవత్సరాల పాటు ప్రశాంతమైన పాలన సాగించాడు. సోదరులిద్దరూ తమ తమ ఆస్థానాల్లో కవి పండిత పోషణకు పీఠం వేశారు. స్వయంగా కవి, పండితుడు అయిన కుమార సింగభూపాలుడు సర్వజ్ఞ చూడమణి అనే బిరు దాంకితుడు. ఇతడే రసావర్ణవ సుధాకరం అనే గ్రంథాన్ని రాశాడు. సర్వజ్ఞ దేవుని సంగీత రత్నా కరానికి సంగీత సుధాకరం అనే వ్యాఖ్యానం, కుమలయావళి అనే నామాంతరం గల రత్నపాం చాలిక అనే నాటకాన్ని రచించాడు. మహాకవి అయిన విశ్వేశ్వర కవిచంద్రున్ని, పశుపతి నాగనా థున్ని సింగభూపాలుడు విశేషంగా ఆదరించాడు. గురుశిష్యులైన ఈ కవిచంద్రులు అనపోతా నేని (రెండో సింగభూపాలుని తండ్రి) ఆస్థానంలో చేరిన తొలి విద్వాంసులు. తండ్రి ఉన్నప్పుడే కాదు, తర్వాత కూడా సింగభూపాలుడు ఈ కవులను పోషించాడు. ఇందులో విశ్వేశ్వర కవి 'చ మత్కార చంద్రిక' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రాశారు. పశుపతి నాగనాథుడు అయ్యనవోలు శాసన రచయిత. ఉమామహేశ్వర శాసనంలో కూడా ఈ కవిచంద్రుని పలుకుబడులు కనిపిస్తాయి.



రాచకొండ



కొండపై ఆలయం



రాచకొండపై రచయిత



ఏడు ద్వారాల్లో ఒకటి



మండపం



దేవరకొండ దుర్గం

## సింగభూపాలుని చివరి రోజులు..

# రెండో అనపోతానాయుడు

**(క్రీ.శ. 1400-1420)**

రాచకొండ రాజ్యాధినేతలు చరిత్రలో కొత్త అధ్యాయం లిఖిస్తున్న రోజులవి. కళింగ విజయం తర్వాత యుద్ధం ఊసేలేకుండా పండిత పామరులతో రాచకొండ రాజ్యం ఆనందంగా విరాజిల్లసాగింది. పది సంవత్సరాల పాటు ఎలాంటి యుద్ధం లేకుండా కుమార సింగభూపాలుడు, అతని సోదరుడు వేదగిరి నాయుడు ప్రశాంతమైన పాలన చేయసాగారు. కానీ మరో వైపు.. యేండ్లు గడిచినా కొత్తకొండ యుద్ధం మిగిల్చిన పరాభవం విజయనగరాధీశులకు నిద్రలేకుండా చేయసాగింది. ఆ ఆగ్రహజ్వాలలు వారిలో రగులుతూనే ఉన్నాయి. ఆ పరాజయానికి, పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

**విజయనగర రాజు రెండో హరిహర రాయలు** కొత్తకొండ (ప్రస్తుత వనపర్తి జిల్లా లోని ప్రాంతం) పరాజయానికి ప్రతీకారంగా రాచకొండ రాజ్యం మీదికి తన సైన్యాన్ని పంపాడు. రాచకొండ రాజ్యంలోని పానగల్ (ప్రస్తుత వనపర్తి జిల్లాలోని మండలం) కోటను ఆక్రమించేం దుకు బయలుదేరిన ఈ సైన్యానికి హరిహర రాయలు కుమారుడు రెండో బుక్కరాయలు నాయ కత్వం వహించాడు. క్రీ.శ. 1397 ప్రారంభంలో ఈ సైన్యం పానగల్లు కోటను తాకింది. విజయ నగర సైన్యం, రాచకొండ సైన్యానికి అక్కడ యద్ధం మొదలైంది. ఈ యుద్ధం రోజు రోజుకూ పెరుగుతూ రెండేండ్ల పాటు సాగి చివరికి తీవ్ర రూపం దాల్చింది. రెండేళ్ల పోరాటం తర్వాత క్రీ.శ. 1398 చివరి నాటికి పానగల్లు దుర్గం రెండో బుక్కరాయల వశమైంది.

పానగల్లు యుద్ధం జరుగుతున్న సమయంలోనే హరిహర రాయలు దేవరకొండ (నల్లగొండ జిల్లాలో పట్టణం) కోటను కొల్లగొట్టేందుకు మరో సైన్యాన్ని పంపాడు. ఈ సైన్యానికి ఎఱకృష్ణ నాయుడు ఆధిపత్యం వహించాడు. కానీ దేవరకొండలో ఈ సైన్యాన్ని వేదగిరి నాయుని కుమారుడు మూడో మాదానేడు ఎదురించి ఎఱకృష్ణనాయుడిని యుద్ధరంగంలో సంహరించాడు.

విజయనగర రాజులు దేవరకొండను తాకలేకపోయారు కానీ.. పానగల్లును వశం చేసుకు న్నారు. మరోవైపు పడమటి నుంచి దండయాత్ర చేసి ఓరుగల్లు నుంచి మెదక్ వరకు కూడా ఆక్ర మించారు. ఈ సమయంలో రాచకొండాధినేత రెండో సింగభూపాలుడు వృద్ధాప్యంలో ఉన్నాడు. తదుపరి రాజును ఎంచుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. సింగభూపాలునికి ఆరుగురు కొడు కులు. వారు వరుసగా అనపోతానీడు, దాచానీడు, వల్లభనీడు, వేదగిరినాయుడు, దామానీడు, రావు మాదానీడు.

వీరిలో అనపోతానీడు పెద్దవాడు. రెండో సింగభూపాలుని తర్వాత ఇతడే రాజ్యాధికారం చేపట్టాడు. ఇతనికి రెండో అనపోతానాయుడు, అనపోతానేనీ, కుమార అన్నపోతనీడు, పిన అన్నమ, అన్నమనాయుడు, ఇమ్మడి అనపోతానాయకుడు అనే అనేక పేర్లు కూడా ఉన్నాయి. కానీ రెండో అనపోతానాయుడిగానే ఇతడు ప్రసిద్ధి.

రెండో అనపోతానాయుడు (క్రీ.శ. 1400 – 1420) రాజ్యాధికారం చేపట్టిన సమయంలో తెలుగు దేశమంతటా పరిస్థితులు అగమ్యగోచరంగా ఉన్నాయి. అంతఃకలహాలు చెలరేగుతు న్నాయి. ఎవరికి వారు రాజ్య విస్తరణ కాంక్షతో, సొంత కూటములు ఏర్పాటు చేసుకొని ఎదుటివారిపై కయ్యానికి కాలు దువ్వసాగారు.

ఇలాంటి వారి నుంచి రాజ్యాన్ని రక్షించుకోవడమే కాదు, తన తండ్రి చివరి రోజుల్లో కోల్పోయిన ఓరుగల్లు నుంచి మెదక్ ప్రాంతాన్ని, పానగల్ కోటను సాధించాల్సిన తక్షణ కర్తవ్యం అనపోతానాయునికి ఏర్పడింది.

రెండో అనపోతానాయుడు తన పినతండ్రి దేవరకొండ వేదగిరి నాయుని సహాయ సహకారాలతో ముందుగా ఓరుగల్లు నుంచి మెదక్ వరకు గల ప్రాంతం నుంచి విజయనగరా ధీశులను తరిమివేయాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడువు బాబాయితో కలిసి

బరిలోకి దిగాడు. ఈ యుద్ధంలో విజయనగర సైన్యాధ్యక్షుడైన గుండదండాధీశుడిని వేదగిరి నాయుడు సంహరించాడని వెలుగోటి వారి వంశావళి చెబుతున్నది. ఇది క్రీ.శ. 1404లో జరిగింది. ఈ సమయానికి పానగల్ కోటను కూడా తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు. ఈ యుద్ధంలో రాచకొండ సైన్యానికి బహమనీ సుల్తాను కూడా సహాయం చేశాడు. బహమనీలకు, విజయనగరాధీశులకు ఉన్న వైరం కారణంగా వీరిరువురి మధ్య మైత్రి ఏర్పడింది. మొత్తానికి తన తండ్రి చివరిరోజుల్లో పోగొట్టుకున్న ప్రాంతాలను అనపోతానాయుడు తిరిగి స్వాధీనం చేసుకోగలిగాడు.

ఇదే సమయంలో విజయనగరాధీశుడైన రెండో హరిహరరాయలు మరణించాడు. తదనంతరం సింహాసనాన్ని అధిష్ఠించేందుకు ఆయన కొడుకులు తమలో తాము కొట్లాడుకోసాగారు.

అనపోతానాయుడు దీన్ని అవకాశంగా భావించాడు. వెంటనే తన సైన్యంతో విజయనగర రాజ్యంలోకి ప్రవేశించి కర్నూలు పాలకులు, విజయనగర సామంతులైన నంబెట వారిని నాశనం చేశాడు. గజపతుల సామంతులైన సరిపల్లి (సర్వేపల్లి) తిమ్మారెడ్డిని కూడా ఓడించాడు. విజయనగర రాజుల ఆధీనంలో ఉన్న బోయ, తిగుళ రాజ్యాలను కూడా చావుదెబ్బ తీశాడు. ఇలా దిగ్విజయ యాత్ర సాగిస్తూ చెన్నపట్నం వరకూ జయిస్తూ పోయాడు. అనపోతానాయుడు గెలిచిన ఈ ప్రాంతాలన్నీ కొండవీటి రెడ్డి రాజ్యానికి దిగువన ఉన్న భూభాగాలు. ఇదే సమయంలో కొండవీటి రెడ్డి రాజ్యంలో సంభవించిన పరిస్థితులు కూడా అనపోతానాయుని భవిష్యత్తుని నిర్ణయించాయి.

సూరవరము (నూజివీడు ప్రాంతం) అప్పుడొక చోడమండలం. భక్తి చోడ రాజు అధీనంలో ఉండేది. కొండవీటి రెడ్డి రాజులు ఏ విధంగానైనా ఈ చోడమండలాన్ని తమ రాజ్యంలో కలిపేసుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుండేవారు. భక్తి రాజుకు ఇద్దరు కుమారులు. వారు అన్న చోడ దేవుడు, చోడ భీముడు. భక్తి రాజు తర్వాత వారసత్వంగా అన్నచోడ దేవుడు రాజ్యాధీకారం చేపట్టాలి. కానీ కొండవీటి రెడ్డి రాజు అనవేమారెడ్డి చోడ దేవునికి తన కుమార్తెను ఇచ్చి పెండ్లి చేసి రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. చోడ భీమున్ని రాజును చేశాడు.

అనవేమారెడ్డి తర్వాత కుమారగిరి రెడ్డి కొండవీటి రాజ్యాధికారం చేపట్టాడు. అదే సమయంలో కొండవీడు సామంతునిగా రాజమండ్రి ప్రాంతానికి కాటయ వేమారెడ్డి పాలించేవాడు.

అనవేమారెడ్డి వల్ల రాజ్యాధికారం కోల్పోయిన అన్నచోడ దేవుడు సహాయం కోసం వివిధ ప్రాంతాలు తిరుగుతుండేవాడు. అలా దేవరకొండ పెద వేదగిరినాయుడిని ఆశ్రయించాడు. వేదిగిరి నాయుడు అన్నచోడ దేవునికి సహాయంగా వెళ్లి రాజ్యాన్ని తిరిగి ఇప్పించాడు. కానీ వేదిగిరి నాయుడు తిరిగి దేవరకొండకు రాగానే కాటయ వేమారెడ్డి అన్నచోడ దేవున్ని వెళ్లగొట్టాడు. అన్నచోడ దేవుడు తిరిగి వేదగిరి నాయుడి వద్దకు వచ్చాడు. ఈసారి వేదగిరి నాయుడు తన కుమారుడైన మాదానాయుడిని, మరికొంత సైన్యాన్ని సహాయంగా పంపాడు. మాదానాయుడు కాటయ వేమారెడ్డిని ఓడించి మళ్లీ అన్నచోడ దేవుడిని రాజును చేశాడు. తిరిగి దేవరకొండకు వస్తే కాటయ వేమారెడ్డి వల్ల అన్నచోడ దేవునికి ప్రమాదం ఉంటుందనే ఉద్దేశంతో అతనికి తోడుగా అక్కడే ఉన్నాడు. మూడు సంవత్సరాల తర్వాత మాదానాయుడు తిరిగి దేవరకొండకు

వచ్చాడు. ఇలా వచ్చాడో లేదో కాటయ వేమారెడ్డి మళ్లీ అన్నచోడ దేవుడిని రాజ్యం నుంచి తరిమివేశాడు.

ఆ సమయంలో కొండవీటిని కుమారగిరి రెడ్డి తర్వాత పెద కోమటి వేమారెడ్డి పాలించసాగాడు. కాటయవేముడి ఆ చర్యలు పెద కోమటి వేమారెడ్డికి కూడా నచ్చలేదు. రాజమండ్రి నుంచి కాటయను తరిమివేయాలని అతనూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు.

రాచకొండ వారి నుంచి, కొండవీటి వారి నుంచి ప్రమాదం పొంచి ఉందని గమనించిన కాటయ వేమారెడ్డి ఒక మిత్ర కూటమిని ఏర్పాటు చేసుకున్నాడు. విజయనగరాధీశుడైన దేవరాయలతో మైత్రి ఏర్పరుచుకున్నాడు. విజయనగర సైన్యం తోడుతో కాటయ వేమారెడ్డి కొండవీటిపై దాడి చేసి కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకొని స్వతంత్ర రెడ్డి రాజ్యం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విధంగా రెడ్డి రాజ్యం కొండవీడు, రాజమహేంద్రవరం రాజ్యాలుగా విడిపోయింది.



దేవరకొండపై మెట్లదారి

## రెండో అనపోతానేనీ అనంతరం..

# రావు మాదానేని పాలన

**రెడ్డి రాజ్యం.. కొండవీడు, రాజమహేంద్రవరం రెండు రాజ్యాలుగా విడిపోయినప్పటికీ ఆ యుద్ధాలు అంతటితో ఆగలేదు. అన్నచోద దేవునికి రాచకొండ వారు రెండుసార్లు సహాయం చేసినా అతడు రాజ్యాన్ని నిలుపుకో లేకపోయాడు. ఆ తర్వాత ఏమైంది? మళ్లీ పద్మనాయకుల సహాయం అర్థించాడా? అనంతర ప్రయత్నాలు, పరిణామాలు రాచకొండ రాజ్యానికి ఏ దశను, దిశను నిర్ణయించాయి, నిర్దేశించాయి?**

**అన్నచోడ దేవునికి రాచకొండ వారు** రెండుసార్లు సహాయం చేసినా అతడు రాజ్యాన్ని నిలుపుకోలేకపోయాడు. కాటయ వేమారెడ్డి ఇప్పుడు స్వతంత్ర రాజే కాదు, అతనికిప్పుడు బల వంతులైన విజయనగరాధీశులతో మైత్రి కూడా ఉంది. ఇక సామాన్యంగా కాటయను ఎదురిం చడం సాధ్యం కాదని భావించి విజయనగరం వారికి శత్రువులైన బహమనీ సుల్తానులను ఆశ్ర యించాడు. ఆధిపత్య విస్తరణ కోసం ఇలా వచ్చే ప్రతి అవకాశాన్నీ వినియోగించుకునే బహమనీ సుల్తాన్ ఫిరోజ్ షా అన్నచోడ దేవునికి సహాయంగా కాటయ వేమునిపై దాడి చేశాడు. ఇదే సమ యంలో మరోవైపు నుంచి కొండవీటి రాజు పెద కోమటి వేమారెడ్డి కూడా కాటయ వేముని రాజ్యంపై దాడి చేశాడు. ఈ యుద్ధంలో కాటయ వేముడు మరణించగా రాజమహేంద్రవరం అన్నచోడ దేవుని చేజిక్కింది. కానీ అది ఎంతోకాలం అతని చేతిలో నిలువలేదు. కాటయ వేముని రాజ ప్రతినిధి అల్లాడ రెడ్డి అన్నచోడ దేవుడిని సంహరించి కాటయ వేముని కుమారుడైన రెండో కుమారగిరిని రాజును చేశాడు.

కాటయ వేముడిని సంహరిస్తే రాజమహేంద్రవరం తనది అవుతుందనుకున్న పెద కోమటి వేమారెడ్డికి ఆశాభంగం కలిగింది. ఆ రాజ్యం అన్నచోడ దేవుడికి దక్కింది. ఇప్పుడు అతడు మర ణించాక కైవసం చేసుకుందామనుకుంటే అల్లాడ రెడ్డి అడ్డొచ్చాడు. అల్లాడ రెడ్డికి విజయనగరా ధీశుల మద్దతు ఉంది. దీంతో తాను ఒంటిరిగా ఎదురించలేనని భావించిన పెద కోమటి వేమా రెడ్డి బహమనీ సుల్తాను సహాయం అర్థించాడు. ఇందుకోసం ఆయన మంత్రి మామిడి సింగయ సుల్తాను ఫిరోజ్ షాతో రాయబారం నడిపాడు. సుల్తాను సహాయానికి ఒప్పుకొన్నాడు. రెడ్డి సైన్యం, బహమనీల సైన్యం కలిసి రామేశ్వరం వద్ద అల్లాడ రెడ్డిపై దాడి చేశాయి. కానీ అల్లాడ రెడ్డికి దేవరాయల సైన్యం తోడొచ్చింది. భీకరంగా జరిగిన ఈ యుద్ధంలో ఫిరోజ్ షా సైన్యం చిత్తుగా ఓడిపోయింది.

రెడ్డి రాజులకు, బహమనీ సుల్తానులకు మైత్రి కుదిరింది. కానీ సుల్తానుకు ఘోర పరాభవం మిగిలింది. ఈ పరిస్థితి రాచకొండ వారిని సందిగ్ధంలో పడేసింది. బహమనీ సుల్తానులు తమతో స్నేహంగా ఉంటూనే తమకు శత్రువులైన వారితో మైత్రి పెట్టుకున్నారు. పైగా పానగల్లును ఆక్ర మించుకునేందుకు బహమనీలు ప్రయత్నం చేయసాగారు. పెద కోమటి వేమారెడ్డి కుమారుడైన మాచారెడ్డి కూడా ఈ యుద్ధంలో పాల్గొన్నాడు.

క్రీ.శ. 1417లో ప్రారంభమైన పానగల్ ముట్టడి రెండు సంవత్సరాల పాటు జరిగింది.

ఈ పరిస్థితులను జాగ్రత్తగా గమనించిన విజయనగరాధీశుడు దేవరాయలు రాచకొండ వారితో సఖ్యత కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇదే సమయంలో దేవరకొండ పిన (కుమార) వేదగిరి నాయుడు ధరణి కోట ముట్టడి గావించి మాచారెడ్డిని సంహరించాడు. పానగల్ యుద్ధ సమయంలోనే రాచకొండ వారికి, విజయనగరం వారికి మైత్రి ఏర్పడింది. క్రీ.శ. 1419 నాటికి తీవ్రతరమైన పానగల్ యుద్ధం ముగింపు దశకు వచ్చింది. రాచకొండ వారికి దేవరాయలు సైన్యం తోడు రావడంతో ఫిరోజ్ షా సైన్యం తోకముడిచింది. ఫిరోజ్ షా సైతం యుద్ధ రంగంలో తీవ్ర గాయాల పాలై వెనుదిరిగాడు.

రాచకొండ వారు విజయోత్సవంలో ఉండగానే మరో విపత్కర పరిస్థితి ఎదురైంది. మాచారెడ్డి మరణంతో ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్న పెద కోమటి వేమారెడ్డి దేవరకొండపై దాడి చేశాడు. ఒంటరిగా ఉన్న పిన వేదగిరి నాయుడిని సంహరించాడు.

అనపోతానాయుడు ఆగ్రహం పట్టలేకపోయాడు. పెద కోమటి వేమారెడ్డి అంతు చూడాలనుకున్నాడు. తన సేనలు పానగల్ యుద్ధ క్షేత్రం నుంచి రాగానే లింగమనేనిని, తన కొడుకు సింగభూపాలుడిని వెంట బెట్టుకొని కొండవీటిపైకి వెళ్లాడు. వీరికి తోడుగా దేవరాయల సైన్యం కూడా వచ్చింది. ఈ యుద్ధంలో లింగమనేని తన సోదరున్ని చంపినందుకు ప్రతీకారంగా పెద కోమటి వేమారెడ్డిని అంతమొందించాడు.

'పెద కోమటి వేమారెడ్డి మరణం గురించి వెలుగోటి వారి వంశావళిలో చెప్పిన అంశాలు ఒకటికి మించి మరొకటి కనిపిస్తున్నాయి' అని 'రాచకొండ చరిత్రము'లో తేరాల సత్యనారాయణ శర్మ రాశారు. 'ఈ విషయభేదములను అనుసరించి యుద్ధ రంగంలో పెద కోమటి వేమారెడ్డి మరణించలేదని అనిపించకమానదు. కానీ చేజిక్కిన శత్రువు విషయంలో రాచకొండ వారు ఎప్పుడూ దాక్షిణ్యభావం చూపలేదు. మొత్తంగా క్రీ.శ. 1420లోనే ఈ యుద్ధ కారణంగానే పెద కోమటి వేమారెడ్డి మరణించాడనడంలో సందేహం లేదు' అని వివరించారాయన.

రెండో అనపోతానేడు రాజ్యాధికారం చేపట్టిన తొలినాళ్లలో తప్ప తర్వాత ఏనాడూ ప్రశాంతంగా జీవించింది లేదు. ఎక్కువ కాలం యుద్ధ క్షేత్రంలోనే కాలం గడుపాల్సి వచ్చింది. అనపోతానేని చివరి కాలం గురించి స్పష్టమైన ఆధారాలు లేవు. క్రీ.శ. 1428లో ఓరుగల్లులో జరిగిన పోరాటం వరకూ ఇతడు జీవించే ఉండవచ్చని చరిత్రకారుల విశ్వాసం.

ఈ చివరి కాలంలో అనపోతానేని సోదరుడైన రావు మాదానేడు సోదరుని తరపున రాజ్య భారం వహించాడు.

## రావు మాదానాయుడు (క్రీ.శ. 1421-30)

రెండో అనపోతానాయుడి కుమారులు చిన్నవారు కావడంతో అతని తమ్ముడు రావు మాదానాయుడు సింహాసనం అధిష్ఠించాడు. రాచకొండ సంతతిలో రావు పేరుగల వారిలో ఇతడే మొదటివాడు. ఈ సమయంలో దేవరకొండలో పెద వేదగిరి నాయుని మూడో మనుమడు, రెండో (కుమార) మాదానేని కుమారుడు అయిన లింగమనేడు (క్రీ.శ. 1420 – 82) అధికారంలో ఉన్నాడు.

రావు మాదానేడు రాజ్యానికి వచ్చిన తర్వాత కూడా విజయనగరాధీశులతో పూర్వం ఉన్న స్నేహాన్నే కొనసాగించాడు. బహమనీ సుల్తానుతో వారికి జరుగుతున్న యుద్ధాల్లో సహాయం చేసేవాడు.

క్రీ.శ. 1422లో బహమనీ సుల్తాను ఫిరోజ్ షా మరణించిన తర్వాత బహమనీ రాజ్యానికి అహ్మద్ షా (క్రీ.శ. 1422–35) రాజయ్యాడు. ఇతడు అధికారం చేపట్టిన వెంటనే పానగల్లులో

తమకు పూర్వం జరిగిన పరాభవానికి ప్రతీకారంగా విజయనగరంపై దండయాత్రకు బయలు దేరాడు. ఈ వార్త తెలుసుకున్న విజయనగరాధీశుడు దేవరాయలు వెంటనే తన మిత్రసేనలకు ఆహ్వానం పంపి శత్రుమూకలపై దాడికి దిగాడు. బహమనీ సైన్యాన్ని తరిమివేస్తూ బాదామి, తొరగల్లు వంటి దుర్గాలను ఆక్రమించుకున్నాడు. క్రీ.శ. 1424లో జరిగిన ఈ యుద్ధంలో విజయనగరాధీశులకు సహాయంగా రాచకొండ నుంచి మాదానేని, లింగమనేడులు కూడా నాయకత్వం వహించారు. తురుష్కాధిపతి ఈ మిత్ర సేనలను ఎదురింపలేక లొంగిపోయి విజయనగరాధీశునితో సంధి చేసుకున్నాడు.

ఈ సంధి పద్మనాయకులను సందిగ్ధంలో పడేసింది. యుద్ధంలో మాదానీడు విజయనగర పక్షం వహించి తమతో పోరాడినందుకు బహమనీ సుల్తాను అహ్మద్ షా పద్మనాయకులపై పగ పెంచుకున్నాడు. విజయనగరాధీశులతో మైత్రిని ఏర్పరుచుకున్నాడు. ఈ మైత్రి పద్మనాయకులను విజయనగరాధీశులకు దూరం చేసింది. ఇదే అదునుగా భావించిన అహ్మద్ షా రాచకొండపై దాడి చేసి అపార నష్టం కలిగించాడు.



రాచకొండపై ఆలయం

# సర్వజ్ఞ సింగభూపాలుడు

(క్రీ.శ. 1430 - 1475)

**రాచకొండ పద్మనాయకుల్లో సర్వజ్ఞ రావు సింగభూపాలుడు ఒక గొప్ప రాజు. శౌర్య పరాక్రమాలు కలిగినవాడే కాక పండితారాధకుడు కూడా. సింగ భూపాల నామధేయుల్లో ఇతడు మూడోవాడు. ఇతనికే సర్వజ్ఞ సింగభూపాలుడు, మూడో సింగభూపాలుడు, ముమ్మడి సింగభూపాలుడు అనే పేర్లు కూడా వాడుకలో ఉన్నాయి. రెండో అనపోతానేనికి సింగభూపతితో పాటు వసంతానేడు, కేశవనాయుడు, రావు ధర్మానేడు అను ముగ్గురు కుమారులు కూడా ఉన్నారు. వీరిలో పెద్దవాడు సింగభూపాలుడు. ఇతనికి సమకాలికంగా దేవరకొండలో లింగమనేడు (పినతండ్రి) పాలన చేసేవాడు.**

## అది క్రీ.శ. 1425వ సంవత్సరం..

సింగభూపాలుడు ఎదిగి వచ్చాడు. కానీ ఇంకా రాజ్యాధికారం చేపట్టలేదు. తన పినతండ్రి రావు మాదానేని సహాయ సహకారాలతోనే పరిపాలన సాగుతున్నది. ఈ సమయంలో తెలుగునాట రాజకీయ పరిస్థితులు అగమ్యగోచరంగా ఉన్నాయి. అప్పటి వరకు రాచకొండ వారికి మిత్రులుగా ఉన్న విజయనగరాధీశులు, తమ ఇరువురికీ శత్రువులైన బహమనీ సుల్తానులతో సంధిగావించుకున్నారు. విజయనగరాధీశుల ఈ స్వలాభాపేక్ష పద్మనాయకులను సందిగ్ధంలో పడవేసింది. వారి స్వార్థ చింతన రాచకొండపై బహమనీ సుల్తానులు రెచ్చిపోవుటకు అవకాశం

కల్పించింది. విజయనగరం వారి సహాయంతో రాచకొండాధీశులు గతంలో తమకు ఎదురుతిరిగినందుకు రాచకొండ వారిపై బహమనీ సుల్తాను పగ పెంచుకున్నాడు. ఇప్పుడు విజయనగరాధీశులతో సంధి ఏర్పరుచుకొని, వారిని రాచకొండ వారికి దూరం చేశాడు. బహమనీ సుల్తాను అహ్మద్ షా రాచకొండ రాజ్యంపై దాడి చేశాడు. ఇందులో భాగంగా రాచకొండ రాజ్యంలో భాగమైన ఓరుగల్లును ఆక్రమించాడు. 'ఈ యుద్ధంలో ఓరుగల్లు దుర్గాధిపతి ఎవరో మరణించినట్లు ముస్లిం చరిత్రకారులు రాశారు. దీనిని బట్టి అతడు రెండో అనపోతానాయుడేమోనని కొందరు భావించారు. కానీ ఇది సందేహాస్పదమే' అని 'రాచకొండ చరిత్రము' గ్రంథంలో తేరాల సత్యనారాయణ శర్మ రాశారు.

అహ్మద్ షా ఓరుగంటిని ఆక్రమించిన వెంటనే సర్వజ్ఞ సింగభూపాలుడు తన పినతండ్రులైన రావు మాదానేని, లింగమనేని వంటి వీరులను వెంటబెట్టుకొని ఓరుగల్లు యుద్ధానికి బయలుదేరాడు. అక్కడ బహమనీ సుల్తాను తరుపున తిష్టవేసిన అజమ్ ఖాన్‌ను యుద్ధంలో ఓడించి ఓరుగల్లు కోటను తిరిగి సాధించుకున్నారు. ఈ యుద్ధానంతరం సింగభూపాలుడు రాచకొండ సింహాసనాన్ని అధిష్ఠించి చక్కటి పాలన చేశాడు. శౌర్యపరాక్రమవంతుడు అయిన సింగభూపాలుడు సహజంగా యుద్ధ విముఖుడు. ఓరుగల్లు యుద్ధం తర్వాత ఎలాంటి యుద్ధాలు చేయకుండా రాచకొండ రాజ్యంలో సాంస్కృతిక జీవన వికాసం పెంపొందించసాగాడు. స్వతాహాగా పండితుడు అయినటువంటి సర్వజ్ఞ సింగభూపాలుడు తన ఆస్థానంలో విద్యాపీఠాన్ని ఏర్పాటు చేశాడు. అందులో పండితులను చేర్చుకొని వారినెంతో సత్కరించాడు. ఆ ఆస్థాన పండితుల్లో బమ్మెర పోతన, శ్రీనాథ కవి ముఖ్యులు.

ఓరుగల్లు యుద్ధం తర్వాత పది సంవత్సరాల పాటు రాచకొండ రాజ్యంలో ప్రశాంతమైన పాలన సాగింది. ఈ సమయంలో బహమనీ సుల్తాను అహ్మద్ షా మాళవ, గుజరాత్ దేశాలతో పోరాటంలో ఉన్నాడు. ఇప్పుడు వారితోనూ అహ్మద్ షాకు సంధి ఏర్పడింది. ఇక అతని కన్ను మళ్లీ ఓరుగల్లుపై పడింది. తురుష్క సైన్యం ఓరుగల్లుపైకి యుద్ధానికి దిగడంతో ప్రశాంతంగా సాగుతున్న ప్రజల జీవనం అల్లకల్లోళం కాకుడదని, యుద్ధ విముఖతతో సింగభూపాలుడు సంధి చేసుకున్నాడు. ఈ సంధిలో భాగంగా అహ్మద్ షా భువనగిరి దుర్గాన్ని ఇచ్చుకున్నాడు. అహ్మద్ షా తిరిగి వెళుతూ తన సర్దారుగా సంజర్‌ఖాన్‌ను భువనగిరిలో ఉంచి వెళ్లాడు. ఇదొక కుట్ర అని సింగభూపాలునికి అప్పుడు తెలియదు. సంధి పేరుతో రాచకొండ రాజ్యంలో పాగా వేసి తెలంగాణనంతటినీ జయించాలన్నది అహ్మద్ షా కపటోపాయం. ఈ ఆదేశాల మేరకు క్రీ.శ. 1435లో సంజర్‌ఖాన్ ఓరుగల్లునూ ఆక్రమించుకున్నాడు. అటు తర్వాత వరుసగా దుర్గాలను ఆక్రమిస్తూ రాచకొండ సహా, దేవరకొండ మినహా తెలంగాణ అంతటినీ బహమనీలు ఆక్రమించారు. రాచకొండ దుర్గానికి బహమనీ సుల్తాను కుమారుడు దాసూర్‌ఖాన్ ప్రతినిధి అయ్యాడు. ఆ తర్వాత సర్వజ్ఞ సింగ భూపాలుని చరిత్ర, పద్మనాయకుల చరిత్ర దేవరకొండ లింగమనేనితో కలిసిపోయి ఉన్నది.



శ్రీనాథుడు

# పండితారాధకులు.. పద్మనాయకులు

(సర్వజ్ఞ - లింగమ - శ్రీనాథ కవి)

శ్రీనాథ కవిసార్వభౌముడు గొప్పవాడే. మహా పండితుడే. కాదనడం లేదు. కానీ రాచకొండ వారు దొంగదెబ్బ తీసేంత పిరికి వారు మాత్రం కాదు.. రెడ్డి రాజుల పరువు, ప్రతిష్టకు సంబంధించిన ఓ కఠారిని.. కేవలం కొంతమంది సైనికులను పంపి మహారాజును చంపి ఎత్తుకొచ్చుకునేంత చోరులు మాత్రం కాదు. అందునా సర్వజ్ఞ సింగభూపాలుని సోదరుడు లింగమనాయుడు..!? ఏకధాటిగా ముప్పదిరెండు దుర్గాలు ఒకే పర్యాన సాధించిన సమరశూరుడతడు.. అతడు దొంగదెబ్బ తీశాడా? రాజులు కత్తులు దూసి సాధించలేనిది.. కవిరాజులు కలం దూసి సాధించారని కొత్త చరిత్ర రాసుకునే క్రమంలో అదే కలంతో 'మన చరిత్ర'ను వక్రీకరించిన ఓ సందర్భం ఇది.

**పద్మనాయకులు పరమ పండితారాధకులు. స్వతాహాగా** పండితులు కూడా. సర్వజ్ఞ సింగభూపాలుని తాత రెండో సింగభూపాలుడు రసార్ణవసుధాకరం అనే లక్షణ గ్రంథాన్ని రచించాడు. సర్వజ్ఞ దేవుని సంగీత రత్నాకరానికి సంగీత సుధాకరం అనే వ్యాఖ్యానం, కుమలయావళి అనే నామాంతరం గల రత్నపాంచాలిక అనే నాటకాన్ని రచించాడు.

కాశీ విశ్వేశ్వర మిశ్రుని శిష్యుడైన విశ్వేశ్వర కవిచంద్రుడు, బొమ్మకంటి అప్పయాచార్యుడు అనే కవి పండితులకు రెండో సింగభూపాలుడు తన ఆస్థానంలో స్థానం కల్పించి ఆదరించాడు.

విశ్వేశ్వర కవి చమత్కారచంద్రిక అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. సింగభూపాలుడిని ఇందులో నాయకునిగా చేసి కవిచంద్రుడు అనే అలంకారంతో ఎన్నో ఉదాహరణలిచ్చాడు. అప్పటి చారిత్రక విషయాలు తెలియజెప్పడంలో ఈ గ్రంథం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నదని చరిత్రకారులు చెబుతారు. మరో కవి పండితుడు అయిన బొమ్మకంటి అప్పయాచార్యులు 'అమరకోశం' అనే గ్రంథాన్ని రాశాడు. ఇది కూడా చారిత్రక విశేషాలు గల కావ్యం.

రెండో సింగభూపాలునికి సోదరుడు, సమకాలీనుడు అయిన దేవరకొండాధిపతి పెద వేదగిరి నాయుడు కూడా పండితారాధకుడు. తన తండ్రి మాదానాయుని వల్ల వేదగిరి నాయునికి సాహిత్యాభిలాష కలిగింది. ఇతడు శాకల్య అయ్యలార్యుడు అనే పండితుడిని ఆదరించాడు. అసంపూర్ణమైన 'భాస్కర రామాయణా'న్ని వేదగిరినాయుడు అయ్యలార్యుడితో పూర్తి చేయించాడు.

రావుమాదానేడు కూడా తన తండ్రి రెండో సింగభూపాలునిలాగే గొప్ప విద్వాంసుడు. ఇతడు వైష్ణవ మతాభిమాని. ఇతను రామానుజాచార్యుని కుమారుడైన వెంకటాచార్యుని శిష్యుడు. ఇతను క్రీశ. 1421లో తొర్రూరు గ్రామానికి శ్రీరంగాపురం అని నామకరణం చేసి శ్రీ రంగనాథ స్వామికి దానం చేశాడు. క్రీ.శ. 1429లో ఇతని భార్య నాగాంబిక రాచకొండ సమీపంలో నాగ సముద్రం అనే చెరువును తవ్వించి అక్కడో శాసనం వేయించింది. అందులో తన భర్త అయిన రావు మాదానేడు వాల్మీకి రామాయణానికి 'రాఘవీయం' అనే వ్యాఖ్యానం రచించి శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చినట్లు పేర్కొంది.

రావు మాదానేని అనంతరం రాజ్యాధికారానికి వచ్చిన సర్వజ్ఞ సింగభూపాలునికి కూడా పూర్వీకుల సంస్కారం అబ్బింది. మహాకవి పోతనామాత్యుడిని తన ఆస్థాన కవిగా ఆరాధించిన ఘనత ఈ సింగభూపాలునికి దక్కింది. ఇతని కాలంలో మహా కవిసార్వభౌముడైన శ్రీనాథుడు రాచకొండను సందర్శించాడు.

శ్రీనాథ కవి పెద కోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా ఉన్నాడు. రాజమహేంద్రవర ప్రభువు వేమారెడ్డి ఆస్థాన కవి కూడా. వినుకొండ వల్లభామాత్యుడు, సర్వజ్ఞ సింగభూపా

లుడు, ప్రౌఢ దేవరాయలు, సాంపరాయని మైలారురెడ్డి, తెలుగు రాయలు మొదలైన వారి ఆస్థానాలను సందర్శించి తన పాండిత్య ప్రదర్శనతో గౌరవం పొందిన వాడు శ్రీనాథుడు.

చారిత్రక పరిణామాల్లో జరిగే వివిధ సంఘటనలు, వివిధ వ్యక్తుల గురించి సమగ్రంగా తెలియాలంటే ఆయా కాలాలు సరిగ్గా తెలియడం చారిత్రక కథనానికి చాలా అవసరం. శ్రీనాథ కవి, సింగభూపాలుని విషయంలో కూడా ఇలాంటి చాలా అపోహలున్నాయి.

సర్వజ్ఞ సింగభూపాలుడు.. రాచకొండ చరిత్రలో సింగభూపాల నామధేయుల్లో మూడో వాడు. ఈ ముగ్గురిలోని రెండో సింగభూపాలుని కాలంలో శ్రీనాథుడు రాచకొండకు వచ్చాడని కొందరు చరిత్రకారులు రాశారు. కానీ ఇది తప్పు. శ్రీనాథ కవి మూడో సింగభూపాలుడైన సర్వజ్ఞ కాలంలోనే దర్శించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా 'రాచకొండ చరిత్రము' అనే గ్రంథంలో తేరాల సత్యనారాయణ శర్మ రాశారు.

శ్రీనాథుని భీమఖండ కృతి సమర్పణ, కవిసార్వభౌమ బిరుదు, కాశీఖండ కృతి సమర్పణ, డిండిమ విజయం, కనకాభిషేకాల ఆధారంగా క్రీ.శ. 1428–30 సంవత్సరాల మధ్య రాచకొండను సందర్శించినట్లు తెలుస్తున్నది. ఆ సమయంలో ఇక్కడ రాచకొండను పాలిస్తున్నది మూడో సింగభూపాలుడు. ఇదే సమయంలో దేవరకొండాధీశుడు లింగమనేనినీ శ్రీనాథుడు సందర్శించాడు. ఆ సందర్భంలో లింగమనేనిని కీర్తిస్తూ శ్రీనాథుడు 'అల్లయ వేముని గెల్చినట్లు' ఒక పద్యం పాడాడు. అల్లయ కొడుకైన ఈ వేమారెడ్డి రాజమహేంద్రవరంలో అప్పుడు రాజ్యాధికారం(క్రీ.శ 1423–34)లోనే ఉన్నాడు. లింగమనేని పూర్వ విజయాల్లో క్రీ.శ. 1428 నాటికి రాజమహేంద్రవరం సాధించినట్లు ఆధారాలున్నాయి. దీనిని బట్టి రాజమహేంద్రవర అధిపతులు లింగమనేనితో సామరస్యం కోసం ప్రయత్నించినట్లు, ఇందులో భాగంగానే శ్రీనాథుడు సింగభూపాలుని దర్శనానంతరం లింగమనేనినీ సందర్శించినట్లు తెలుస్తున్నది. శ్రీనాథుని పర్యటన కొండవీటి నుంచి కాక రాజమహేంద్రవరం నుంచే జరిగినట్లు 'నందికంత పోతరాజు కఠారి కథ' ఆధారంగా కూడా కొంత తెలుస్తున్నది.

ఆ కథ ఏమంటే..? కొండవీటి రెడ్ల కులదైవంగా నందిపోత రాజు కఠారిగా వెలిశాడు. ప్రతిష్టకు, పరాక్రమానికి కొలమానంగా ఉన్న ఆ కఠారి అనేక మంది రాజుల చేతులు మారుతూ వచ్చింది. పరాయి రాజుల చెంతకు కూడా అనేక సార్లు చేరింది. అలాంటి కఠారిని కొండవీటి పెదకోమటి వేమారెడ్డి కాలంలో ప్రౌఢ దేవరాయలు ఎత్తుకెళ్లిపోయాడు. ఆ కఠారిని ఈ సారి యుద్ధంతో కాకుండా పాండిత్యంతో గెలిచి సాధించాలని వేమారెడ్డి తన ఆస్థాన కవి శ్రీనాథుడిని పంపుతాడు. శ్రీనాథుడు తన పాండిత్యంతో దేవరాజు మెప్పు పొంది కఠారి సాధించుకొని వస్తాడు.

ఇదీ ఆ కథ. ఆ కఠారి పెదకోమటి రెడ్డి అనంతరం.. కొండవీటి రెడ్డి రాజ్యం రెండు రాజ్యాలుగా విడిపోయిన తర్వాత.. జరిగిన అనేక యుద్ధాల్లో రాజమహేంద్రవరాధీశుల

చేజిక్కింది. వారిని జయించిన సందర్భంలో విజయగర్వంతో దేవరకొండ లింగమనేడు ఆ కఠారి తీసుకుని వచ్చాడు. ఇందుకోసం ఈసారీ రాజమహేంద్రవరం రాజులు యుద్ధంతో కాకుండా.. కవిరాజుల పాండిత్యంతో సాధించాలని.. పండితారాధకులైన రాచకొండ వారి దర్శనానికి శ్రీనాథ కవిని పంపారు. సర్వజ్ఞ సింగభూపాలుని మెప్పు పొంది శ్రీనాథుడు తిరిగి కఠారి తీసుకొని వెళ్లాడు.

ఈ చారిత్రక నేపథ్యంలో రాచకొండ వారి వీరత్వాన్ని.. చోరత్వంగా మార్చే క్రమంలో అనేక చరిత్రాత్మక వక్రీకరణలు జరిగాయి. ఎవరికి వారు తమ వారికి అనుగుణంగా చరిత్రను రాసుకున్నారు.

అలాంటి చరిత్ర నుంచి స్ఫూర్తి పొంది.. కొందరు సినిమాలు కూడా తీశారు. అలాంటి సిని మాల్లో ఒకటి శ్రీనాథ కవిసార్వభౌముడు (క్రీ.శ. 1993). ఇది చారిత్రక సినిమా కాదు. కానీ మన చరిత్రను వక్రీకరించిన సినిమా.

పెదకోమటి వేమారెడ్డి పేరు.. పెదకోమటి భూపతి (మిక్కలినేని)గా మార్చారు.

శ్రీనాథుడు(ఎన్టీఆర్) ప్రౌఢదేవరాజు వద్ద నుంచి నందిపోత రాజు కఠారిని తీసుకు వచ్చే వరకు బాగానే ఉంది.


కానీ రాచకొండ వారు కొందరు సైనికులను పంపి పెదకోమటి భూపతిని దొంగదెబ్బ తీసి చంపి కఠారిని ఎత్తుకొచ్చినట్లు చూపించారు. ఇది ఉద్దేశ పూర్వకంగానో, తెలియక చేసిన పనో కావొచ్చు.. కానీ పెదకోమటి పేరు మార్చినప్పుడు సింగమనాయుని పేరు కూడా మార్చాలి కదా.. సింగ భూపాలుడు అని ఉంచారు. పైగా సర్వజ్ఞ సింగ భూపాలుడు (గుమ్మడి) అని కూడా చెప్పారు. కొండవీటి కుల దైవమైన కఠారిని మీ సైనికులు చోరి చేశారని శ్రీనాథుడు మొరపెట్టు కుంటాడు. కఠారి తిరిగి ఇచ్చేయమని అర్థిస్తాడు.

అప్పుడు సింగభూపాలుడు 'మీ కొండవీటి రాజులు.. విద్యానగరం రాజ్యంపై కత్తి దూసి సాధించలేని ఘనవిజయాన్ని.. కలం దూసి అవలీలగా.. కైవసం చేసుకొచ్చిన కవి సార్వభౌముల పవిత్ర హస్తం.. నన్ను అర్థించడానికి కిందిదయినప్పుడు.. నాది పై చేయిగా ఇచ్చే మహదావకా శాన్ని నేను జారవిడుచుకుంటానా? సగర్వంగా ఆ కఠారిని మీకు సమర్పిస్తాను' అని తిరిగి ఇచ్చేస్తాడు.

బావుంది. ఇక్కడ ఎవరినీ తప్పు పట్టడం లేదు. మనల్ని మనం తప్పు పట్టుకోవడం తప్పు.

శ్రీనాథ కవి.. గొప్పవాడే. కాదనడం లేదు.. కానీ.. అతడు తీసుకెళ్లినవాడు.. మాత్రమే..

రాచకొండ వారు.. ఇచ్చిన వారు.. కఠారిని తిరిగిచ్చిన వారు.. అదీ పై చేయిగా.. పండితా రాధకులుగా.. కత్తులు దూయడమే కాదు.. కలాలతో కలుపుకొని పోవడాన్నీ స్వాగతించి.. సరికొత్త చరిత్ర లిఖించిన వారు. అలాంటి తెలంగాణ చరిత్రను మనం తిరిగి రాసుకోవాలి.



దేవరకొండ

## పద్మనాయకుల్లో చివరి పరాక్రమవంతుడు

# లింగమనేడు

**(క్రీ.శ.1420-1482)**

**క్రీ.శ. 1435 తర్వాత కాలంలో రాచకొండ పరిస్థితులు అల్లకల్లోలంగా మారాయి. అప్పటికే సంజర్ ఖాన్ రాచకొండను ఆక్రమించుకున్నాడని మహ్మదీయ చరిత్రకారులు రాశారు. కానీ అందుకు ఆధారాలు చరిత్రలో లభించలేదు. దీంతో నామమాత్రంగానైనా సర్వజ్ఞ సింగభూపాలుడు అధికారంలో ఉన్నాడో లేదో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. క్రీ.శ. 1458 నాటి సింగభూపాలుని శాసనం ఒకటి బెల్లంకొండలో లభించింది. దీన్నిబట్టి సింగభూపాలుడు అంతకుముందెప్పుడో రాచకొండను వదిలి ఉండొచ్చని చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ తర్వాత సింగభూపతి చరిత్ర అంతా లింగమనేనితో కలిసిపోయి ఉన్నది.**

**దేవరకొండ పాలకుల్లో రెండో మాదానేని** చిన్న కొడుకు లింగమనేడు. ఇతనినే లింగ మనాయుడు, లింగభూపతి అని కూడా పిలుస్తారు. రాచకొండ రాజ్యం చివరి దశలో ఓ మెరుపు మెరిసిన పరాక్రమవంతుడు ఈ లింగమనేడు. ఏకధాటిగా ముప్పైరెండు దుర్గాలను ఒకేసారి సాధించిన ఘనత ఇతనిదని చరిత్ర చెబుతున్నది.

శ్రీనాథ కవి రాచకొండలో సర్వజ్ఞ సింగభూపాలుడిని సందర్శించిన అనంతరం దేవరకొండ లింగమనేనిని కూడా దర్శించుకున్నాడు. ఆ సందర్భంలో శ్రీనాథుడు అల్లయ వేమారెడ్డిని జయించిన వీరునిగా లింగమనేనిని స్తుతిస్తూ పద్యం పాడాడు. దీనిని బట్టి శ్రీనాథుని ఈ పర్యటనకు ముందే.. అంటే క్రీ.శ. 1428కి పూర్వమే లింగమనేడు అల్లయ వేమారెడ్డిని యుద్ధంలో ఓడించి రాజమహేంద్రవరాన్ని, వీరభద్రారెడ్డిని జయించి సింహాచలాన్ని సాధించినట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత వేములకొండ, మామిడాల, సప్తమాడియాలు, ఆవంచ, గంగవరాలను కూడా లింగమనేని ఆక్రమించాడు.

ఇదే సమయంలో కళింగ గాంగరాజైన నాల్గవ భానుదేవునిపై అతని మంత్రి కపిలేశ్వర గజపతి తిరుగుబాటు చేసి కళింగ సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతడు వచ్చీ రాగానే రెడ్డి రాజ్యభాగాల్లోకి కూడా ప్రవేశించి కొంతభాగాన్ని ఆక్రమించుకున్నాడు. ఈ ఆక్రమణనూ, మరోవైపు లింగమనేని విజృంభణను విజయనగర దేవరాయలు సహించలేకపోయాడు. వెంటనే తెలుంగ రాయలను సింహాచలంపైకి పంపాడు. దీంతో అటు గజపతులు, ఇటు లింగమనేని సైన్యాలు వెనుతిరిగాయి. ఈ పరిస్థితుల్లో ఇద్దరూ వేర్వేరుగా పోరాటం చేయడం కంటే కలిసి చేస్తేనే మంచిదని లింగమనేని, కపిలేశ్వర గజపతి చేయి కలిపారు. వీరిద్దరూ కలిసి దక్షిణాంధ్ర భూభాగాలను జయించారు. మొదట కొండవీడులో కొన్ని ప్రాంతాలను జయించి, ఆ తర్వాత శ్రీశైలాన్నీ ఆక్రమించుకున్నారు. అటుతర్వాత వీరిరువురూ కర్నూలు, నెల్లూరుతో సహా పరిసర దుర్గాలను ఆక్రమించి చివరగా కంచి (క్రీ.శ. 1437)ని ఆక్రమించారు. ఈ సమయంలో సర్వజ్ఞ సింగభూపాలుడు కూడా వీరికి తోడుగా ఉన్నాడు.

లింగమనేడు, సింగమనేడు ఈ యుద్ధాల్లో ఉండడం వల్ల రాచకొండ రాజ్యంపై బహమనీ సుల్తాను కన్నుపడింది. ఇదే అదునుగా రాచకొండ రాజ్యంలో ఉత్తరభాగాన్ని బహమనీలు ఆక్రమించుకున్నారు.

అదే సమయంలో బహమనీ రాజ్యంలో అంతఃకలహాలు మొదలయ్యాయి. అహ్మద్ షా అనంతరం రెండవ అల్లావుద్దీన్ అహ్మద్‌షా (క్రీ.శ. 1435–1458) బహుమనీ రాజయ్యాడు. ఇతని సోదరుడు మహ్మద్‌ఖాన్ తిరుగుబాటు చేసి రాయచూర్, షోలాపూర్, బీజాపూర్ దుర్గాలను ఆక్రమించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. బహమనీల సామంతుడుగా నిజామాబాద్ జిల్లాలోని బాలకొండను ఏలుతున్న సికిందర్‌ఖాన్ కూడా ఇదే పనిచేశాడు. మహ్మద్‌ఖాన్‌తో కలిసి సబ్బినాడు (కరీంనగర్)ను, భువనగిరి ప్రాంతాలను ఆక్రమించుకున్నాడు.

బహమనీలకు ఎదురైన ఈ వరుస తిరుగుబాట్లను అవకాశంగా తీసుకోవాలనుకున్నాడు లింగమనేడు. బహమనీల పక్షం వహించి ఈ తిరుగుబాటుదారులను అణిచివేసి సుల్తాను మెప్పు

పొందాలనుకున్నాడు. ఇందులో భాగంగా సికిందర్‌ఖాన్‌ను ఓడించి భువనగిరిని జయించాడు లింగమనేడు. కానీ సుల్తాన్ లింగమనేనికి ప్రత్యుపకారమేమీ చేయలేదు.

ఈలోగా సుల్తాన్ అల్లావుద్దీన్ మరణించాడు. అతని తర్వాత హుమాయూన్ (క్రీ.శ. 1458–61) బహమనీ రాజయ్యాడు. ఇతడు మహా క్రూరుడు. ఇతడు రాజ్యాధికారం చేపట్టేనాటికి బాల కొండలో సికిందర్‌ఖాన్ రాచకొండాధినేతలను మంచి చేసుకున్నాడు, పైగా సుల్తానును ఎదిరించసాగాడు. దీంతో ఆగ్రహం పట్టలేక హుమాయూన్ సికిందర్‌ఖాన్‌పై దాడి చేసి యుద్ధంలో చంపేశాడు. అటుతర్వాత దీనికంతటికీ దేవరకొండ లింగమనేనినే కారణమని భావించి హుమాయూన్ దేవరకొండపైకి నిజామ్ ఉల్ ముల్క్, ఖ్వాజా జహా అనే సేనానులకు భారీ సైన్యాన్ని ఇచ్చి పంపాడు. తానూ కొంత సైన్యంతో ఓరుగల్లు పై దాడి చేసి స్వాధీనం చేసుకున్నాడు. దేవరకొండలో మాత్రం లింగమనీడు, సింగమనేని బహమనీ సైన్యాన్ని ఎదిరించగలిగారు. వీరికి తోడుగా కపిలేశ్వర గజపతి తన కుమారుడైన హంవీరుడిని కూడా పంపాడు. ఈ యుద్ధంలో సుల్తాను సైన్యం చిత్తుగా ఓడిపోయింది. సుల్తాన్ సేనానులు ప్రాణ భయంతో యుద్ధరంగం నుంచి పలాయనం చిత్తగించారు. ఈ విషయం తెలుసుకున్న హుమాయూన్ ఆ సేనానులిద్దరిని క్రూరంగా చంపేశాడు. లింగమనేడు ఇంతటితో వదులకుండా తెలంగాణలో తాము నష్టపోయిన దుర్గాలను హంవీరుని సహాయంతో తిరిగి కైవసం చేసుకోవడం మొదలెట్టాడు. ఇలా మొదటగా ఖమ్మం మెట్టు, తర్వాత భువనగిరి, ఓరుగల్లు దుర్గాలు తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.


క్రీ.శ. 1468లో కపిలేశ్వర గజపతి మరణించాడు. అతని కొడుకులు హంవీర దేవుడు, పురుషోత్తమ గజపతి వారసత్వం కోసం పోరాటం మొదలుపెట్టారు. దీంతో పద్మనాయకులకు మళ్లీ కష్టాలొచ్చాయి. తనకు సహాయం చేస్తే తెలంగాణను తమ వశం చేస్తానని హంవీరుడు మూడవ మహ్మద్‌షా (క్రీ.శ. 1463–1482)కు కబురు పంపాడు. బహమనీ సుల్తాను దీన్ని స్వాగతించాడు. దీంతో పద్మనాయకులు అటు గజపతులతోనూ, ఇటు బహమనీలతోనూ పోరాడాల్సి వచ్చింది. గజపతుల సంక్షోభం అలా ఉండగా.. తెలంగాణ మొత్తం క్రీ.శ. 1475 నాటికి బహమనీల వశమయింది. పద్మనాయక రాజ్యం అంతరించసాగింది. సర్వజ్ఞ సింగభూపాలుడు, లింగమనేని విజయనగర రాజుల కొలువులో చేరారు. దేవరకొండ తప్ప తెలంగాణలో మిగిలిన భాగమంతా బహమనీల వశమైంది. రాచకొండ కోటలో సభామందిర స్తంభంపై ఉన్న పార్సీ శాసనం ఈ విషయాన్ని చెబుతున్నది. క్రీ.శ. 1481 నాటికి నిజాముల్ ముల్క్ బహ్రీ, ఆజంఖాన్‌లు బహమనీల రాజప్రతినిధులైనారు. లింగమనేని తర్వాత అతని సోదరుడు సూరానేడు, అటు తర్వాత కుమారుడు పర్వతరావు, ఆ తర్వాత సర్వతరావు కొడుకు కుమార లింగమనేడు దేవరకొండను నామమాత్ర పాలకులుగా ఏలారు.



దేవరకొండ



ప్రధానద్వారం



కొండపైకి మెట్లదారి



దుర్గం



ప్రవేశద్వారం

రెండో అధ్యాయం

# పద్మనాయకుల సంస్థానాలు

**కాకతీయుల కాలంలో నాయంకర వ్యవస్థలో నాయకులుగా, 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదుతో స్వతంత్ర పాలన చేసిన కాలంలో నాయుడ్లుగా, నేడు, నేనిగా.. అటుతర్వాత నాయనంగారు, తదుపరి రాయణంగారు లుగా పద్మనాయకుల పేరు చివరన గౌరవవాచకాలు కనిపిస్తాయి. ఒకటిన్నర శతాబ్ద రేచర్ల చరిత్రలో సుమారు వందేళ్లకు పైగా స్వతంత్ర రాజ్యం చేసిన పద్మనాయకులు చివరకు విజయనగర రాజుల కొలువులో చేరారు. అటుతర్వాత మహమ్మదీయులకు లోబడి వారికి సామంతులుగా చాలా సంస్థానాలను స్థాపించారు.**

రాచకొండ చివరి రాజు సర్వజ్ఞ సింగభూపాలుని కాలంలోనే దేవరకొండాధీశుడు లింగమనేని పెక్కు విజయాల గురించి మొదటి అధ్యాయంలో తెలుసుకున్నాం. ఈ విజయాల్లో భాగంగా లింగమనేని సింహాచలం, కంచి ప్రాంతాలను ఆక్రమించినప్పుడు వీరి వంశీకులు చాలామంది ఆ ప్రాంతాల్లో స్థిరపడి చిన్న చిన్న రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో వెలుగోటి రాజ్యం, విశాఖలో బొబ్బిలి రాజ్యం అలా ఏర్పడినవే. ఆ తర్వాత క్రమంగా వెలుగులోకి వచ్చిన వెలమ సంస్థానాలు చాలానే ఉన్నాయి. వెంకటగిరి, జటప్రోలు, శ్రీకాళహస్తి, పిఠాపురం, నూజివీడు ఇందులో ముఖ్యమైనవి.



వెంకటగిరి కోట

# వెంకటగిరి

పద్మనాయక వెలమ సంస్థానాల్లో వెంకటగిరి సంస్థానం ముఖ్యమైనది. చాలా ప్రాచీనమైనది కూడా. నెల్లూరు మండలం విస్తీర్ణం ఎనిమిది వేల చదరపు మైళ్లు ఉంటే.. అందులో వెంకటగిరి సంస్థాన విస్తీర్ణం దాదాపు రెండు వేల చ.మై. ఉండేది. నెల్లూరు మండలంలోని పాత తాలూకాలైన కొచ్చెర్లకోట, దరిసి, వెఖ్యారు, పొదిలి, పోలూరు, మనుబ్రోలు, మల్లాం, మారెల్ల, వెంకటగిరి, సగుటూరు.. ఈ పది తాలుకాలలో వ్యాపించి ఉండేది.

**వెంకటగిరి సంస్థాన పాలకులు** పద్మనాయక వెలమలు. 'యాచేంద్ర' వీరి వంశ పరంపర గౌరవనామం. రాచకొండ పద్మనాయక సామ్రాజ్యంలో ఆరు తరాలు, సుమారు నూట ఇరవై ఏండ్లు పాలించి సాహిత్య సమరంలో అసమాన కీర్తి గడించిన రేచర్ల ప్రభువుల ప్రధాన శాఖ ఈ వేంకటగిరి పురవరాధీశులది. వీరు పూర్వులు భేతాళనాయుడు, ప్రసాదిత్యుడు, సింగభూపాలుడు, ఆంధ్రదేశాధీశ్వర బిరుద ప్రధానుడు అనపోతానాయుడు, సర్వసాహిత్య ప్రఖ్యాతుడు సర్వజ్ఞ సింగభూపాలుడు.

సర్వజ్ఞ సింగభూపాలుడు, లింగమనేని కాలంలో మహమ్మదీయుల దాడులు నానాటికీ విజృంభించడం వల్ల అప్పటికి ప్రబలులై ఉన్న విజయనగర రాజుల (హంపి)ను వీరు సాయం అర్థించారు. చివరి రోజుల్లో రాచకొండ, దేవరకొండ దుర్గాలనూ నిర్వహించలేక వెలుగోడు దుర్గాన్ని సుస్థిర పరుచుకొని విజయనగర సామంతుల్లో ముఖ్యులయ్యారు. ఈ పద్మనాయకుల ఇంటి పేరు వెలుగోటి వారు. వెలుగోడులో స్థిరపడిన నాటి నుంచే వీరికి ఆ పేరు వచ్చింది. క్రీ.శ. 15వ శతాబ్దంలో విజయనగర సామంతులుగా మారిన వెలుగోటి వారు క్రీ.శ. 16వ శతాబ్దం నాటికి విజయనగర సామంతుల్లో ప్రముఖులుగా కీర్తి పొందారు. కర్ణాటాంధ్రాధీశుడైన విజయనగర శ్రీకృష్ణదేవరాయల పట్టభిషేక సమయంలో ధూర్జటి కవి వీరి గురించి ప్రత్యేకంగా పేర్కొన్నట్లు 'వెలుగోటి వారి వంశావళి' చెబుతున్నది. విజయనగర సామ్రాజ్యానంతరం వెలుగోటి వారు మహమ్మదీయుల సామంతులుగా, అటు తర్వాత బ్రిటీష్ పాలన వరకు తన వాసిని కోల్పోకుండా విఖ్యాతిగాంచారు.

వెలుగోటి వారి సంస్థాన చరిత్రలో పదిహేనో తరానికి చెందిన నిర్వాణరాయప్పనాయుడు ముఖ్యుడు. ఇతనినే పెదరాయడు అని కూడా అంటారు. ఇతడు మహావిక్రముడుగా ప్రఖ్యాతుడు. ఇతని కుమారుడు లింగప్పనాయుడు బొబ్బిలి పాలకులకు మూలపురుషుడు. నిర్వాణరాయప్పనాయుని మూడో కుమారుడు కుమార తిమ్మానాయుడు. ఇతడే వెంకటగిరి పాలకులకు మూలపురుషుడు. ఇతనికి ముగ్గురు కుమారులు. వారు పెదకొండప్ప నాయుడు, తిమ్మానాయుడు, పినకొండప్పనాయుడు. మూడో వాడైన పినకొండప్పనాయుడు వెంకటగిరి వారి కూటస్థుడు. ఇతనికి ముగ్గురు భార్యలు. పదిమంది కొడుకులు. పెద్ద భార్య తిమ్మాంబ కొడుకు రాయప్ప. ఈ రాయప్ప కొడుకు వెంకటాద్రినాయుడు వెంకటగిరి నగర నిర్మాత. వెంకటాద్రినాయుడు క్రీ.శ. 1560లో గొబ్బూరి నరసరాజును జయించి కలిమిలి అనే పేరుగల నగరాన్ని స్వాధీన పరుచుకున్నాడు. దీనికి తన పేరు మీద వెంకటగిరి అనే పేరు పెట్టి నగరాన్ని పునర్నిర్మించాడు. అప్పటి నుంచే వెలుగోటి వారి రాజధాని వెంకటగిరియై విలసిల్లినది.

పినకొండప్పనాయుని రెండవ భార్య అక్కమ్మ కొడుకు యాచమనాయుడు. ఇతడినే పెద యాచమనాయుడు అని కూడా పిలుస్తారు. ఈయనే యాచశూరుడిగా పేరుగాంచాడు. రేచర్ల వంశంలో ఇరువయ్యో తరానికి చెందిన ఇతని నుంచే వెంకటగిరి పాలకులు యాచేంద్రులని వంశపారంపర్యంగా ప్రఖ్యాతికెక్కారు. ఈ యాచాశూరునికే 'కర్ణాటరాజ్యస్థాపనాచార్య' అనే

ప్రఖ్యాత బిరుదు కూడా ఉంది. యాచమనాయుని కుమారుడు కస్తూరి రంగప్పనాయుడు. ఇతని భార్య దామెర వారి ఇంటి బిడ్డ వెంకటాంబ.

వెంకటగిరి కోవలో ఇరవై ఒకటో తరం వాడు, యాచాశూరుని కొడుకు కుమార యాచమ నాయుడు. విజయనగర శ్రీరంగరాయలుకు సమకాలీనుడు. ఈ కుమార యాచమ గోల్కొండ వైస్రాయి నుంచి బహుమతులు పొందినవాడు. ఈయన కొడుకు బంగారు యాచమనాయుడు ఇరవై రెండో తరానికి చెందినవాడు. రాజా బహద్దూర్, షష్ హజార్ మున్సిబ్‌దార్ బిరుదులు పొందినవాడు. నెల్లూరు ఫౌజుదారుడు కుత్రపన్ని ఇతన్ని హత్యచేయించాడు.

బంగారు యాచమ, అక్కమాంబల కొడుకు సర్వజ్ఞకుమార యాచమనాయుడు (1645-1748) ఇరవై మూడో తరం వాడు. ఇతని కుమారుడు బంగారు యాచమ నాయుడు నిజాం నవాబుకు మిత్రుడు. ఇతనికి పుత్ర సంతానం కలుగకపోవడంతో ఆల్వలపాటి వారి ఇంటి నుంచి కుమారున్ని దత్తత తీసుకుని కుమార యాచమ నాయుడు (25వ తరం) అని పేరు పెట్టుకున్నారు.

ఈయనకు సంతానం కలుగకపోవడంతో తన సోదరుడు ఆల్వలపాటి కొండమనాయని కుమారున్ని దత్తత తీసుకుని తండ్రి పేరు బంగారు యాచమనాయుడు అని పెట్టుకున్నాడు. ఈయన 1804లో ఆకస్మిక మరణం చెందినప్పుడు దత్తపుత్రుడు బంగారు యాచమనాయుడు మైనరు కావడంతో సంస్థానం కోర్ట్ ఆఫ్ వార్డ్స్‌వారి ఆధీనంలోకి వెళ్లింది. జుజ్జూరుకు చెందిన శ్రీరామజూపల్లి వారి ఇంటి బిడ్డ అమ్మక్కను ఈ బంగారు యాచమనాయుడు వివాహం చేసుకున్నాడు. వీరి కొడుకు సర్వజ్ఞకుమార యాచమనాయుడు. 1845లో తండ్రి మరణించే నాటికి ఈ సర్వజ్ఞ మైనరు కావడంతో సంస్థానం మరోసారి కోర్ట్ ఆఫ్ వార్డ్స్‌వారి చేతిలోకి వెళ్లింది. మూడేండ్ల తర్వాత 1848లో సర్వజ్ఞ యుక్తవయస్సుకు వచ్చాక జమీందారీ పాలన స్వీకరించాడు. ఈయన భార్య వెల్లంకి రామరాయలు పుత్రిక లక్ష్మీ నరసాంబ. వీరికి ఏడుగురు కొడుకులు, ఇద్దరు కూతుర్లు. కొడుకుల్లో పెద్దవాడయిన రాజగోపాల కృష్ణయాచేంద్ర తండ్రి మరణానంతరం 1879లో వెంకటగిరి సంస్థాన పాలన బాధ్యతలు చేపట్టాడు. ఈయనది ఇరవై ఎనిమిదో తరం.

రాజా సర్వజ్ఞకుమార యాచేంద్రుల మూడో కొడుకు రంగమన్నారుకృష్ణ యాచేంద్రులను 1872లో బొబ్బిలివారు దత్తత తీసుకున్నారు. ఇతడే మహారాజా సర్ రావు వెంకట శ్వేతాచలపతి రంగారావు బహద్దూర్‌గా ప్రసిద్ధికెక్కారు.

నాలుగో కుమారుడు నవనీతకృష్ణ యాచేంద్రను 1877లో జటప్రోలు వారు దత్తత తీసుకున్నారు. ఈ నవనీతకృష్ణనే రాజా సురభి వెంకటలక్ష్మారాయ బహద్దూర్‌గా ప్రఖ్యాతికెక్కారు.

రాజా సర్వజ్ఞకుమార యాచేంద్రుల పెద్ద కుమార్తె లక్ష్మీవెంకయ్యమ్మ సోమవారపుపేట

వాస్తవ్యులు జమీందారు చెలికాని వెంకట గోపాలరాయనింగారిని వివాహమాడారు. రెండో కుమార్తె రాజ్యలక్ష్మమ్మను తిరుపాచూరు జమీందారు ఇనుగంటి వెంకటరమణారయనింగారు పెండ్లి చేసుకున్నారు.

వెంకటగిరి రాజా రాజగోపాలకృష్ణ యాచేంద్రుల కొడుకు ఇరవై తొమ్మిదో తరానికి చెందినవాడు గోవిందకృష్ణ యాచేంద్రులు. ఈయన 1917లో వెంకటగిరి పాలన బాధ్యతలు చేపట్టారు. ఈయన సర్ బిరుదాంకితులు.

గోవిందకృష్ణ యాంచేద్ర, రత్నమాంబల కొడుకు సర్వజ్ఞకుమార కృష్ణ యాచేంద్ర (30వ తరం) తండ్రి తర్వాత పాలన  ఈయన కాలంలోనే వెంకటగిరి సంస్థానం మిగిలిన అన్ని సంస్థానాల మాదిరిగానే ఇండియన్ యూనియన్‌లో కలిసిపోయింది.



జటప్రోలు సంస్థానాధీశుల కాలం నాటి రాజభవనం

# కొల్లాపూర్ (జటప్రోలు)

సంస్థానాల జిల్లాగా పేరొందిన పాలమూరులో పేరెన్నిక గన్న సంస్థానాల్లో జటప్రోలు ఒకటి. తెలంగాణలోని రాచకొండను కేంద్రంగా పాలించిన పద్మనాయక వెలమలు అటు తర్వాత అనేక సంస్థానాలను స్థాపించారు. వాటిలో ఎక్కువ సంస్థానాలు ఆంధ్రప్రాంతం లోనివి కాగా, తెలంగాణలోనివి రెండు మాత్రమే. వాటిల్లో ఒకటి పాల్వంచ, రెండోది జటప్రోలు. కృష్ణానదీ తీరంలో వెలిసిన ఈ సంస్థానాధీశుల చివరి దశలో కొల్లాపూర్‌ను రాజధానిగా చేసుకుని పాలించడంతో ఈ సంస్థానాన్ని కొల్లాపూర్ సంస్థానం అని కూడా వ్యవహరిస్తారు.

**విష్ణుపాదోద్భవులైన పద్మనాయకుల్లో** డెబ్బై రెండు గోత్రాలు గల రాచవెలమలు ఉన్నారు. వీరిలో రేచర్ల గోత్రానికి చెందిన సురభి వారు జటప్రోలు సంస్థానాన్ని స్థాపించారు. రాచకొండ సామ్రాజ్య పాలకులుగా నూట ఇరువై యేండ్లకు పైగా ఏలిన పద్మనాయకుల్లో ప్రముఖులైన అనపోతనాయుడు, సర్వజ్ఞ సింగభూపాలుని సంతతికి చెందినవారు ఈ సురభివారు. ఈ సంతతికి చెందిన ఎఱ్ఱ సూరానాయుని పుత్రులు యాచమ నాయుడు, మాధవ నాయుడు. యాచమనాయుని సంతతివారు వెలుగోటివారు కాగా, మాధవనాయుని సంతతివారు ఈ సురభి వారు. వెలుగోటి వారు వెంకటగిరి, నూజివీడు, బొబ్బిలి సంస్థానాల పాలకులు. జటప్రోలు సంస్థానాధీశులైన సురభి వారి కూటస్థుడు పెద్ద మహీపతి. సర్వజ్ఞ సింగభూపాలుని కాలంలో ఇతడు పేరు ప్రఖ్యాతులు కలిగినవాడు.

పెద్ద మహీపతికి మూడోతరం వ్యక్తి ముమ్మడి మల్లభూపాలుడు. జటప్రోలు మదనగోపాల దేవాలయం నిర్మించింది ఇతనే. ఇతనికి నలుగురు భార్యలు. పట్టపురాణి చెన్నాంబ వల్ల మల్లభూపాలునికి ముగ్గురు కుమారులు కలిగారు. వారు రామరాయలు, మల్ల భూపతి(నాలుగో), మాధవరాయలు. ఇద్దరు అన్నల తర్వాత ఈ మాధవరాయలు పాలన సాగించాడు. పెద్ద మహీపతికి నాలుగో తరానికి చెందిన ఈ సురభి మాధవరాయలు ప్రసిద్ధి చెందిన 'చంద్రికా పరిణయం' ప్రబంధాన్ని రచించాడు. అనెగొంది రాజధానిగా పాలన సాగిస్తున్న ఆళియరామ రాయల నుండి మాధవరాయలు క్రీ.శ. 1527లో జటప్రోలు సంస్థానాన్ని బహుమతిగా పొంది స్థిరపరిచినట్లు చరిత్ర చెబుతున్నది. మాధవరాయలు కుమారుడు నరసింగరావు గోల్కొండ నవాబు అబ్దుల్ హాసన్ కుతుబ్‌షా (తానీషా) నుంచి క్రీ.శ. 1650లో సంస్థానానికి సంబంధించి కొత్త సన్నదును పొందారు. ఈయన 'క్షత్రఖేలనం' అనే గీర్వాణ కృతి రచించాడు. ఈయన కొడుకు చిన మాధవరాయలు 'శూద్రస్మృతి' అనే గ్రంథాన్ని రాశాడు.

చిన మాధవరాయలు తర్వాత జటప్రోలు సంస్థాన చరిత్రలో చెప్పుకోదగిన వాడు సురభి లక్ష్మారాయ బహదూర్. ఈయన పాలనా కాలం వరకు సురభి వారి రాజధాని నగరం జటప్రోలుగా ఉండేది. రాజా సురభి లక్ష్మారాయ బహదూర్ క్రీ. శ. 1840లో రాజధానిని కొల్లాపురాని (నాగర్‌కర్నూల్ జిల్లాలో మండలకేంద్రం కొల్లాపూర్)కి మార్చాడు. అప్పటి నుంచి వీరు కొల్లాపుర సంస్థానాధీశులుగా ప్రసిద్ధికెక్కారు. అప్పటి జటప్రోలు కోట శ్రీశైలం ప్రాజెక్టులో మునిగిపోయిందని చెబుతారు.

కొల్లాపూర్‌కు పూర్వం కొలుములపల్లె అనే పేరుండేది. ఇది ఒక సామాన్య గ్రామం. అప్పట్లో ఇక్కడ ఎక్కువగా కమ్మరి కొలుములు నడిపేవారు. దీంతో ఈ ప్రాంతానికి కొలుముల పల్లె అనే పేరొచ్చింది. అదే రాను రాను కొల్లాపురం అటు తర్వాత కొల్లాపూర్‌గా మారింది.

రాజా లక్ష్మారాయ బహదూర్ కుమారుడు లక్ష్మీ జగన్నాథ రావు. ఈయన క్రీ.శ. 1851 నుంచి 1884 వరకు పాలన సాగించారు. కొల్లాపూర్ కోటను, 1871లో చంద్రమహల్‌ను నిర్మించింది ఈయనే. ఈయనకు నిజాం నవాబు రాజా బహదూర్, నిజాం నవాజ్‌వంత్ బిరుదులు ఇచ్చారు.

రాజా లక్ష్మీ జగన్నాథ రావుకు సంతానం లేకపోవడం వల్ల వెంకటగిరి ప్రభువైన రాజా సర్వ జ్ఞకుమార యాచేంద్ర బహదూర్ నాలుగో కుమారుడైన నవనీత కృష్ణ యాచేంద్రులను దత్తత తీసుకున్నారు. ఈయనే రాజా వేంకటలక్ష్మారావు బహదూర్‌గా పేరు మార్చుకుని క్రీ.శ. 1887 నుంచి జటప్రోలు సంస్థానాన్ని పాలించారు. బొబ్బిలి సంస్థాన పాలకుడైన రాజా రావు వేంకట శ్వేతాచలపతిరంగారావు బహదూర్ ఈయనకు అన్న అవుతాడు. వేంకటలక్ష్మారావు కాలంలో సంస్థాన పరిపాలన పకడ్బందీగా సాగింది. నిజాం నవాబు నుంచి నవాజ్ వంత్ బహదూర్ బిరుదు పొందిన రాజా వేంకటలక్ష్మారావు గురితప్పని గొప్ప వేటగాడుగా పేరు పొందారు. క్రూర మృగాలను సైతం వెంటాడి వేటాడి చంపడంలో ఆయన అందె వేసిన వాడని ఇప్పటికీ ఈ ప్రాంతంలోని ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఈయన తన జీవితకాలంలో 31 పులు లను వేటాడాడట. ఒకే వేటలో ఐదు పులులను వేటాడి వాటిని తన రాజప్రాసాదంలో బంధించాడట. ఈయనకు వేటపై గల అభిలాషకు ప్రతీకగా వీరి రాజముద్రిక కనిపిస్తుంది. రెండు తుపాకుల మధ్య పులి ముఖం చిత్రించి ఉంటుంది. Truth is victory (సత్యమేవ జయతే) అనే వాక్యాన్ని ఆ ముద్రికలో పొందుపరిచారు.

ఈయన హయాంలోనే కొల్లాపూర్‌ను సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్, మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయడం విశేషం. ఈ సురభి రాజా వారు ఆయుర్వేదం, సాహిత్యం, కళలు, టౌన్‌ప్లానింగ్ రంగాలకు విశేష ప్రోత్సాహాన్ని ఇచ్చారు. కృష్ణా ఉపనదిపై తన పేరుమీద లక్ష్మాసాగర్‌ను నిర్మించారు. ఈయన స్వాతంత్ర్యానికి పూర్వమే సొంత విమానాన్ని కలిగి ఉన్నారు. కొల్లాపూర్ జఫర్ మైదానాన్ని విమానాశ్రయంగా ఉపయోగించుకునేవారు. దీనికి సూచకంగా నేటికీ అక్కడొక రాతి స్తంభం ఉంది. పరిపాలనాదక్షుడైన లక్ష్మారావు దసరా ఉత్స వాలు జరుపడంలోను, కవి పండితులను, మల్లయోధులను, శిల్పులను అభినందించడంలోను, ధర్మకార్యాలు చేయడంలోనూ ముందుండేవారు. రాజా వెంకటలక్ష్మణరావును నిజాం ప్రభువు మహబూబ్ అలీఖాన్ ప్రశంసించి 1905 డిసెంబర్ 28న వంత్ బహదూర్ అనే బిరుదును ఇచ్చాడు. ఈయన 1928లో స్వర్గస్తులయ్యారు.


వేంకటలక్ష్మారావు బహదూర్ భార్య వేంకట రత్నమాంబ. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కూతురు వెంకట రాజరాజేశ్వరీ దేవిని తెలప్రోలు వారికిచ్చారు. రెండో కుమార్తె వేంకట సరస్వతీదేవిని తిరుచావూరు జమీందారు వెంకటకృష్ణరాయలు వివాహమాడారు.

వేంకటలక్ష్మారావు అనంతరం రాణి వెంకటరత్నమాంబ కొంతకాలం సంస్థానాన్ని పాలించారు. వేంకట లక్ష్మారావు, రత్నమాంబకు మగసంతానం లేకపోవడంతో బొబ్బిలి రాజా రావు వేంకటశ్వేతాచలపతి రామకృష్ణ రంగారావు బహదూర్ రెండో కుమారుడైన వెంకటజగ న్నాథరావును దత్తత తీసుకున్నారు. ఈయన హైదరాబాద్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో చదువుకున్నారు. రాణి వేంకటరత్నమాంబ సంరక్షణలో రాజా వేంకట జగన్నాథ రావు సంస్థానాన్ని పాలించారు. ఈయననే మూడో వేంకట జగన్నాథరావు అని కూడా అంటారు. మైనారిటీ తీరిన తర్వాత రాజావారు 1943లో పూర్తి స్థాయి పాలనా బాధ్యతలు

చేపట్టారు. సింగపట్నంలోని రత్నగిరి కొండపై రత్నలక్ష్మి అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఇక్కడే పద్మ నిలయం పేరుతో విడిది కోసం చక్కని బంగ్లాను నిర్మించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి, కొల్లాపూర్‌లోని బండయ్య గుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయానికి గాలి గోపురాలను నిర్మింపజేశారు. ఈయన కూడా తండ్రిలాగే క్రూర జంతువులను వేటాడడంలో దిట్ట. రాజా జగన్నాథరావు తన చిన్నక్క కూతురు ఇందిరాదేవిని వివాహమాడాడు. ఇందిరాదేవి వేంకట సర్వతీదేవి (రాణి వేంకటరత్నమాంబ చిన్నకూతురు) కూతురు.

జగన్నాథరావు కాలంలోనే అన్ని సంస్థానాలతోపాటు జటప్రోలు సంస్థానం కూడా భారత యూనియన్‌లో విలీనమైంది. అనంతరం జగన్నాథరావును రాజకీయాల్లోకి వచ్చి ప్రభుత్వ ఉన్నత పదవులను అలంకరించాలని పలువురు కోరినా తిరస్కరించి సేవా ఆధ్యాత్మిక రంగాలను ఎంచుకున్నారు. గుర్రపు స్వారీ అంటే ఆసక్తి గల రాజావారు భారత సేవక్ సమాజ్‌కు అధ్యక్షుడిగా పనిచేశారు. తన భార్య ఇందిరాదేవి పేరున ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అవసరమైన భవనాన్ని, ఏడెకరాల స్థలాన్ని ఇచ్చారు. అంతేకాకుండా మున్సిఫ్ కోర్ట్, సబ్‌జైలు, రెవెన్యూ, ప్రభుత్వ ఆసుపత్రి భవనాల్ని, పెంట్లవెల్లిలో అవుట్ పోస్టు భవనాన్ని, ఆర్ఐడీ హైస్కూల్‌కు భవనాన్ని ఉచితంగా ఇచ్చారు. 1962లో మూడు వందల ఎకరాల సొంత భూమిని వివిధ ఆలయాలకు ఇచ్చి వాటికి ధర్మకర్తగా కొనసాగారు. 1982 జూన్ 22న రాజా జగన్నాథ రావు ఆకస్మాత్తుగా కన్నుమూశారు. రాజా జగన్నాథ రావు కుమారుడు వేంకట కుమార బాలాదిత్య లక్ష్మారావు, కుమార్తె ఆది రత్నసుధాబాల. కుమార్తె పెళ్లి చేసుకుని వెళ్లిపోగా, కుమారుడు వేంకట కుమార లక్ష్మారావు మాజీ సంస్థానాధీశులకు వారసుడిగా కొనసాగుతున్నారు. వీరు ప్రస్తుతం సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కొల్లాపూర్‌లోని వివిధ ఆలయాలకు వంశపారంపర్య ధర్మకర్తగా కొనసాగుతున్నారు.

జటప్రోలు సంస్థాన్ని సుమారు పదహారు తరాలుగా కొన్ని శతాబ్దాల పాటు పరిపాలన సాగించిన 'సురభి' రాజులంటే కొల్లాపూర్ ప్రాంతవాసులకు వల్లమాలిన అభిమానం. 191 చదరపు మైళ్ల వైశాల్యం కలిగిన ఈ సంస్థానం కింది 89 గ్రామాల్లో అప్పట్లో సుమారు 30 వేల మంది నివసించేవారు. ఈ సంస్థానం సగటు ఆదాయం ఇంచుమించు రెండు లక్షల రూపాయలుగా ఉండేది. కొల్లాపూర్ ప్రాంతంలో చారిత్రక భవనాలు, దేవాలయాలతో పాటు అనేక ఇతర భవనాలు జటప్రోలు సంస్థానాధీశులైన సురభి వారు నిర్మించినవే. కొల్లాపూర్ పట్టణంలో విశాలమైన రహదారులు, రహదారులకు ఇరువైపులా చెట్లు, డ్రైనేజీ ఆనాడే ఏర్పాటు చేశారు. జనరేటర్‌ను ఉపయోగించి విద్యుత్తును వినియోగించిన ఘనత కూడా వీరికే దక్కుతుంది. 18వ శతాబ్ద కాలంలోనే జటప్రోలు సంస్థానాధీశుల ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో పేదలకు ఉచితంగా వైద్యసేవలను అందించేందుకు ధర్మాసుపత్రిని కూడా ఏర్పాటు చేశారు.



శ్రీకాళహస్తి

# శ్రీకాళహస్తి (పానగల్లు)

**ప్రపంచ ప్రసిద్ధ నగరాల్లో ఒకటైన ఇప్పటి చెన్నయ్ ఒకప్పటి చెన్నపట్టణం. దాన్ని కట్టిందెవరు? పానగల్ సంస్థానాధీశులకు చెన్నపట్టణానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఎవరీ పానగల్ సంస్థానాధీశులు? రాచకొండ పద్మనాయకుల్లో వీరెవరు? ఏ తరం వారు?? నల్లగొండ దగ్గరలోని ఒకప్పటి పానగల్ పాలకులవి.. చెన్నయ్‌లో ఇప్పటికీ కనిపిస్తున్న పానగల్ తాలూకు ఆనవాళ్ల మూలాలు ఒకటేనా?**

**శ్రీకాళహస్తి సంస్థానాధీశులు** దామెరవారు. వీరు సప్తసప్తతి గోత్రజులైన పద్మనాయకుల్లో ఇనగాల గోత్ర ప్రశస్తులు. వీరికి 'చార్ హజారా మున్‌సబ్‌దారు' అనే బిరుదును మొగల్ చక్రవర్తులిచ్చారు. వీరి వంశ గౌరవనామం నాయనంగారు.

కాకతీయ సామ్రాజ్యానికి పూర్వం నుంచే ఈ ఇనగాల వారు ప్రసిద్ధులైనట్లు వీరి బిరుదులు చెబుతున్నాయి. కాకతీయ సామ్రాజ్య అనంతరం వీరు కళింగ సామ్రాజ్యాధినేతలైన గజపతుల సేనానుల్లో ముఖ్యులుగా చలామణి అయ్యారు. వీరి వంశ మూలపురుషుడు మాదానాయుడు. ఇతడు పద్మనాయకుల వంశంలో ఆరో తరానికి చెందినవాడు. అటు తర్వాత ప్రసిద్ధికెక్కిన వాడు వల్లభ రాయుడు. ఇతడు ఎనిమిదో తరానికి చెందిన రెండో అనపోతానాయునికి సమకాలికుడు. వడ్డాది (విశాఖపట్టణంలోనిది)లో గజపతుల సామంతునిగా ప్రసిద్ధికెక్కిన ఈ వల్లభుడు గజపతుల ఆదేశానుసారం ఖాదిరిఖాన్ అనే వజీరును యుద్ధంలో ఓడించినట్లు చరిత్ర చెబుతున్నది.

ఈ పద్మనాయకుల్లో ఏడో తరంలో ధర్మానాయుడు, తొమ్మిదో తరంలోని సర్వజ్ఞ సింగభూపాలుని సమకాలినుడు రావు ధర్మానాయుడు, పన్నెండో తరంలో మరో ధర్మానాయుడు ఉన్నారు. ఎనిమిదో తరానికి చెందిన తిమ్మానాయునికి ఇద్దరు కుమారులు. వారు ధర్మానాయుడు, చిట్టి దాచానాయుడు. 'పద్మనాయకుల ప్రధాన శాఖ (వెంకటగిరి)కు చెందిన చిట్టి దాచానాయునికి అన్న అయిన, పిఠాపురం రాజుల సంతతికి చెందిన ధర్మానాయుడు నల్లకొండ(ప్రస్తుత నల్లగొండ)పై శత్రుదుర్భేద్యమైన కోటను నిర్మించాడని వెంకటగిరి సంస్థానాధీశుల వంశ చరిత్ర చెబుతున్నది.

ధర్మానాయుడు నల్లగొండ కోట నిర్మించాడని చరిత్ర చెబుతున్నది. కానీ ఈ నల్లగొండ నుంచి వెళ్లిన వారే అటు తర్వాత శ్రీకాళహస్తి సంస్థానాధీశులు అయ్యారనడాన్ని కొందరు చరిత్రకారులు తప్పుదోవ పట్టించారు. ఇందుకు పద్మనాయకుల మూడు తరాల్లో కనిపించే ధర్మానాయుడు అనే పేరే కారణం. నల్లగొండ కోట కట్టింది పన్నెండో తరానికి చెందిన ధర్మానాయుడిగా చూపించడం వల్లే ఈ పొరపాటు జరిగింది.

దీని గురించి 'రాచకొండ చరిత్రము' అనే గ్రంథంలో తేరాల సత్యనారాయణ శర్మ వివరంగా రాశారు. – 'రాచకొండలో ఏడో తరానికి చెందిన రెండో సింగభూపాలుడి సోదరుడైన ధర్మానాయుడు అతని సంతతి వారు విజయనగర ప్రాంతానికి తరలిపోయి మిక్కిలి ప్రసిద్ధి చెందారు. వెలుగోడులో కోటనొకటి కట్టి వెలుగోడు వెంకటగిరి రాజ్యాలను స్థాపించారు. ఈ సంతతిలో తొమ్మిదో తరంలో ఒక ధర్మానాయుడు, 12వ తరంలో ఒక ధర్మానాయుడు ఉన్నారు. అచ్యుత దేవరాయల (క్రీ.శ. 1530–72) కాలానికి, ఈ పన్నెండో తరానికి చెందిన ధర్మానాయుడు సమకాలీనుడు. ఇతని కాలంలో నల్లకొండ నిర్మాణం జరిగిందని కొందరు చరిత్రకారులు రాశారు.

'నీలగిరి దుర్గప్రతిష్టాపన నిమిత్తం నారికేళంపల్లి (ప్రస్తుత నార్కెట్‌పల్లి) గట్టుమీదికి ధర్మానాయుడు పోయినట్లు ఒకచోట రాయబడింది. ఇది నల్లగొండ దుర్గ నిర్మాణమని కొందరు తలిచారు. నల్లగొండ దుర్గం ఇంతకంటే ప్రాచీనమైంది. అది అంతకు పూర్వమే నిర్మితమైంది. దీనిని బట్టి అంతకుముందు తరాల్లోని (ఏడో, తొమ్మిదో) ధర్మానాయుడెవరో ఈ కోటను నిర్మించి ఉంటారు. కానీ, పన్నెండో తరానికి చెందిన ధర్మానాయుడు కాద'ని– తేరాల వివరించారు.

పై అంశాలను బట్టి, వెంకటగిరి రాజుల వంశ చరిత్రను అనుసరించి నల్లగొండ దుర్గ నిర్మాణం చేసిన ధర్మానాయుని సంతతి వారే అటు తర్వాత శ్రీకాళహస్తిని ఏలినట్లు తెలుస్తున్నది. ఇప్పటికీ శ్రీకాళహస్తి పక్కనే ఉన్న పానగల్లు అనే పట్టణం ఇందుకు చారిత్రక ఆధారంగా కనిపిస్తున్నది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకునే ముందు.. ధర్మానాయుని తర్వాత ఆ తరంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తుల గురించి కొంత తెలుసుకోవాలి.

వల్లభనాయుని తర్వాత ఎనిమిదో తరానికి చెందిన తిమ్మయ్య శ్రీకాళహస్తి సంస్థానాధీశుల్లో ప్రసిద్ధుడు. ఇతనికే తిమ్మానాయుడు అనే పేరు. ఈయన 15వ శతాబ్దంలో తెలుగు నాట మహా విక్రమునిగా పేరుగాంచాడు. గజరావు తిప్పయ అనే ఆయన ఈ తిమ్మయ్యకు సమకాలీనుడు. వీరిద్దరూ గజపతుల సేనానుల్లో ముఖ్యులు, చరిత్ర ప్రఖ్యాతులు.

రాచకొండ సామ్రాజ్యం పద్మనాయకుల నుంచి, రెడ్డి సామ్రాజ్యం రెడ్డి రాజుల నుంచి చేజారిపోయిన తర్వాత మధ్యాంధ్రదేశంలో గుడిమెట్ట (ప్రస్తుత ప్రకాశం జిల్లా రేచర్ల మండలంలోని ఓ గ్రామం)ను ఏలుతున్న సాగి బైచరాజు మహావిక్రముడుగా పేరు పొందాడు. ఇతడు పద్మనాయకులను జయించి దేవరకొండను ఆక్రమించాడు. ఈ బైచరాజును కళింగ సేనానుల్లో ముఖ్యుడైన దామెర తిమ్మయ జయించాడు. అనంతరం దేవరకొండ రాజ్యాన్ని కళింగాధీశుల సామంతుడిగా ఈ తిమ్మానాయుడు కొంతకాలం పాలించాడు.

దామెర వారి వంశంలో తిమ్మయ పేరు కలవారు ఎందరో కనిపిస్తారు. వీరందరూ విఖ్యాతులేనని కవులు కీర్తించినప్పటికీ వారిలో ప్రధాన పురుషుడిగా, ప్రఖ్యాతుడిగా ఈ దేవరకొండ రాజ్యగ్రహీత, గజపతుల సేనాని అయిన దామెర తిమ్మనను గురించే ఎక్కువగా చెబుతారు. వీరి తరువాత తిమ్మానాయుని కుమారుడు శ్రీపాద నాయనింవారు ప్రసిద్ధికెక్కారు.

బహులాశ్వ విజయం, ఉషాపరిణయం అనే ప్రబంధాల్లో శ్రీపాద నాయనింవారి నుంచే కాళహస్తి వంశక్రమం మనకు తెలుస్తున్నది. విజయనగర పాలకులు ప్రబలులై చక్రవర్తులుగా ప్రకటించుకొన్న తరువాత దామెర ప్రభువులు విజయనగర సామంతులలో చేరి అక్కడ కూడా ముఖ్య భూమికను పోషించారు. వారి సామంతులుగా కాళహస్తితో పాటు వందవాసి (ప్రస్తుత తమిళనాడు తురువణ్ణమలై జిల్లాలోని పట్టణం) పరగణాను పొంది కాళహస్తి సంస్థాన స్థిరపాలకులై విఖ్యాతిగాంచారు.

బహులాశ్వ గ్రంథకర్త దామెర వెంగ భూపాలుడు తమ వంశక్రమాన్ని అప్పటికి పదో తరానికి చెందినవారైన శ్రీపాద నాయనింగారి నుంచే శ్రీకాళహస్తి సంస్థాన శాఖ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. వీరి కుమారులు అప్పానాయనింవారు, వారి కుమారులు ధర్మానాయనింవారు, అటు తరువాత క్రీ.శ. 1570 ప్రాంతంలో వెంకటప్పానాయనింవారు ప్రముఖులుగా వెంగభూపాలుడు చెప్పాడు. దామెర వారి పూర్వీకుల్లో తిమ్మనలు చాలామంది కనిపించినట్లుగానే ఆ తరువాత కాలంలో వెంకటప్పానాయనింవారు, చెన్నప్పనాయనింవారూ కనిపిస్తారు. వీరినుంచే కాళహస్తి సంస్థానాధీశుల గౌరవనామం 'నాయనింవారు'గా చరిత్రకెక్కింది.

వెంకటప్పానాయనింవారి తరంలో ముద్దు వెంకటప్పానాయనింవారు ప్రసిద్ధికెక్కారు. వీరు తమ తండ్రి చెన్నప్పనాయునింవారి పేరు మీద ఈస్టిండియా కంపెనీ వారికి చెన్నపట్టణానికి స్థలం ఇచ్చిన విఖ్యాతుడు. ప్రపంచంలోని మహానగరాల్లో ఒకటి అయిన నేటి చెన్నపట్టణం (చెన్నయ్) ఈ విఖ్యాత చరిత్రుని రూపకల్పనయే.

ఈ ముద్దు వెంకటప్పానాయునింవారి కాలంలో విదేశీయులైన ఇంగ్లిషు వారు, డచ్చివారు భారతభూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తుండేవారు. దేశంలో సుస్థిర ప్రభుత్వం లేని కాలమది. మహమ్మదీయుల దండయాత్రలు తట్టుకోవడం దుర్భరమైన సమయం కూడా. ఇలాంటి వేళ.. వివేకదక్షుడైన ముద్దు వెంకటప్పానాయనింవారు తమ రాజు, కర్ణాటాంధ్ర సామ్రాజ్యాధీశులైన చంద్రగిరి పాలకుడు శ్రీరంగరాయలను సంప్రదించి తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని ఇంగ్లిషు వారికి ఇచ్చారు. అక్కడ బ్రిటిషు వారు నిర్మించిన పట్టణానికి వెంకటప్పానా

యనింగారు తన తండ్రి పేరున 'చెన్నపట్టణం' అని నామకరణం చేశారు. ఈ పట్టణం ఆవిర్భవించిన ఏడాది తర్వాత 1640లో బ్రిటిషు వారు ఇక్కడ సెయింట్ జార్జి కోటను నిర్మించి తమ ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను నిర్వహించుకున్నారు. 18వ శతాబ్దం వచ్చేసరికి ఇప్పటి తమిళనాడులోని చాలా భాగం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని కొంత భాగాలతో బ్రిటిషు వారు మద్రాసు ప్రెసిడెన్సీని ఏర్పాటు చేశారు.

బ్రిటిషు ప్రభుత్వం వారు కాళహస్తి సంస్థానపు జమీందార్లను ప్రత్యేక గౌరవంతో చూసేవారు. తిమ్మానాయనిం వారి కాలంలో ఈ సంస్థానం అప్పుల పాలు కాగా బాకీదార్లు కోర్టులకెక్కి సంస్థానంలోని భాగాలను వేలం వేయించారు. ఈ సందర్భంలోనే పానగల్లు వెంకటరామారాయణిం గారు నెల్లూరు ఉత్తరార్కాడుమండలంలో ఈ విలువైన భూములను సంపాదించారు. వీరి కుమారుడు వేంకటరంగారాయణింగారి కాలంలో పానగల్లు ప్రభువులు కాళహస్తిలో స్థిరపడ్డారు. వెంకటరంగారాయణింగారి సర్వతోముఖ ప్రతిభ వల్ల ఎస్టేటు వర్థిల్ల సాగింది. ఈయన పెద్ద కొడుకు శేషాచలపతిరాయణింగారు కాళహస్తి పట్టణం సమీపంలోని స్వర్ణముఖి నది గట్టున ఒక గ్రామం నిర్మించి దానికి 'పానుగల్లు' అని తమ పూర్వుల రాజధాని పేరు పెట్టారు.

'ఈ పానుగల్లు వారు వెలమలే అని, వీరిది మట్సూర్ళ గోత్రమని, కాలచోదితమున కాకతేశ్వరులను గొలిచినవారని, వీరి పూర్వులు కాకతీయ సామ్రాజ్యమంతరించుదాక తెలంగాణమునందలి నల్లగొండకు 3 మైళ్ల దూరమునగల పానుగల్లు కోటకు అధిపతులుగా నుండినారు. బాలనాగమ్మ, మాయలమరాఠీల జానపదగాథలకీ పానుగల్లు ముఖ్యరంగము. పదునెనిమిదవ శతాబ్దం నాటికి ఈ కుటుంబం అనేక విపత్పరంపరలకు లోనయి తమ పాలనమునందలి పెక్కు ప్రాంతాలను పోగొట్టుకొనిరి, ఆ పిమ్మట నీ వంశీయులు దక్షిణ సీమలకు తరలివచ్చిరి' అని డా. తూమాటి దోణప్ప తన సాహిత్య అకాడమీ బహుమతి పొందిన రచన 'ఆంధ్ర సంస్థానములు : సాహిత్య పోషణము' అనే గ్రంథంలో పానుగల్లు సంస్థానం గురించి రాశారు.

పానుగంటి వెంకటరంగారాయణింగారి పెద్ద కుమారులు రామారాయణింగారు (క్రీ.శ. 1866-1928) ఈ వంశంలో గొప్ప పేరు ప్రతిష్టలు సంపాదించారు. రాజకీయ రంగంలో, సాంఘిక సేవా కార్యక్రమాల్లో, విద్యారంగాల్లో ఎంతో కృషి చేశారు. 1912లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సెల్‌లో మద్రాసు రాష్ట్రం జమీందారుల, భూస్వాముల ప్రతినిధుల్లో సభ్యత్వాన్ని కలిగి ఉన్నారు. 1915లో విశాఖపట్టణంలో జరిగిన మూడో ఆంధ్రమహాసభలకు, అదే సంవత్సరం రాజమండ్రిలో జరిగిన రెండో ఆంధ్రదేశ గ్రంథాలయాల మహాసభకు ఈ పానుగంటి రామారాయణింగారు అధ్యక్షత వహించారు. 1918లో దివాన్ బహద్దూర్ బిరుదును, 1922లో రాజా బిరుదును, 1926లో సర్ బిరుదును పొందారు. జస్టిస్ పార్టీ పక్షాన మద్రాసు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా వ్యవహరించి ఆయన గొప్ప పేరు గడించారు. ఈయననే రాజా ఆఫ్ పానగల్, పానగల్ రాజాగా పిలుస్తారు. చెన్నయ్ టీనగర్‌లో వారు కట్టించిన పానగల్ పార్కులో ఆయన విగ్రహం ఇప్పటికీ ఉంది. 'పానగల్ మాలిగయై' అనే వీరి ఎస్టేటులు ఇప్పటికీ చెన్నయ్‌లో కనిపిస్తాయి.



పిఠాపురం సంస్థానాధీశుల రాజభవనం

# పిఠాపురం

ఆంధ్ర సంస్థానాల్లో సాహిత్య పోషణలోనూ, సంగీత నాట్యాది కళారాధనల్లోనూ పిఠాపురం సంస్థానం పేరెన్నికగన్నది శాసనాల ఆధారంగా ఈ ప్రాంతం క్రీ.శ. 1444 వరకు రెడ్డిరాజుల పాలనలో, అటు తర్వాత గజపతుల ఆధీనంలో ఉన్నది. 16వ శతాబ్దంలో గోల్కొండ నవాబుల కాలంలో కూడా పిఠాపురం ప్రత్యేక సంస్థానంగానే వెలుగొందింది. ఈ సంస్థానాధీశులు నవాబులతో మిత్ర పక్షంగా ఉంటూనే, వారికి లోబడి సంస్థానాలను పరిపాలించారు. పిఠాపురం సంస్థానాధీశులు కూడా రాచకొండను ఏలిన పద్మనాయకుల సంతతికి చెందిన వారే.


**పద్మనాయక సంస్థానాల్లో పేరెన్నికగన్నవారు** పిఠాపురం రావువారు. వీరు ప్రఖ్యాత రేచర్ల గోత్ర పవిత్రులు. రేచర్ల గోత్ర మహావృక్షం నుంచి విడిపోయిన వారే సంస్థానాధీశులుగా వేంకటగిరి, జటప్రోలు, బొబ్బిలి, మైలవరం మొదలైన సంస్థానాలను స్థాపించారు. పిఠాపుర సంస్థానం కూడా ఆ సంస్థానాల సోదరశాఖగానే ఉండేది. కోలంక, లక్ష్మీ నరసాపురం, గొల్లప్రోలు ఈ సంస్థానానికి ఉపశాఖలు.

రేచర్ల గోత్ర ప్రఖ్యాతులైన 36 ఇంటి పేర్లు గల పద్మనాయకుల్లో రావువారు ముఖ్యులు. రేచర్ల పద్మనాయక మూలపురుషుడైన బేతాళనాయుడు, ప్రసాదిత్యుడు, అశీతివరాల సింగమ నాయుడు మొదలైన వారు ఈ వంశ మూలపురుషులు.

పిఠాపురాన్ని పూర్వం 'పీఠకాపురం' అని పిలిచేవారు. ఈ ఊరికి అధిపతి పీఠాంబ. ఒక చేతిలో బంగారు పాత్ర, మరో చేతిలో ఉసిరి కాయ, మూడో చేతిలో త్రిశూలం, నాలుగో చేతిలో లోహ దండం ధరించిన పీఠాంబ విగ్రహం ఒకటి నేటి పుఠాపురాని (ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఒక పట్టణం)కి సమీపంలో, నాలుగు వీధులు కలిసే చోట ఉండేదట. ఈ విషయాన్ని శ్రీనాథ కవి 'భీమేశ్వర పురాణం'లో వివరించారు.

పిఠాపురం ప్రాచీన నగరం. పూర్వకాలం నుంచీ అనేక రాజ్యాలకు ఇది రాజధానిగా ఉండేది. క్రీస్తుపూర్వంలో మగధ రాజ్యాధిపతులైన నందులు, మౌర్యులు, గుప్తులు దీనిని ప్రాంతీయ రాజధానిగా చేసుకుని పాలన సాగించినట్లు శాసనాలు చెబుతున్నాయి. శాతవాహనుల కాలంలో కూడా పిఠాపురం ఒక మండలానికి రాజధానిగానూ ఉన్నది.

పిఠాపురం ప్రసిద్ధి కెక్కిన ప్రాచీన దైవ క్షేత్రం కూడా. ఇందులో పాదగయా క్షేత్రం ప్రధానమైంది. భారతఖండంలోని అష్టాదశ పీఠాల్లో ప్రధానమైన శక్తిపీఠం. 'పురుహూతికాశక్తి' ఇక్కడ ఉందని పురాణాలు చెబుతున్నాయి. మహా భారతాన్ని రాసిన వ్యాసమహర్షి పిఠాపుర ప్రాంతంలో నడయాడినట్లు ఇక్కడి వారు చెబుతుంటారు. పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి దేవాలయం, కుంతీ మాధవ ఆలయం ప్రాచీనమైనవి. ఇవేకాక కుమారస్వామి, సకలేశ్వరుడు, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి, గోపాల స్వామికి కూడా ఇక్కడ ఆలయాలున్నాయి.






కుక్కుటేశ్వరస్వామి, ఆలయం

రెడ్డిరాజుల అనంతరం తూర్పు తీర ప్రాంతమంతా గజపతుల స్వాధీనమై

పుడు పిఠాపురం దుర్గమూ గజపతుల వశమైంది. తరువాత విజయనగర సామ్రాజ్యం విజృంభించింది. తళ్లికోట యుద్ధానంతరం క్రీ.శ. 1571 నాటికి, విజయనగర రాజుల అనంతరం ఈ ప్రాంతమంతా గోల్కొండ నవాబుల పాలనలోకి వచ్చింది. గోల్కొండ నవాబులకు సేనానులుగా, సామంతులుగా ఉన్న వెలమవారికి పిఠాపురం సంస్థానం సంక్రమించింది. మొఘలాయి చక్రవర్తుల ప్రతినిధిగా వ్యవహరించిన అబ్దుల్ హుసేన్ కుతుబ్ ఉల్ ముల్క్ స్వతంత్ర ప్రభువై క్రీ.శ. 1727 నుంచి ఆంధ్ర ప్రాంతాన్ని పాలించాడు. అసఫ్ జాహీ వంశానికి చెందిన ప్రభువులు నైజాం పేరుతో కూడా ఈ ప్రాంతాన్ని పాలించారు.

బేతాళనాయుని నుంచి ఎనిమిదవ తరానికి చెందిన రావు మాధవరావు ఈ శాఖకు చెందిన వారే. ఈయన తర్వాతి వారే పిఠాపుర సంస్థానాధీశులై రావు దొరలుగా విద్వత్ ప్రభువులై వినుతికెక్కారు. రావు వారు పిఠాపురం సంస్థానం నెలకొల్పడానికి ముందు సామర్లకోట దుర్గ పాలకులుగానూ ఉండేవారు.

సామర్లకోట (శ్యామల కోట)ను అంతకు ముందు చిట్నేని(చిట్నివీడి) వారుగా పిలిచే వెలమవారు కాకినాడు, ప్రోలినాడు, శలపాకనాడు అనే మూడు నాడులను పాలించినట్లు సామర్లకోట కైఫియత్ వల్ల తెలుస్తున్నది.

సామర్లకోట సంస్థానానికి చెందిన చిట్నేని రామానాయిణిం గారికి సంతానం లేకపోవడంతో ఆ సంస్థానం రావు మాధవరావు సంతతికి చెందిన గుర్వానాయుడు, తెనుంగు రాయుడు, నరసింహారావు, రంగశాయిరావు గార్లకు సంక్రమించింది.

ఇందులో తెనుంగు రాయుడు (క్రీ.శ. 1612–1672) అత్యంత ప్రతిభాశాలి. ఈయనకే తెలుగు రాయణిం గారు, తెనుగు రాయుడు, తెనుగు రావు అనే ఇతర పేర్లు కూడా ఉన్నాయి. ఈ తెనుగు రాయుడే గోల్కొండ నవాబ్ నుంచి పిఠాపురం సంస్థానాన్ని పొందాడు. ఈయన ప్రతిభా పాటవాలకు నవాబ్ ఆశ్చర్యపోయాడట. ఆయన స్వామి భక్తి, కార్యదక్షత, భుజశక్తికి మెచ్చుకోలుగా పిఠాపురం ప్రాంతాన్ని ఇచ్చాడంటారు. ఇదేకాక నౌబత్, పల్లకి, ఘుడియారం, ద్విశాఖ దివిటీలు, తెల్లజెండా.. వంటి ప్రఖ్యాత రాజలాంఛనాలతో ఏనుగు అంబారీపై సాగనంపాడు. సనద్ ఫర్మానాలతో పిఠాపురం సంస్థానానికి 'చార్ హజారా మున్సబ్‌దారు' (నాలుగు వేల సేనను పోషించే అధికారం) అనే బిరుదు కూడా తెలుగు రాయణిం గారికి ఇచ్చారు. కొంతకాలం తర్వాత తెలుగు రాయణిం గారు పిఠాపురం పాలనను తన పెద్ద కొడుకు మాధవరాయణింకు అప్పగించి ఆయన గోల్కొండకు వెళ్లి నవాబ్ ఆప్తవర్గంలో చేరాడు. ఈ రాయణిం గారితో చదరంగం ఆడేందుకు నవాబు చాలా ఇష్టపడేవాడట.

తెలుగు రాయణిం గారు మరణించిన తర్వాత ఆయన సోదరుల్లో ఒకరైన రంగశాయి రావును నవాబ్ పిలిపించుకుని చదరంగ ఖేలకునిగా నియమించుకున్నాడు. ఒకరోజు చదరంగం ఆటలో సుల్తాన్ అబ్దుల్ హుసేన్ కుతుబ్ ఉల్ ముల్క్ రంగశాయితో పరాష్కం ఆడాడట. దీనికి రంగశాయి మనసు నొచ్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడంటారు. ఈ ఆకస్మిక ఘటన నవాబును ఎంతో బాధ పెట్టింది. దీనికి ప్రతిఫలంగా తన కొలువులో సర్దారుగా ఉన్న రావు కృష్ణారావును

పిలిపించి, అభిమానధనులైన రావు వారి పట్ల గౌరవంతో కాకినాడ, ప్రోలనాడు, శలపాకనాడు మొదలైన సీమలను అనుభవించేట్లు ఫర్మానా(క్రీ.శ. 1647) రాయించి ఇచ్చాడన్నది చరిత్ర.

రంగశాయి ఆత్మహత్య గురించి 'పద్మనాయ కుల చరిత్ర'లో కోటగిరి వెంకట నరసింహ సత్యనారాయణ రావు, 'ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము'లో డా. తూమాటి దొణప్ప ఒకే విధంగా రాసినా, ఆ తర్వాత నవాబు రావు వారిని పిలిపించి ఇచ్చిన ఫర్మానా గురించి వేర్వేరుగా రాశారు. కోటగిరి కృష్ణారావు (తెలుగు రాయణిం గారి కొడుకు)ను పిలిపించి ఇచ్చినట్లు రాస్తే.. దొణప్ప, చంద్రారాయణిం గారి (రంగశాయి అన్న)ని పిలిచి ఇచ్చినట్లు రాశారు. నవాబు ఎవరికి ఫర్మానా ఇచ్చారన్నది పక్కన పెడితే అప్పటి నుంచి మాత్రం రంగ శాయి రావు సంతానం సామర్లకోటలో, తెలుగు రాయణిం గారి సంతానం పిఠాపురంలో ఒకే కుటుంబంలా ఉంటూ పాలన సాగించారు. వీరి తర్వాత పది తరాల వరకూ ఈ పాలన సాగింది. పిఠాపురం రావు వారు మొదటి నుంచీ మొఘులుల పట్ల స్నేహపూర్వకంగానే ఉన్నప్పటికీ క్రీ.శ. 1748లో మాత్రం వారు మొఘులులతో యుద్ధం ఎదుర్కొనాల్సి వచ్చింది. తంగమ్మ పేట వద్ద జరిగిన ఈ యుద్ధానికి కారణాలు తెలియనప్పటికీ అప్పటికే ఇంగ్లీషు, డచ్చి, ఫ్రెంచి వారు ఆంధ్రసాగర తీరంలో పరిశ్రమలు, గిడ్డంగులు నిర్మించుకుని వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. స్థానిక రాజులు, సంస్థానాల మధ్య యుద్ధాలు, కలహాలు జరిగినప్పుడు వీరు ఏదో పక్షం వైపు ఉండి లాభం పొందుతుండేవారు. పిఠాపురం కుమార మహీపతి రాయణింగారి కాలంలో ఆనందగజ



రావు నీలాద్రి రాయణిం గారు

పతి మహారాజు పిఠాపురంపై దండెత్తినప్పుడు ఇలాంటి సంఘటనలే జరిగాయి. అటు తర్వాత వెంకట నీలాద్రి నాయుడు గారు (క్రీ.శ. 1793–1828) మొఘలులతో సంబంధాలు మెరుగు పరుచుకుని పిఠాపురం పాలకునిగా గుర్తింపు పొందారు. ఈయన కాలంలోనే ఇంగ్లీషు వారితో శాశ్వత పరిష్కారం లభించింది. నీలాద్రి నాయుడు గారు మరణించే నాటికి ఆయన కుమారుడు వేంకట సూర్యారావు వయసు నాలుగు సంవత్సరాలు. దీంతో సంస్థానం కోర్ట్ – ఆఫ్ – వార్డ్స్ వారి ఆధీనం లోకి వెళ్లింది.



రావు వేంకట మహీపతి గంగాధర రామారావు గారు

ఈ కాలంలో కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వారు కానీ, రావు వారి బంధువులుగానీ సంస్థానం పట్ల జాగ్రత్త చూపకపోవడంతో ఎస్టేటు అప్పుల పాలైంది. క్రీ.శ. 1844లో సూర్యారావు ముని కొడవల్లి, కొవ్వూరు, భీమనపల్లి, పెనుగొండ, పోడూరు ప్రాంతాలను వదులుకుని (బాకీల తీర్మానం చేసుకుని) సంస్థానాన్ని చేజిక్కించుకు న్నాడు. ఈయన ఆరేండ్ల పాటే పాలన సాగించాడు. క్రీ.శ. 1850లో ఈయన మరణించే నాటికి ఈయన కుమారులు పిన్నవయస్కులు కావడంతో సంస్థానం మళ్లీ కోర్టు – ఆఫ్ – వార్డ్స్ వారి ఆధీనంలోకి వెళ్లింది. సూర్యారావు కుమారుల్లో మూడో వారైన రాజారావు వేంకట మహీపతి గంగాధర రామారావు బహద్దూర్ (క్రీ.శ. 1844–1890) గారు క్రీ.శ. 1861లో సంస్థానం జమీపాలనను పొందారు. వీరు బ్రిటీషు వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఎస్టేటును అత్యున్నత దశకు తీసుకెళ్లారు. క్రీ.శ. 1890లో వీరి మరణానంతరం కుమారుడు సూర్యారావు బహద్దూర్ గారు కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వారి నుంచి క్రీ.శ. 1906లో జమీపాలన పొందారు. 1924లో వీరికి 'మహారాజా' అనే

బిరుదు వచ్చింది. 'మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ గారు' అని గొప్పగా పేరొందిన ఈయన కొడుకు యువరాజు వేంకట మహీపతి గంగాధర రామా రావు గారు జమీపాలన కొనసాగించారు. క్రీ.శ. 1948లో జమీందారి రద్దు చట్టం మేరకు పిఠా పురం సంస్థానం ఆంధ్రరాష్ట్రంలో కలిసి పోయింది.

ఈ చివరి రాజా వారికి నలుగురు పుత్రి కలు. ఇద్దరు పుత్రులు. వీరిద్దరికి సంస్థానాన్ని సమంగా పంచి రాజా వారు పాలన సాగిం చారు. కుమార్తెల్లో పెద్ద కుమార్తె మంగయ్యా మ్మను అస్సాంలోని క్షత్రియ జీందారులకి చ్చారు. రెండో కుమార్తె భావయ్యమ్మను, మూడో కుమార్తె సీతాదేవిని నూజివీడు జమీం దారులు వివాహం చేసుకున్నారు. నాలుగో కుమార్తె కమలాదేవి గురించిన వివరాలు తెలి యలేదు. వుయ్యూరు (నూజివీడు) జమీందా రును వివాహం చేసుకున్న రాజా వారి మూడో కుమార్తె సీతాదేవి తర్వాత బరోడా మహారా జును వివాహం చేసుకున్నారు. అటుతర్వాత ఆమె బరోడా రాణి సీతాదేవిగా ఘనచరితకె క్కారు. సర్వజ్ఞ రావు సింగభూపాలుని వారసు లుగా, సాగరాంధ్ర సంస్థానాధీశుల్లో సాహితీ పోషకులుగా రావు వారు చరిత్రలో ఎంతో కీర్తి గాంచారు. ఎందరో కవుల్ని, పండితుల్ని వీరు ఆదరించారు, ఆరాధించారు కూడా. 'రాఘవ పాండవీయం' రాసిన పింజమూరి సోమేశ, 'వా సవదత్త పరిణయం' రాసిన వక్కలంక వీరభద్ర కవి, కూచిమంచి జగ్గ కవి, కూచిమంచి గంగన్న, దేవులపల్లి బాపన్న, పిండిప్రోలు లక్ష్మన్న, అల్లంరాజు సుబ్రహ్మణ్య కవి, దేవుల పల్లి సుబ్బరాయ శాస్త్రి, దేవులపల్లి వెంకట కృష్ణ శాస్త్రి.. వీరంతా పిఠాపురం సంస్థానానికి చెందినవారే.





మహమ్మద్ ఆలీ జిన్నా, చార్లీ చాప్లిన్‌తో మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ గారు

పిఠాపురం అరుదైన చిత్రాలు అందించినవారు
పంపినవారు : అశోక్‌రెడ్డి, న్యాయవాది



## మనకు తెలియని మహారాజకుమారి

# బరోడా మహారాణి సీతాదేవి

**ఈమె పిఠాపురం మహారాజకుమారి సీతాదేవి. మన తెలుగింటి ఆడబిడ్డ. ముగ్ధమనోహర రూపం.. సుందరమైన, సుసంపన్నమైన జీవితం.. విలాసవంతమైన జీవన విధానం ఈమె సొంతం. పూర్వాచార సంరక్షణలో భాగంగా సాంప్రదాయాలకు కట్టుబడి కట్టూ బొట్టులో నిండుగా, హుందాగా కనిపించే మహారాణులతో పోల్చితే ఈమెది ఎంతో భిన్నమైన జీవితం. ఆధునిక మహిళ గా, ఆ కాలపు మహారాణిగా ఈమె జీవన శైలి అనన్య సామాన్యం. విధి ఆడే నాటకం ఎంత వింతగా ఉంటుందో! మహారాజకుమారి సీతాదేవి అందుకు అతీతం ఏమీ కాలేదు.**

**పిఠాపురం చివరి సంస్థానాధీశుడు** మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్, రాణి చిన్నమాంబాదేవి (మీర్జాపురం వారసురాలు)ల మూడో కూతురు సీతాదేవి. ఈమె 1917 మే 12న మద్రాసు అళ్వార్ పేటలోని మహారాజా సూర్యా రావు రోడ్డు ముర్రేస్ గేట్ దగ్గరున్న డన్మోర్ హౌజ్‌లో జన్మించారు.

1935 వరకూ సీతాదేవి మహారాజకుమారి హోదాలో కొనసాగారు. ఆ తర్వాత సీతాదేవి తన పద్దెనిమిదవ ఏట ఉయ్యూరు జమీందారు ఎం.ఆర్. అప్పారావును వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఎం. విదుత్ కుమార్ అప్పారావు అనే కుమారుడు జన్మించాడు. మీర్జాపురవా సుల మనవరాలిగా, ఉయ్యూరు మహారాణిగా, జమీందారు పట్టపు మనిషిగా సీతాదేవి విలాస వంతమైన జీవితం గడుపుతూ ఉండేవారు. అందులో భాగంగా ఆమె తరుచూ గుర్రపు పందేలకు హాజరయ్యేవారు.

1943లో సీతాదేవి జీవితంలో ఒక ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఏ పరిచయం ఏ మలుపునకు దారితీస్తుందో ఎవరికీ తెలియదు. సీతాదేవి జీవితంలో కూడా అలాంటి ఓ సంఘ టనే అప్పుడు జరిగింది. సీతాదేవి ఎప్పటిలాగే చెన్నయ్‌లోని గిండీ రేస్ కోర్సుకు గుర్రాపు పందే లను వీక్షించడానికి వెళ్లారు. అక్కడ ఆమెను ప్రతాప్‌సింగ్ రావ్ గైక్వాడ్ చూశారు. ఆయన బరో డా(ప్రస్తుత గుజరాత్‌లోని వడోదరా) మహారాజు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నులైన ఎని మిది మంది మహారాజుల్లో గైక్వాడ్ ఒకరుగా అప్పట్లో ప్రసిద్ధి కెక్కారు. ఆయన దగ్గర ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వజ్రవైఢూర్యాలు, విలువైన ముత్యాలు, కెంపులు, రత్నాలు, హారాలు ఎన్నో ఉండేవి. అవి కలిగించిన ఆనందం కంటే ఎక్కువ ఇప్పుడు గైక్వాడ్ పొందారు. ఎందుకంటే ఓ ముగ్ధ మనోహర రూపం ఆయన మనసు దోచుకుంది. హృదయాన్ని కకావికలం చేసింది. ఆ సుందరమైన రూపం ఎవరిదో కాదు.. సీతాదేవిది. ఆమె అందం, ఆహార్యం ఆయన్ని మంత్ర ముగ్ధుణ్ని చేసింది. ఆమె సౌందర్యం ఆయనకు అమితానందాన్ని కలిగించింది. ఆమెతో ప్రేమలో పడ్డాడు. సీతాదేవి కూడా ఆయన ప్రేమను అంగీకరించింది. ఇద్దరూ వివాహం చేసుకోవాలను కున్నారు. కానీ అది అంత సులభమైన విషయం కాదు. ఎందుకంటే గైక్వాడ్‌కు అప్పటికే వివాహం అయింది. ఆయనకు కుమారులు కూడా కలిగారు. అయినా ఆయనకు అది పెద్ద సమస్య కాదు. ఇంకో విషయం ఏమిటంటే.. సీతాదేవికీ పెండ్లయింది. కుమారుడూ ఉన్నాడు. బరోడా రాజును చేసుకోవాలంటే హిందూ వివాహ చట్టం ఒప్పుకోదు. కానీ గైక్వాడ్ ఇవేవీ పట్టిం చుకునేలా లేడు. ఆయన మనసు మనసులో లేదు. ఎలాగైనా ఆ అపురూప సౌందర్యవతిని సొంతం చేసుకోవాలని ఆయన మనసు తహతహలాడసాగింది. మనసుంటే మార్గం ఉంటుంది. ఆ మనసు ఇప్పుడు మహారాజా వారు సీతాదేవికిచ్చారు. ఆ మనసు కోసం, ఆ మనిషి కోసం ఆయన ఏదైనా చేయాలనుకున్నారు. ఎంతవరకైనా వెళ్లాలనుకున్నారు. ఆ తపన, తాపత్రయమే మనసున మనసై దారి చూపించింది.

ప్రేమికులిద్దరూ వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. వారు సీతాదేవిని ఇస్లాం మతంలోకి మారాలని సూచించారు. అలాచేస్తే జమీందారుతో ఆమె వివాహ బంధాన్ని భార

తీయ వైవాహిక చట్టం ప్రకారం రద్దు చేసుకోవచ్చు. విడాకులూ తీసుకో వచ్చు. సీతాదేవి అలాగే చేసింది. ఆమె ఇస్లాం మతాన్ని స్వీకరించి తిరిగి ఆర్య సమాజ హక్కుల ప్రకారం హిందూమ తానికి మారారు. 1943లో గైక్వాడ్ సీతాదేవిని 'హర్ హైనెస్ శ్రీమంత్ అఖండ్ సౌభాగ్యవతి సీతాదేవి సాహిబ్ గైక్వాడ్'గా తన ద్వితీయ సతీమణిగా స్వీకరించారు.



సీతాదేవి

ఈ వివాహం బ్రిటీష్ ఆధిపత్యానికి ఆగ్రహం కలిగించింది. ఇది బరోడా గైక్వాడ్‌ల వివాహ చట్టానికి విరుద్ధమని బ్రిటీష్ ప్రభుత్వం వాదించింది. బ్రిటీష్ వైస్రాయి (న్యూ ఢిల్లీ) ఈ వివాహం విషయంలో గైక్వాడ్‌కు సమన్లు జారీ చేశారు. 'ఆ చట్టాలు తాము పాలించే ప్రజల కోసం, కానీ పాలకులమైన మా కోసం కాదు' అని గైక్వాడ్ వాదించారు. వాదోపవాదాల అనంతరం గైక్వాడ్, సీతాదేవిల వివాహం బ్రిటీష్ ప్రభుత్వ అంగీకారం పొందింది. అయిప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వం సీతాదేవి మహారాణిని హర్ హైనెస్‌గా వ్యవహరించడానికి అంగీకరించలేదు.

1945లో సీతాదేవి, గైక్వాడ్‌లకు ఒక కుమారుడు (మార్చి 8న) కలిగాడు. కుమారుని పేరు సాయాజీ రావ్ గైక్వాడ్. సీతాదేవికి కొడుకంటే అత్యంత ప్రీతి. ముద్దుగా అతన్ని ప్రిన్సీ అని పిలుచుకునేవారు.

బరోడా రాజ్య కట్టుబాట్లు, బ్రిటీష్ ఆధిపత్యపు ఆంక్షల వల్ల రాణీ సీతాదేవి హద్దులు లేని స్వేచ్ఛా జీవితాన్ని కాంక్షించారు. గైక్వాడ్‌తో తనదైన ప్రేమైక జీవనంలో, అనంతమైన ఆనంద సామ్రాజ్యంలో విహరించాలనుకున్నారు. అందుకోసం గైక్వాడ్ దంపతులు తరచూ విదేశీ యానం చేస్తుండేవారు. అలా 1946లో గైక్వాడ్ సీతాదేవిని యూరప్ యాత్రకు తీసుకుని వెళ్లారు. వారి ఆ విదేశీ యాత్ర లక్ష్యం భారతదేశానికి బయట నివసించడానికి అనువైన ప్రదేశాన్ని అన్వేషించడమే. వారికి ఆ ప్రదేశం దొరికింది. రెండో ప్రపంచ యుద్ధ ఛాయలు లేని ప్రశాంత స్వతంత్ర రాజ్యం 'మొనాకో' అందుకు అనువైన ప్రాంతంగా ఎంచుకున్నారు. అక్కడి మాంటే కార్లోలో తమ రెండో నివాసం కోసం భవంతి(Mansion)ని తీసుకుని, పరివారాన్నీ



గైక్వాడ్‌కు బరోడా ముత్యాల హారాన్ని అలంకరిస్తున్న సీతాదేవి

రప్పించి మహారాణి శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. సీతాదేవి, ఆమె కుమారునికి మొనాకో రాకుమారుడు 'ప్రిన్స్ రైనర్' పౌరసత్వం కూడా ఇచ్చాడు. ప్రపంచంలోనే సంపన్నులైన వారిలో ఒక రైన గైక్వాడ్ భార్యగా మహారాణీ తమ దేశంలో ఉండడం తమకెంతో గర్వకారణం అని రైనర్ పొగిడాడట.

బరోడా నుంచి గైక్వాడ్, మహారాణి నివాసానికి తరచుగా వెళ్లి బస చేసేవారు. ఆయన తన పర్యటన సమయంలో బరోడా నుండి విలువైన సంపదను మహా రాణి కోసం మొనాకో తీసుకువెళ్లేవారు. ఆ సంపద అంతటికీ మహారాణే సంరక్షకు రాలు. రెండో ప్రపంచ యుద్ధానంతరం గైక్వాడ్ దంపతులు తరచూ విదేశీ యాత్ర లకు వెళ్తుండేవారు. అలా వారు రెండు సార్లు అమెరికాను సందర్శించారు. ఈ యాత్రల సమయంలో అనేక రకాల విలువైన, విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేసేవారు. ఇందుకోసం 10 మిలియన్ల అమెరికన్ డాలర్లు వెచ్చించారట. భారతీయ అడిటర్లు ఈ గణాంకాలను పరిశీలించి గైక్వాడ్ బరోడా ఖజానా నుండి వడ్డీ రహిత రుణాలు పెద్ద మొత్తంలో తీసుకున్నట్లు తేల్చారు. ఆ సొమ్మును తిరిగి ఇవ్వాలని భారత ఉన్నతాధికారులు కోరారు. ఇందుకు గైక్వాడ్ రాకుమారుడు తన రాజభరణం నుంచి 8 మిలియన్ల అమెరికన్ డాలర్లు పలు వాయిదాలలో చెల్లించడానికి అంగీకరించారు.

సీతాదేవి కోసం గైక్వాడ్ బరోడా ఖజానా నుండి నిధులు పెద్ద మొత్తంలో మొరాకో తరలించింది వాస్తవమే అని అటు తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల తెలుస్తున్నది. అత్యంత విలువైన ఆభరణాలు, నాలుగు ముత్యాల తివాచీలు ఇందులో భాగంగా ఉన్నాయి. అమూల్యమైన బరోడా ముత్యాలతో చేసిన ఏడు వరుసల హారం, బ్రెజిలియన్ వజ్రాలతో చేసిన మూడు వరుసల హారం(25.760 గ్రాములు, 128.80 క్యారెట్ల దీనినే 'స్టార్ ఆఫ్ ది సౌత్' అంటారు), ఇంగ్లిష్ డ్రెస్డెన్ వజ్రం (15.706 గ్రాములు, 78.53 క్యారెట్స్) అందులో చాలా విలువైనవి. ఈ రాజకుటుంబ జంట విలువైన ఎంప్రెస్ యూగెనీ వజ్రాన్ని కూడా తమ సొంతం చేసుకుని ఉన్నారు.

వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చివరకు భారత ప్రభుత్వం గైక్వాడ్.. మన దేశానికి ద్రోహం చేశాడని, బరోడాను వంచించాడనే కారణంతో అతడిని రాజరిక పదవి నుంచి




బ్రెజిలియన్ వజ్రాల హారం, నీలమణి ధరించిన సీతాదేవి

తొలగించింది. ఆ తర్వాత 1951లో గైక్వాడ్ మొదటి భార్య శాంతాదేవి కుమారునికి ఆ రాజరిక పదవీ బాధ్యతలు అప్పగించింది. అధికారికంగా సీతాదేవి, గైక్వాడ్ దంపతులు రాజరిక అధికారం కోల్పోయినప్పటికీ వారి బిరుదనామాలతో కొనసాగారు. ఆ హోదాతో సీతాదేవి అనేక అంతర్జాతీయ ఉత్సవాలకు హాజరవుతూ ఉండేవారు. అంతర్జాతీయ అతిథులకు ఆమె ఘనంగా అతిథి సత్కారాలు చేస్తుండేవారు.

అటు తర్వాతే మహారాణికి ఆర్థికంగా కొంత కష్టకాలం మొదలైంది. దీంతో 1953లో మహారాణి తన విలువైన కంకణా(కాళ్ల పట్టీ)న్ని హ్యారీ విన్‌స్టన్ అనే ఆభరణాల కంపెనీకి విక్రయించింది. ఆ కంపెనీ విలువైన మరకతమణులు, వజ్రాల వ్యాపారంలో పేరెన్నికగలది. మహారాణి విక్రయించిన కంకణంలోని విలువైన స్టోన్స్‌తో హ్యారీ విన్‌స్టన్ ఒక అందమైన కంఠాహారాన్ని తయారుచేసింది. దాన్ని బ్రిటీష్ రాణి వాలిస్ సింప్సన్ (డచెస్ ఆఫ్ విండ్సర్) కొనుక్కున్నారు.

1957లో న్యూయార్క్‌లోని హోటల్ (Waldorf Astoria luxury hotel)లో జరిగిన ఒక అత్యున్నత ఉత్సవానికి వాలిస్ ఆ ఆభరణాన్ని ధరించి వెళ్లారు. ఆ ఉత్సవానికి మహారాణి



సీతాదేవి కుటుంబం

సీతాదేవి కూడా హాజరయ్యారు. బాల్ నృత్యంలో వాలిస్ ధరించిన ఆ ఆభరణాన్ని చూసి వేడుకకు హాజరైన వారందరూ అద్భుతంగా ఉందని తెగ పొగిడారు. అది విన్న సీతాదేవి 'ఆ ఆభరణంలోని విలువైన రాళ్లు ఒకప్పుడు నా పాదాలపై మరింత అందంగా ఉండేవి' అని అవహేళనగా మాట్లాడారట. సీతాదేవి మాటలకు కలత చెందిన వాలిస్ వెంటనే ఆ ఆభరణాన్ని తిరిగి హ్యారీ విన్‌స్టన్‌కు ఇచ్చేసింది. అప్పటి నుంచే సీతాదేవిని 'ఇండియన్ వాలిస్ సింప్సన్' అని పిలుస్తుండేవారు.

కారణాలు తెలియదు కానీ.. 1956లో సీతాదేవి తన రెండో భర్త, బరోడా మహారాజు గైక్వాడ్‌కు కూడా విడాకులు ఇచ్చింది. ఆయన ఆ తర్వాత లండన్‌కు మకాం మార్చాడు. వివాహ రద్దు తరువాత కూడా సీతాదేవి తన బిరుదును కొనసాగించింది.

మహారాణికి కార్లు అంటే అమితమైన ఆసక్తి. మెర్సిడెస్ కంపెనీ డబ్ల్యూ 126 మోడల్ కార్‌ను ఆమె ఇష్టం మేరకు కస్టమైజ్ చేసి ఇచ్చిందట. ఆమె కోసం వాన్ క్లెఫ్ అండ్ అర్పెల్స్ అనే అంతర్జాతీయ సంస్థ బంగారంతో టంగ్ క్లీనర్ తయారు చేసి ఇచ్చిందట. సీతాదేవికి పారిస్‌లో కూడా ఒక విలువైన అపార్ట్‌మెంట్ ఉండేది. ప్రపంచంలోనే అత్యున్నత, విలువైన ఫర్నీచర్ (Louis xvi furniture) తో ఆమె ఆ అపార్ట్‌మెంట్‌ను అందంగా, అమితంగా తీర్చిదిద్దుకుంది. అక్కడ కూడా అత్యున్నత స్థాయి జీవితాన్ని కొనసాగిస్తూ విలాసవంతమైన విందులు, వినోదాలను ఏర్పాటు చేస్తూ ఉండేది. ఆ పార్టీల్లో విలువైన మద్యం (Baron de Rothschild Bordeaux) కూడా ఉండేది. నమ్ముతారో లేదో.. మహారాణి సిగరెట్ పెట్టెపై కూడా అందమైన ముత్యాలు, కెంపులు పొదిగి ఉండేవట.

మహారాణి వేలికి ఎప్పుడూ ఒక అద్భుతమైన నీలమణి (30-carat,6.0 g - sapphire - కుడిచేతి ఉంగరం) ఉండేది. ఆమె అదృష్టానికి అదే కారణం అని చాలామంది భావించేవారు.



ప్రిన్సీ

1969లో అస్కాట్ గోల్డ్ కప్ (గుర్రెపు పందేలు) పోటీల సమయంలో మహారాణి తన నీలమణిని తాకి మీ అదృష్టాన్ని పరీక్షించుకోండని పందెం రాయుళ్లను ఆహ్వానించిందట. అందుకే 1969లో సీతాదేవి, రాకుమారుడు ప్రిన్సీని 'ఫన్ కపుల్' అని ఎస్క్వైర్ మ్యాగజైన్ పేర్కొంది.

సీతాదేవి మొనాకో నుంచి పారిస్‌కు, పారిస్ నుంచి మొనాకోకు ప్రయాణించే సమయంలో ఆమెతో పాటు పే..ద్ద వార్డ్‌రోబ్, వందలాది విలువైన చీరెలు, వందల జతల పారిస్ షూస్, ఆభరణాలు వెంట తీసుకుని వెళ్లేది. పారిస్‌లోని ఆమె డ్రెస్సింగ్ రూమ్ వేలాది చీరలు, మ్యాచింగ్ షూస్, పర్సులతో అందంగా అమర్చి ఉండేది. మొన్సియర్ ఎరిగ్వా అనే సంస్థ మహారాణి కోసం శారీస్ అండ్ కో అనే ఫ్యాక్టరీని నెలకొల్పి ఆమె కోసం ఫ్రెంచ్ షిఫాన్ చీరలు తయారు చేస్తుండేది. అంత వైభవంగా జీవనం సాగిస్తున్న మహారాణి సంపద క్రమంగా క్షీణించసాగింది. దీంతో ఆమె తన విలువైన సంపదలో కొంత భాగాన్ని మెల్లమెల్లగా అమ్ముతూ వస్తుండేది. 1974లో ఆమె తనకు ఎంతో ఇష్టమైన ఆభరణాలను కూడా రహస్యంగా వేలం వేసింది.

అప్పట్లో గన్ సెల్యూట్ ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న వారికే మాత్రమే దక్కే గౌరవం. అలాంటిది మహారాణి సీతాదేవి ఏకంగా 101 సార్లు గన్ సెల్యూట్‌లను స్వీకరించింది. అంత వైభవంగా, ఘనంగా బతికిన సీతాదేవిని ఆమె ఎంతో అమితంగా ప్రేమించే కొడుకు ప్రిన్సీ ఆత్మహత్య తీవ్రంగా కృంగదీసింది. 1985 మే 8న మహారాణి సీతాదేవి కుమారుడు (40వ పుట్టిన రోజు తరువాత) ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రిన్సీ మద్యపానానికి, డ్రగ్స్‌కు బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతారు. మహారాణి సీతాదేవి తన కొడుకు మరణించిన నాలుగు సంవత్సరాల పాటు తీవ్ర మనోవేదన అనుభవించింది. చివరకు ఒంటరిగా కృంగి కృశించి 1989లో ఫిబ్రవరి 15న పారిస్‌లో మరణించారు.

72 ఏండ్ల వయసులో మరణించిన సీతాదేవి సుమారు 40 సంవత్సరాలకు పైగా అనన్య సామాన్యమైన జీవితాన్ని అనుభవించి.. చివరకు అంతులేని హృదయ వేదనతో ఈ లోకాన్ని విడిచారు. అంతర్జాతీయ జెట్ సెట్ సభ్యురాలిగా, ఇండియన్ వాలిస్ సింప్సన్‌గా ఘనకీర్తిని సంపాదించిన ఆధునిక మహారాణి సీతాదేవి మరణానంతరం వారసత్వ ఆస్తులను ఆమె అక్క కూతురు రాణి అనంగరేఖాదేవి (రాణి మంజులాదేవి కూతురు) పొందారు. రాణి మంజులాదేవి ఎవరో కాదు.. సీతాదేవికి స్వయానా అక్క. పిఠాపురం రాజా వారి పెద్ద కూతురు మంజులాదేవి

సిద్ధి కుటుంబానికి చెందిన రాజా అజిత్ నారాయన్ దేవ్‌ను వివాహమాడారు. వీరి కూతురు అనంగరేఖాదేవి ప్రస్తుతం తన కుటుంబంతో అస్సాం గౌహతిలో నివసిస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు విక్రంజిత్ బార్వా బాలీవుడ్‌కు చెందిన సుభాష్ ఘాయ్ మీడియా స్కూల్‌లో సినిమాటోగ్రఫీలో కోర్సు చేస్తున్నాడు. విక్రమ్‌జిత్ సినిమాటోగ్రఫీ చేసిన పానీ అనే హిందీ లఘు చిత్రం ఇటీవలే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రదర్శితమైంది.

1947 బరోడా స్వతంత్ర భారతదేశంలో విలీనం అయిన తరువాత భారతదేశ అధికారులు సీతాదేవి విలువైన సంపదలో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమె పేరున ఉన్న కొన్ని ఆభరణాలు, విలువైన వస్తువులు మహారాణి ఆధీనంలోనే ఉన్నాయి. ఆమె మరణించిన తరువాత అందులోని కొన్ని ఆభరణాలను, వస్తువులను అక్కడక్కడా కనుగొన్నారు. అత్యంత విలువైన ముత్యాల తివాచీని 1994లో జెనీవా వాల్ట్ బ్యాంక్‌లో కనుగొన్నారు. దీన్ని అటు తర్వాత అరబ్ రాజకుమారుడు 31 మిలియన్ల అమెరికన్ డాలర్లకు కొనుక్కున్నాడు. ప్రస్తుతం ఆ ముత్యాల తివాచీ దోహా (ఖతర్)లోని మ్యూజియం ఆఫ్ ఇస్లామిక్ ఆర్ట్‌లో ప్రదర్శనకు ఉంది. 'స్టార్ ఆఫ్ ది సౌత్'తో పాటు ఇంకొన్ని ఆభరణాలు అమ్‌స్టర్‌డామ్‌లో ఉన్నాయి. మహారాణి వాడిన రోల్స్ రాయిస్ కారు ఇప్పటికీ బరోడా ఆయుధాగారంలో ఉంది. సీతాదేవి మరణించడానికి కొద్ది కాలం ముందు శారీస్ అండ్ కో కంపెనీకి ఆమె 260 చీరలు ఆర్డర్ ఇచ్చింది. అదే ఆ కంపెనీకి, ఆమెకిచ్చిన చివరి ఆర్డర్. ఆమె మరణానంతరం శారీస్ అండ్ కో మూతబడిందట.



బొబ్బిలి కోట (ప్రస్తుతం బొబ్బిలి మ్యూజియం)

# బొబ్బిలి సంస్థానం

బొబ్బిలి ఒకప్పటి చారిత్మ్రాతక సంస్థానం. ఫ్రెంచి పాలనలో ఒక సంస్థానంగా వెలుగొం దిన బొబ్బిలికి పొరుగు రాజ్యం విజయనగ రంతో నిత్య శత్రుత్వం ఉండేది. ఈ శత్రుత్వం ముదిరి బొబ్బిలికీ, ఫ్రెంచి, విజయనగర సంయుక్త సైన్యానికీ మధ్య మహా యుద్ధానికి దారితీసింది. ఆ యుద్ధంలో జరిగిన మారణకాండ, బొబ్బిలి వీరుల వీరమరణాలు, బొబ్బిలి స్త్రీల ఆత్మాహుతి.. చరిత్రలో ఆ సంస్థా నానికి గొప్ప వీరోచిత స్థానాన్నీ కల్పించాయి.

**ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి** ఈశాన్యంగా 120 కిలోమీటర్ల దూరంలో విజయనగరం జిల్లాలోని ఒక పట్టణమే బొబ్బిలి. ఒకప్పటి ఈ సంస్థానాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం అప్పట్లో కవిటి, బొబ్బిలి, రాజాం, సీతానగరం అనే నాలుగు తాణాలుగా విభజించారు. ఒక్కొక్క తాణా ఒక్కొక్క అమీను అధికారం కింద పర్యవేక్షణలో ఉండేది. 2002 గ్రామాలు (జిరాయితీ), 70 అగ్రహారాలు, 6 మొఖాసా గ్రామాలు ఈ సంస్థానంలో భాగంగా ఉండేవి.

బొబ్బిలి సంస్థానాధీశులైన రావు వారు రాచకొండ పాలకులు. వీరిది రేచర్ల గోత్రం. ఇనుగంటి, చింతపట్ల, చెలికాని, తాండ్ర, దామెర ఇంటిపేర్లుగా కలిగిన వెలమ దొరలు ఈ బొబ్బిలి పాలక కుటుంబంతో నెయ్యం, వియ్యం కలిగి ఉన్నారు. వేంకటగిరి వారికి, బొబ్బిలి వారికి మూలపురుషులు ఒక్కరే.

పద్మానాయకులలో పదిహేనో తరానికి చెందిన నిర్వాణ రాయప్పనాయుడు (నిర్వాణప్ప నాయుడు) నేటి కర్నూలులోని వెలుగోడు రాజ్యాన్ని స్థాపించాడు. ఈయనకే పెద్దరాయుడు అనే పేరు కూడా ఉంది.

'కొందరు బొబ్బిలికి మూలపురుషుడు రాజాధర్మారావు అని రాశారు. పెద్దరాయుడు మూల పురుషుడని కార్మికేలు, హంటరు మొదలైన వారు అంగీకరించినట్లు.. ఈ విషయం 'బొబ్బిలి వారి వంశావళి'లోనూ ఉన్న'ట్లు 'ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము' అనే గ్రంథంలో డా. తూమాటి దొణప్ప రాశారు. దీనిని బట్టి, పెద్దరాయుడు అనే నామాంతరం గల నిర్వాణప్ప నాయుడే బొబ్బిలి వంశానికి మూలపురుషుడు అని తెలుస్తున్నది. ఇతడు వేంకటగిరి సంస్థానంలో విఖ్యాతుడైన యాచశూరు (యాచమనాయుడు)ని ఎనిమిది మంది కొడుకుల్లో పెద్దవాడు.

క్రీ.శ. 1652లో మొఘల్ బాద్‌షా సేనానిగా కళింగ దేశాన్ని స్వాధీనం చేసుకునేందుకు షేర్ మహమ్మద్ ఖాన్ వచ్చాడు. ఇతడు ఆనాటి చికాకోలు నవాబు. ఈ షేర్‌ఖాన్ కళింగ సీమపై దాడి చేసినప్పుడు ఇతనికి పెదరాయుడప్ప సహాయం చేశాడు. ఇందుకు సంతోషించిన మొఘల్ బాద్‌షా షేర్‌ఖాన్ ద్వారా రాయుడప్పకు రాజాం ఎస్టేటును ప్రసాదించాడు. రాయుడప్ప ఈ ఎస్టేటులో కోట కట్టి దానికి తన ప్రభువు షేర్ ఖాన్ పేరు పెట్టుకున్నాడు. షేర్ అంటే బెబ్బులి.. అదే రానురాను బొబ్బిలి అయింది.

రాయుడప్పనాయని కుమారుడు లింగప్పనాయుడు. బొబ్బిలి కోట నిర్మాత ఇతడేనని కొందరు చరిత్రకారులు చెబుతారు. తన తండ్రి కాలంలోనే లింగప్పకు ఢంకా నగారా, నౌబత్ శ్వేతచ్ఛత్రం, రాజా బిరుదం.. వంటి రాజలాంఛనాలు ఉన్నాయి.

లింగప్పనాయుడు మహా విక్రముడు. ఇతడు మొఘల్ బాద్‌షాకు, చికాకోలు నవాబుకు తలలో నాలుకలా మెలిగేవాడట. షేర్‌ఖాన్ కుమారుడు వేటకు వెళ్లిన సందర్భంలో తిరుగుబాటుదారులు ఎవరో అతణ్ని ఎత్తుకుని పోయి బంధించారు. నవాబు ఆదేశానుసారం లింగప్పనాయుడు పలాసా నుంచి శ్రీకాకుళం వరకు గల మన్యం ప్రాంతాన్నంతటినీ గాలించి

'రంగవాక' వద్ద నవాబు కొడుకు ఆచూకీ కనిపెట్టాడు. ఇక్కడ లింగప్పనాయుడు తిరుగుబాటు దారులతో యుద్ధం చేసి వారిని చెరబట్టాడు. ఈ యుద్ధాన్నే 'రంగవాక యుద్ధం' అంటారు. కొడుకును బంధీ నుంచి విడిపించినందుకు ప్రతిఫలంగా నవాబు షేర్‌ఖాన్ లింగప్పనాయునికి పన్నెండు గ్రామాలను బహుమతిగా ఇచ్చాడట. ఈ రంగవాక యుద్ధ విజయం గురించి, అందులో లింగప్పనాయుడు చూపిన పరాక్రమం గురించీ నవాబు బాద్‌షాకు లేఖ రాశాడు. ఇందుకు బాద్‌షా మెచ్చి నౌబత్, పల్లకీ, దివిటీలతోపాటు 'రంగరావు' అనే బిరుదు, 'రాజా బహదూర్' అనే లాంఛనాలతో ఫర్మానా జారీ చేశాడట. ఇక అప్పటి నుంచే బొబ్బిలి రావు వారు.. రంగరావులై చిరకీర్తి పొందారు. లింగప్ప.. లింగప్ప రంగరాయలయ్యారు.

లింగప్ప రంగరావుకు సంతానం లేకపోవడం వల్ల వేంకటగిరి సంస్థానం వారైన మాధవరాయుని మూడో కుమారుడైన వెంగళరావుని దత్తత తీసుకున్నారు. బొబ్బిలి పాలకులలో ఈ వెంగళరావు మూడోతరం వారు. వెంగళరావు చిన్న వయసులో ఉన్నప్పుడే తనను దత్తత తీసుకున్న తండ్రి మరణించారు. దీంతో కొంతకాలం తన కన్నతండ్రి మాధవరావు, ఇంకొంత కాలం పెద్దన్న పద్మారావు, మరికొంత కాలం రెండో అన్న నారప్పరావు.. బొబ్బిలి సంస్థాన వ్యవహారాలను చక్కదిద్దారు.

వెంగళరావుకు రంగపతి రంగారావు, పెద జనార్ధనరావు అనే ఇద్దరు కుమారులున్నారు. జనార్ధనరావు లక్కవరపు కోటను సంపాదించి పాలించారు. రంగపతి రంగారావు కుమారులు రాజా రాయుడప్ప రంగారావు. ఈయన తన తండ్రి మరణించే నాటికి చాలా చిన్నవాడు. దీంతో తన అన్న రాజా వెంకటపతి రంగారావు (లక్కవరపు కోట పాలకుడు, బాబాయి అయిన రాజా పెద జనార్ధన రంగారావు కుమారుడు) కొంత కాలం ఎస్టేటు వ్యవహారాలను పర్యవేక్షించారు. అటు తర్వాత రాయుడప్ప రంగారావే రాజ్య పాలన చేశారు. వీరికి సంతానం లేకపోవడం వల్ల రాజా గోపాలకృష్ణ రంగారావు బహద్దూర్‌ని దత్తత తీసుకున్నారు. వీరు బొబ్బిలి వారి పూర్వపు దాయాదులు, పాల్తేరు వాస్తవ్యులు అయిన రావు గోపాలరావు పెద్ద కుమారుడు.

గోపాలకృష్ణ రంగారావు భార్య మల్లమ దేవి. ఈమె కసింకోట వాస్తవ్యులు చెలికాని వెంకయాంబ, రామరాయల పుత్రిక. ఈమె చెల్లెలు జగ్గమాంబ. ఈవిడ పిఠాపురం పాలకులైన రావు నీలాద్రిరావు (క్రీ.శ. 1730–1776) సతీమణి.

18వ శతాబ్ది మధ్యకాలంలో బొబ్బిలి సంస్థానాధీశునిగా ఉన్న రాజా గోపాలకృష్ణ రంగారావుకు, విజయనగర రాజు పూసపాటి పెద విజయరామరాజుకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం ఉండేది.

కాకతీయ సామ్రాజ్యానంతరం పద్మనాయకుల ప్రాబల్యం తెలుగునాట అంతకంతకూ పెరుగసాగింది. దీన్ని అంతకు ముందు రాజబంధువులుగా, సామంతులుగా ఉన్న కొందరు సోమ వంశ క్షత్రియులు జీర్ణించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో విజయవాడ దుర్గాధీశుడైన పూసపాటి మాధవవర్మ నాయకత్వంలో జల్లిపల్లి మహా సంగ్రామం జరిగింది. ఈ రణరంగంలో పరాజితులైన పూసపాటి వారు అనంతరం కళింగ సామ్రాజ్యాన్ని ఆశ్రయించారు. వారి సామంతు

లుగా తమ రాజధానిని విజయవాడ నుంచి విజయనగరానికి మార్చుకున్నారు. జల్లిపల్లి యుద్ధంలో వంశపు పగలు పొగలు కక్కుతూ ఐదు వందల ఏండ్ల వరకూ అగ్నిజ్వాలలను రగిల్చాయి. రావు వారు బొబ్బిలి సంస్థానాన్ని స్థాపించినా.. పూసపాటి వారు విజయనగరాన్ని ఏలుతున్నా.. పూర్వపు వైషమ్యాలను మాత్రం వీడలేదు. బొబ్బిలి వారిని ఎదుర్కొనడం విజయనగర రాజుల తరం కాలేదు. అంత బలం, బలగం వారికి లేకుండా పోయాయి. కానీ, ఎప్పటికైనా తమ పక్కలో బల్లెంలా ఉన్న బొబ్బిలి వారిని వెళ్లగొట్టి ఆ సంస్థానాన్ని ఆక్రమించుకోవాలని విజయనగరం వారికి ఆశగా ఉండేది. కానీ ఆ ఆశ వారికి ఆడియాశగానే మిగిలిపోసాగింది. ఈ నేపథ్యంలో వారెప్పుడూ అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉండేవారు.

18వ శతాబ్దంలో విజయరామరాజు కాలంలో వారికొక అవకాశం వచ్చింది. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఫ్రెంచి కమాండర్ ఇన్ చీఫ్ బుస్సీ చెంత చేరాడు విజయరామారావు. బొబ్బిలి వారిని ఒంటరిగా ఎదుర్కొలేక వారిపై లేనిపోని చాడీలు చెప్పి బుస్సీని బొబ్బిలి వారిపైకి ఉసిగొల్పాడు. ఈ పర్యవసానాలే బొబ్బిలి యుద్ధానికి దారి తీశాయి. భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ ఎరుగని సంఘటనలను ఆవిష్కరించిన తీవ్ర యుద్ధం అది. అనేక జానపద గాథలకు ప్రాణం పోసిన బీభత్స కాండ ఈ యుద్ధంలో జరిగింది.





ప్రతీకాత్మక చిత్రాలు

# బొబ్బిలి యుద్ధం

ఉత్తర సర్కారులపై ఆధిపత్యం కోసం ఐరోపా దేశాలైన బ్రిటీష్, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు వారు తమలో తామే కాక, స్థానిక పాలకులతోనూ అనేక యుద్ధాలు చేశారు. వీటి కారణంగా ఆ ప్రాంతాలపై ఆధిపత్యం తరచూ మారుతూ ఉండేది. ఇలా జరిగిన అనేక యుద్ధాలలో, తెలుగు నాడు చరిత్రలో బొబ్బిలి యుద్ధం ఒక ప్రముఖ ఘట్టంగా మిగిలిపోయింది. అనేక జానపద గాథలకు ప్రాణం పోసిన బీభత్స కాండ ఈ యుద్ధంలో జరిగింది.

**జల్లిపల్లి మహాసంగ్రామం** (క్రీ.శ. 1361) రగిల్చిన వంశపు పగలు పొగలు కక్కుతూ నాలుగు వందల ఏండ్ల వరకూ అగ్నిజ్వాలలను రగిల్చాయి. రావు వారు బొబ్బిలి సంస్థానాన్ని స్థాపించినా.. పూసపాటి వారు విజయనగరాన్ని ఏలుతున్నా.. పూర్వపు వైషమ్యాలను మాత్రం వీడలేదు. బొబ్బిలి వారిని ఎదుర్కొనడం విజయనగర రాజుల తరం కాలేదు. బలం, బలగం ఉన్నా అవి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. కానీ, ఎప్పటికైనా తమ పక్కలో బల్లెంలా ఉన్న బొబ్బిలి వారిని వెళ్లగొట్టి ఆ సంస్థానాన్ని ఆక్రమించుకోవాలన్నది విజయనగర రాజుల ఆశ. అది ఆడియాశగానే మిగిలిపోసాగింది. ఈ నేపథ్యంలో వారెప్పుడూ అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉండేవారు.

18వ శతాబ్దంలో బొబ్బిలి సంస్థానాన్ని రాజా గోపాలకృష్ణ రంగారావు, విజయనగర సంస్థానాన్ని పూసపాటి పెద విజయరామరాజు పాలిస్తూ ఉండేవారు. వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం ఉండేది. ఈ మేరకు ఆ ఇరువురి మధ్య అనేక ఘర్షణలు, యుద్ధాలు జరిగాయి. వీటిల్లో ఎక్కువగా బొబ్బిలి సంస్థానమే విజయం సాధిస్తూ ఉండేది.

ఫ్రెంచి వారు గతంలో హైదరాబాద్ నిజాం నుంచి ఉత్తర సర్కారులను పొంది ఉన్నారు. ఫ్రెంచి సేనాని బుస్సీ ఆధీనంలో ఈ సర్కారులు ఉండేవి. స్థానిక ప్రభువులు ఫ్రెంచి వారికి శిస్తు కడుతూ పాలన సాగిస్తుండేవారు. 1756 చివరలో హైదరాబాద్ నిజాం సలాబత్ జంగ్.. బుస్సీని ఉద్యోగం నుంచి తొలగించాడు. ఈ వార్త తెలిసిన తరువాత విజయనగర రాజులు తప్ప, ఉత్తర కోస్తా జమీందారులందరూ ఫ్రెంచి వారికి శిస్తులు చెల్లించడం మానేశారు. అటు తర్వాత బుస్సీ.. నిజాంతో రాజీ కుదుర్చుకుని, తిరిగి ఉత్తర సర్కారులను స్వాధీనం చేసుకోవడానికి బయలుదేరాడు. 1757లో బుస్సీ నిజాం సంస్థానం నుండి బయల్దేరి మచిలీపట్నం మీదుగా రాజమండ్రి చేరుకుని, కోటపల్లి వద్ద మకాం వేశాడు. పాలెగాళ్లు, జమీందారులు, సంస్థానాధీశులు వచ్చి తనను కలువాలని అందరికీ కబురు పంపాడు బుస్సీ. దొర ఆజ్ఞ మేరకు విజయరామరాజుతో సహా అందరూ వచ్చి కలిశారు, ఒక్క బొబ్బిలి పాలకుడు రంగారావు తప్ప.

సమయం, సందర్భం కోసం ఎదురుచూస్తున్న విజయరామరాజు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు. బొబ్బిలి రంగారావుకు వ్యతిరేకంగా బుస్సీకి, అతని దివాను హైదర్‌జంగ్ (నిజాం నవాబు తరపున దివానుగా మహ్మదీయ సేనాని హైదర్ జంగ్ బుస్సీ దొరకు సహాయంగా ఉండేవాడు)కు లేనిపోనివి చెప్పాడు. 'మీరంటే వారికి లెక్కలేదనీ, అందువల్లే మిమ్మల్ని వచ్చి కలువలేదనీ, మీకు ఇవ్వాల్సిన శిస్తు కూడా సరిగా చెల్లించడం లేద'నీ వారికి నూరిపోశాడు. 'బొబ్బిలి వారు తనను అనేక రకాలుగా ఇబ్బందులు కలుగజేస్తున్నారని, వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టి బొబ్బిలిని తనకు స్వాధీనం చేస్తే శిస్తు సక్రమంగా చెల్లిస్తాన'ని కూడా విజయరామరాజు బుస్సీని వేడుకున్నాడు. తాను కట్టాల్సిన కప్పం కూడా వెంటనే కట్టేశాడు. అంతేకాక, హైదర్‌జంగ్‌కు లంచం ఇచ్చి, బుస్సీకి బొబ్బిలిపై మనసు విరిచేందుకు సహకరించమని కోరాడు. ధనాశాపరుడైన హైదర్‌జంగ్ అందుకు అంగీకరించడమే కాక.. విజయరామరాజుకు వత్తాసు పలికి బొబ్బిలి వారిపై బుస్సీకి ఆగ్రహం తెప్పించాడు. 'వెంటనే బొబ్బిలి వదిలి

పెట్టి పోవాల'ని బుస్సీ బొబ్బిలి రంగారావుకు హుకుం జారీ చేశాడు. రంగారావు దాన్ని అవమానంగా భావించాడు.

హైదర్‌జంగ్‌కు, విజయరామరాజుకు మధ్య జరిగిన లంచం ఒప్పందం తన వేగుల ద్వారా బొబ్బిలి రంగారావుకు తెలిసింది. హైదర్‌జంగ్‌కు, బుస్సీ దొరకు అసలు విషయం చెప్పేందుకు తన రాయభారి మంతెన బుచ్చనతో రంగారావు రాయభారం నడిపాడు. కానీ, ఆ ప్రయత్నం విఫలం అయింది. మరో ప్రయత్నంగా బొబ్బిలి రంగారావు తమకు ఆత్మీయుడయిన బందరు ఫ్రెంచి దొర గోరుం గారితో సిఫారసు ఉత్తరం బుస్సీ దొరకు పంపించాడు. కానీ, హైదర్‌జంగ్ మాయోపాయాలు, విజయరామరాజు దురుద్దేశం ముందు బొబ్బిలి దొరల రాజనీతి, రాయబారం నిరుపయోగం అయ్యాయి.

ఆ సాయంత్రం విజయరామరాజు హైదర్‌జంగ్‌ను కలిసి 'చూశారా? నేను చెప్పిందే నిజమైంది. ఆ రంగారావు మిమ్మల్ని కలవడానికి రాకుండా, బందరు కమాండరు ద్వారా బుస్సీకి ఉత్తరం పంపించాడు, అతడికి మీరంటే లెక్కే లేదు' అని అతడ్ని రెచ్చగొట్టాడు.

అంతకు ముందో, ఇదే సమయంలోనో జరిగిన రెండు సంఘటనలు కూడా బొబ్బిలి రంగారావుపై బుస్సీకి మరింత ఆగ్రహాన్ని కలిగించాయి. అందులో ఒకటి.. బుస్సీ దొర తన కొందరు సిపాయిలను ఒక దూరప్రదేశానికి పంపించాల్సి వచ్చింది. వాళ్లు బొబ్బిలి రాజ్యం గుండా వెళ్లాల్సి రాగా, అందుకు తగ్గ అనుమతులు కూడా తీసుకున్నారు. విజయరామరాజు కుటిల రాజకీయ చాతుర్యం కావచ్చు, రంగారావు ప్రణాళిక కావొచ్చు.. ఆ సిపాయిలపై దాడి జరిగింది. ఆ దాడిలో 30 మంది సిపాయిలు చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. బొబ్బిలి సంస్థానంపై చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని బుస్సీకి తెలియజేయడానికి విజయరామరాజు ఈ సందర్భాన్ని కూడా బాగా ఉపయోగించుకున్నాడు.

ఇక రెండోది.. ఇబ్రహీం ఖాన్ శ్రీకాకుళంలో ఫ్రెంచి వారి తరపున ఫౌజుదారుగా ఉన్నాడు. బుస్సీకి నిజాంతో సంబంధాలు దెబ్బతిన్న సమయంలో అతడు బుస్సీపై తిరుగుబాటు చేశాడు. రాజమండ్రి కోటలో సైనికులను రెచ్చగొట్టి, తిరుగుబాటు చేయించాడు. ఫ్రెంచి వారు వసూలు చేసిన శిస్తులు వెనక్కి ఇచ్చేయాలని అతడు డిమాండ్ చేశాడు. బుస్సీ రాజమండ్రి చేరుకోగానే అతడు భయపడి పారిపోయి, బొబ్బిలి రాజుల వద్ద శరణు కోరాడు. తనను ఎదిరించిన వాడికి ఆశ్రయం ఇవ్వడం.. బుస్సీకి బొబ్బిలిపై ఉన్న కోపాన్ని, వారిపట్ల అతడి శత్రు భావనను మరింతగా పెంచాయి. ఈ సంఘటనలే బుస్సీని బొబ్బిలిపై యుద్ధం దిశగా నడిపించాయి.

బుస్సీ ఆజ్ఞ మేరకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరిన ఫ్రెంచి తురుష్క సేనలు పెద్దాపురం మీదుగా కసింకోట చేరుకున్నాయి.

మంతెన బుచ్చన్న తన తొలి రాయబారం విఫలం అయినప్పుడే యుద్ధం అనివార్యమని బొబ్బిలికి వర్తమానం పంపాడు. బొబ్బిలి వారు యుద్ధానికి సిద్ధం అవుతూనే రాయబార ప్రయత్నాన్ని మాత్రం మానలేదు.

బొబ్బిలి సంస్థానపు సర్దారులలో ఇనుగంటి పెద్దలక్ష్మీ నరసయ్య, చెలికాని వెంకయ్య, దామెర ధర్మానాయుడు, రావు చిన్నయ్య, తాండ్ర పాపయ్యలు ముఖ్యులు. ఇందులో ఇనుగంటి లక్ష్మీ నరసయ్య, దామెర ధర్మానాయుడు రంగారావుకు మేనమామలు. చెలికాని వెంకయ్య, తాండ్ర పాపారాయుడు బావమరుదులు.

మంతెన బుచ్చన వర్తమానం అందిన వెంటనే పోరు తప్పదని భావించిన ఈ పద్మనాయక వీరులందరూ తమ పరివారంతో బొబ్బిలి కోటకు చేరుకున్నారు. యువవీరుడు, రంగారావు సోదరుడు వెంగళరావు వీరవాహినికి స్వాగతం పలికాడు. రంగారావు సోదరులు తమ యోధులను విభజించారు. నాయకులను నిర్ణయించారు. ఆయుధాగారం తెరిపించారు. మార్టారులు, ఫిరంగులు బురుజులకు ఎక్కించారు. తాండ్ర పాపయ్య రాజం కోట రక్షణకు బయలుదేరాడు.

బుస్సీ కసింకోట మకాంలో ఉన్నప్పుడు బొబ్బిలి రంగారావు తన సర్దార్ చెలికాని వెంకయ్యతో మరో రాయబార ప్రయత్నం చేశాడు. హైదర్‌జంగ్, వెంకయ్యతో 'మీ దొర కోట వదిలి పెట్టి వెళ్లాడా లేదా?' అని గద్దించాడు. 'మాకు కోటను విడిచి వెళ్లే అవసరం లేదని, వెళ్లే ప్రసక్తే లేదని' తెగేసి చెప్పి వచ్చాడు వెంకయ్య.

మర్నాడు.. జనవరి 24, 1757.. తెల్లవారేటప్పటికీ బుస్సీ సేనలు కసింకోట మకాం నుంచి బొబ్బిలి పొలిమేరకు చేరుకుని డేరాలు వేశాయి.

బొబ్బిలి కోటలో మూడు వేళలా మోగే నగారా (నౌబత్) తెల్లవారి నుంచే మోగడం మొదలైంది. అది ఫ్రెంచి సేనలకు చెవుల్లో జోరీగలా తోచింది. హైదర్ జంగ్ ఉద్రేకంతో ఊగిపోయాడు. 'ఇంతటి వాహినితో కోట ముట్టడికి తాము సిద్ధంగా ఉన్నా కించిత్ భయపడక నగారా మోగిస్తారా? ఏమి ఈ పద్మనాయక ప్రభువుల స్థయిర్యం? ఏమిటి ఈ బొబ్బిలి వారి గర్వం?' అని ఒళ్లుడికిపోయింది జంగ్‌కు.

హైదర్, బుస్సీ దొర డేరాలో దర్బారు ఏర్పాటు చేశారు. విజయరామరాజు కూడా అందులో పాల్గొన్నాడు. దీని పర్యవసానంగా ఫ్రెంచి సేనానాయకుడు లడూఖాన్‌ను బొబ్బిలి కోటలోనికి రాయబారం కోసం పంపారు. అందులో ప్రధాన షరతుగా వెంటనే నగారాను ఆపాలి. తర్వాత బొబ్బిలి వారు కోట ఖాళీ చేసి వెళ్లిపోవాలి.

రంగారావు లడూఖాన్‌ను స్వయంగా, సగర్వంగా ఆహ్వానించాడు. కానీ, రాయభార విషయాలను మాత్రం అంగీకరించలేదు. 'నౌబత్ (దుందుభి, భేరిలాంటి చర్మ వాయిద్యం) మాకు మొగలు చక్రవర్తులు బహుకరించినది. దానిని మోగించడం మేం ఆపం'. రెండోది.. కోట ఖాళీ చేయడం అనే మాట తాము వినడానికే సహింపడం లేదని.. తీవ్రమైన ప్రకృతి విపత్తుల సమయంలో కూడా తాము కోటను విడిచి ఏనాడు వెళ్లలేదని, 'చావైనా చత్తుముగానీ కోట వీడుట కల్ల' అని వెలమ వీరులందరూ నిష్కర్షగా, నిర్మొహమాటంగా చెప్పారు.

దాంతో యుద్ధం అనివార్యమైంది.

దామెర ధర్మానాయుడు, చెలికాని వెంకయ్య, ఇనుగంటి ధర్మానాయుడు, కాకర్లపూడి వెంకటరామరాజులు తమ తమ బలగాలతో బురుజులను ఆక్రమించారు. ఇనుగంటి పెదలక్ష్మీ నరసయ్య సర్వసైన్యాధిపత్య బాధ్యతలు తీసుకున్నారు. వెంగళరాయుడు ప్రధానద్వార రక్షణ బాధ్యతను చేపట్టాడు. యుద్ధ తంత్రాలు సిద్ధమయ్యాయి.

ఉభయ సేనలూ యుద్ధ ప్రకటనలు చేసుకున్నాయి. పోరు ప్రారంభమైంది. ఫ్రెంచి తురుష్క సేనలది విజయకాంక్ష, వెలమ వీరులది అభిమాన రక్షణకాంక్ష. తురుష్క సేనావాహిని కోటగోడలను ఎక్కే ప్రయత్నం చేయసాగింది. బొబ్బిలియోధులు కోట దరిదాపునకు వారిని రానీయకుండా హతం చేయసాగారు. బొబ్బిలి బెబ్బులులు కోట బురుజుల నుంచి శిలాయంత్రాలు, వడిసె రాళ్లు, కొయ్య సాధనాలు, తాటి తుపాకులు, ఫిరంగులు ఉపయోగించసాగారు. ఫ్రెంచి సేనలు అపార మందుగుండు సామగ్రిని, ఆధునిక ఆయుధాలను వాడసాగారు.

ఫిరంగుల తాకిడికి పెద్ద దేవిడి ఫెళఫెళలాడింది. ఫిరంగి గుండ్లకు ఆహుతి అవ్వడం ఇష్టం లేక వెలమవీరులు ప్రాణాలు విడిచి వీరస్వర్గం పొందేందుకు సైతం సిద్ధపడ్డారు. బొబ్బిలి నాయకులందరూ అత్యవసర సమావేశం నిర్వహించి అంతఃపుర స్త్రీల మానరక్షణ ముఖ్యమని భావించారు. ఈ మేరకు బొబ్బిలి రంగారావు తన పచ్చల పిడి పేష్కబ్బు(కత్తి)ని తన బావమరిది చెలికాని వెంకయ్యకు ఇచ్చి తన రాణి మల్లమదేవికి పంపాడు. అది చూసిన మల్లమ వెంటనే తన కర్తవ్యాన్ని తెలుసుకుంది.

తన పుత్రుడైన వేంకట రంగారావును తీసుకుని ముద్దాడింది. దాయియైన వేంకట లక్ష్మిని పిలిచి హితోక్తులు చెప్పింది. కొడుకు బతికితే తన వంశం నిలుస్తుందని భావించింది. ఎలాగైనా తన కొడుకును సామర్లకోటలోని తన సోదరి జగ్గమాంబ దగ్గరకు తీసుకుపొమ్మని చెప్పింది. అలాగే తన అన్న తాండ్ర పాపారాయుడికి ఇక్కడ పరిస్థితి విషమించింది, వెంటనే రావాలనే సందేశాన్ని వేగుల కూడా ద్వారా పంపించింది.

వెంకటలక్ష్మి బయలుదేరింది. అనంతరం అంతఃపురంలోని వీరపత్నులందరూ ఆత్మాహుతి చేసుకున్నారు. అది చూసి అంతఃపుర పరిచారికల నాయకురాలు రామామణి అంతఃపురం తలుపులు మూసి నిప్పంటించింది. అంతఃపుర నారీలోకమంతా ఆ అగ్నికి ఆహుతైంది. అది చూసిన బొబ్బిలి వీరుల హృదయ జ్వాలలు భరింపరానివయ్యాయి.

ఫిరంగి దాడికి దేవిడి ఊగిసలాడింది. వెలమవీరులు కోటను వీడి రణరంగానికి కదిలారు. ఇరు పక్షాల మధ్య పోరు హోరెత్తింది. ఈ పోరులో వెంగళరావు వీర స్వర్గం పొందాడు. ఈ వార్త విన్న ప్రభువు రంగారావు కూడా కోటను వదిలి కదన రంగానికి కదిలాడు. శత్రువులును చీల్చి చెండాడాడు. తలలు బంతుల్లా ఎగిరి పడ్డాయి. తనువుపై ఆశ వదిలి తెగబడిన బొబ్బిలి యోధుల ముందు తురుష్క సేనలు నిలువలేకపోయాయి. ప్రతిపక్షం పరుగులు పెట్టింది. రణరంగం రక్తసిక్తమైంది.

వెలమవీరుల ధ్యేయం ఒక్కటే. సేనావాహినిని చీల్చుకుని వెళ్లి హైదర్ జంగ్, విజయరామ

రాజులను అంతమొందించడమే. ఈ విషయం ఊహించిన హైదర్ జంగ్ వెంటనే యుద్ధ వ్యూహాన్ని మార్చాడు. తురుష్క సేనలు వెనక్కి తగ్గాయి. బొబ్బిలి సేనలు ముందుకు కదిలాయి. ఫ్రెంచి సేనలు వెనుక నుంచి మందుగుండ్లతో తెగబడ్డాయి. ఈ కుటిల వ్యూహం పసిగట్టలేక వెలమ వీరులు ఆ దొంగదెబ్బకు అసువులు బాసారు. ఆ పద్మనాయక వీరుల అస్తమయం చూడలేక సూర్యుడు సైతం అస్తమించాడు.

యుద్ధంలో చిట్టచివరి బొబ్బిలి వీరుడు కూడా నేలకొరిగిన తర్వాత మాత్రమే ఫ్రెంచి సైన్యం కోటలోనికి ప్రవేశించగలిగింది. లోపలికి వెళ్లిన వారు అక్కడ మంటల్లో స్త్రీలు, పిల్లలు చనిపోయిన దృశ్యం చూసి దిగ్భ్రాంతులయ్యారు. లోపల జరిగిన సామూహిక మరణాల గురించి తెలిసిన బుస్సీ, కోటలోకి వెళ్లేందుకు కూడా ఇష్టపడలేదట. (మరో కథనం ప్రకారం బుస్సీ కూడా లోపలికి వెళ్లాడు) బొబ్బిలి వీరుల శూరత్వాలకు, అభిమాన పరాక్రమాలకు, అక్కడ జరిగిన ఘోరానికి బుస్సీ బాధపడి హైదర్‌జంగ్‌ను పిలిచి మందలించాడట.

ఆ రాత్రి విజయరామరాజు తన డేరాలో సంబరాలు చేసుకున్నాడు. ఇక బొబ్బిలి తనదేనంటూ ఉత్సవాలు చేసుకున్నాడు. ఆనందడోలికల్లో తేలియాడాడు.

మల్లమ తన అన్న తాండ్ర పాపారాయునికి సమాచారం అందజేయడానికి పంపిన వేగును తురుష్క సేనలు మార్గ మధ్యలోనే అంతం చేశాయి. దీంతో గజబలుడు, సింహవిక్రముడు అని పేరున్న తాండ్ర పాపయ్యకు బొబ్బిలి పోరాటం వార్త ఏ మధ్యాహ్నానికో తెలిసింది. కోపోద్రిక్తుడైన తాండ్ర పులి దేవులపల్లి పెద్దన్న, బుద్ధిరాజు వెంకయ్యను వెంటబెట్టుకుని వెంటనే రాజం కోట నుంచి గుర్రాలపై బొబ్బిలికి దౌడు తీశాడు. చీకటిపడే సరికి బొబ్బిలికి చేరుకున్నారు ఆ వీరులు. అక్కడ జరిగిన ఘోరాన్ని చూసిన వారి హృదయాలు ద్రవించాయి. రాజ్యం, రాజు, అంతఃపురకాంతలు, చివరకు నా అన్న వారెవరూ మిగలని ఆ గడ్డను చూసి విలపించారు. తన అక్కని, చెల్లిని, బావలను విగత జీవులుగా చూసిన పాపయ్య చలించి పోయాడు. కంట నీరు పెట్టుకున్నాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు. వెంటనే తేరుకున్నాడు. విజయరామరాజును అంతం చేయడమే తన లక్ష్యమని శపథం చేశాడు. పాపారాయుని వీరావేశానికి అవధులు లేవు. పగ.. పగ.. పగ.. పగ తీర్చుకోవడమే ఇక ఆ వీరుని లక్ష్యం. తన వేగులను పంపి విజయరామరాజు డేరా ఆనుపానులు తెలుసుకున్నారు.

తెలతెలవారుతుండగా.. విజయరామరాజు సుఖనిద్రలో ఉన్నాడు. జాగ్రత్తగా లోపలికి వెళ్లారు పాపయ్య, మిగిలిన ఇద్దరు వీరులు. ఒక్కసారిగా విజయరామరాజుపై పడ్డాడు పాపయ్య. తాండ్ర పులిని చూసిన విజయరామరాజు కేకలు వేశాడు. ఆ అరుపులు విని లోపలికి వస్తున్న అంగరక్షదళ నాయకుడిని పాపయ్య వెంటవచ్చిన వీరులు మట్టుబెట్టారు. పాపయ్య విజయరామరాజును బాకుతో పొడిచి, పొడిచి చంపాడు. డేరాలో పులి దూరి రాజును భక్షించిందనే వార్త అంతటా అలుముకుంది. సేనలు బారులు తీరాయి. ఫిరంగులు సిద్ధమయ్యాయి. శత్రువుల చేతిలో ప్రాణాలు కోల్పోవడం ఇష్టం లేక పాపయ్య సహా ఆ వెలమ వీరులు ఆత్మాహుతి చేసుకున్నారు. అలా తాండ్ర పాపయ్య 'బొబ్బిలి పులి'గా చరిత్రలో నిలిచిపోయాడు.



బొబ్బిలి యుద్ధం స్మారక స్థూపం

# యుద్ధానంతరం.. బొబ్బిలి

**'శత్రువుల చేతిలో చావడం కంటే ఆత్మార్పణమే మేలు' అని భావించింది ఆ తల్లి. ఆ క్షణాన కూడా 'తాము ఏమైపోయినా ఫర్వాలేదు.. తన కొడుకు బతికితే ఆ వంశమే నిలుస్తుంది' అని ఆశించింది. అది వీర బొబ్బిలి మనుగడకు, వంశసంరక్షణకు సంబంధించిన సమస్య. తన దాసిని పిలిచి యువరాజును కోట దాటించింది. మరి, ఆ యువరాజు ఏమయ్యాడు? ఆమె ఆశించినట్లు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాడా లేదా? యుద్ధానంతరం.. బొబ్బిలి సంస్థానం ఏమైపోయింది..?**

**బొబ్బిలి యుద్ధం ముగిసిన తర్వాత..** ఫ్రెంచి దొర బుస్సీ కూడా, యుద్ధరంగంలో శవాల కుప్పలను చూసి చలించిపోయాడు. వెంటనే సైనిక సభ ఏర్పాటుచేసి తన సంతాపం తెలియజేస్తూ, ఉభయ సేనలలోని అమరవీరులకు జోహార్లు అర్పించాడు. అదే సభకు బొబ్బిలి రంగారావు కుమారుడు, ఆరేండ్ల బాలుడు అయిన వేంకట గోపాల రంగారావు (జననం 1751)ను కూడా రప్పించాడు. బొబ్బిలి వీరుల త్యాగనిరతిని కొనియాడుతూ, జరిగిన నష్టానికి చింతిస్తూ గోపాల రంగారావును బొబ్బిలి రాజుగా పట్టాభిషిక్తుడిని జేశాడు బుస్సీ దొర.

అయితే, యుద్ధ సమయంలో దాసి అయిన వేంకటలక్ష్మికి తన కుమారుడు, యువరాజు అయిన వేంకట గోపాల రంగారావును ఇచ్చి క్షేమంగా తన సోదరి జగ్గమాంబ దగ్గరకు తీసుకుపొమ్మని చెప్పింది మల్లమదేవి. ఈ మేరకు వేంకటలక్ష్మి కోట దాటుతుండగానే తురుష్క సేనలు

యువరాజును పట్టుకున్నాయని కొందరు చరిత్రకారులు రాశారు. మరి కొంతమంది వేంకట లక్ష్మి క్షేమంగా ఆ బాలుడిని జగ్గమాంబ చెంతకు చేర్చిందనీ చెబుతారు.

1964లో బొబ్బిలి యుద్ధం నేపథ్యంలో అదే పేరుతో సినిమా వచ్చింది. ఈ సినిమాలో కూడా వేంకటలక్ష్మి యువరాజును తీసుకుని పోతుండగా, తురుష్క సేనలు బంధించి బుస్సీ దగ్గరకు తీసుకువెళ్లాయి. బుస్సీ వారిద్దరినీ బంధించాడు. యువరాజు అక్కడి నుంచి తప్పించు కున్నట్లు, వేంకటలక్ష్మి కూడా తప్పించుకుని ఆ సమాచారాన్ని తాండ్ర పాపారాయునికి చేరవేసినట్లు చూపించారు. యువరాజు తిరిగి యుద్ధరంగానికి వెళతాడు. తండ్రి బొబ్బిలి రంగా రావు చనిపోయాడని తెలుసుకుంటాడు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న చంద్రాయమ్మ యువరాజును చేరదీసినట్లు చూపించారు.

ఎలా ఎవరి దగ్గరికి యువరాజు చేరుకున్నాడన్న విషయంలో విభేదాలు ఉన్నప్పటికీ మొత్తానికైతే అతడు క్షేమంగానే ఉన్నాడన్నది స్పష్టం. అటు తర్వాత బుస్సీ దొర అతనికి బొబ్బిలి రాజ్యాన్ని అప్పగించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అదే సమయంలో యువరాజుకు కొత్తపల్లి సీమను కూడా ఫర్మానాగా ఇచ్చినట్లు కూడా చరిత్ర చెబుతున్నది. ఈ వేంకట గోపాల రంగారావునే 'చిన రంగారావు' అని కూడా పిలిచేవారు. ఈయన కొన్నేళ్లు పాల్తేరులో, తర్వాత కొన్నేళ్లు పిఠాపురంలో, యుక్తవయస్సు వచ్చిన తర్వాత రాజాంలో పెరిగాడు.

క్రీ.శ. 1766లో విజయనగర సంస్థానం దివాను సీతారామరాజు ఈ చిన రంగారావును మాయోపాయంతో బంధించి బొబ్బిలిని వశ పర్చుకున్నాడు. చిన రంగారావును విజయనగరం కోటలో ఖైదీని చేశాడు. అటు తర్వాత క్రీ.శ. 1766 నుంచి 1794 వరకు బొబ్బిలి సంస్థానం విజయనగరం సంస్థానంలో ఒక భాగంగానే ఉన్నది. ఈ మధ్య కాలంలోనే చిన రంగారావు ఖైదు నుంచి తప్పించుకుని సామర్లకోటలోని పినతల్లి జగ్గమాంబ దగ్గరకు పోయి కొన్నాళ్లు ఉన్నాడు. అటు తర్వాత చిన రంగారావు హైదరాబాద్‌కు చేరుకున్నాడు. నిజాం దయకు పాత్రుడై అక్కడే వేచి ఉన్నాడు. క్రీ.శ. 1794లో నిజాం నుంచి సిఫార్సు పొంది చిన రంగారావు తిరిగి బొబ్బిలికి వచ్చాడు. అప్పటికి ఉత్తర సర్కారులన్నీ ఇంగ్లీషు వారి పాలనలోకి వచ్చాయి. నిజాం సిఫార్సు మేరకు నార్తర్న్ డివిజన్ కలెక్టర్.. చిన రంగారావుకు బొబ్బిలి తాలూకాలను కౌలు కింద తిరిగి ఇచ్చాడు. అప్పటి నుంచి పాలన సాగించిన చిన రంగారావు క్రీ.శ. 1801లో మరణించాడు. ఏడేండ్ల ఈ స్వల్పకాలంలో చిన రంగారావు పూర్వ యుద్ధంలో శిథిలమైన బొబ్బిలిని సంస్కరించి కొత్త బొబ్బిలిని నిర్మించాడు. ఇప్పుడు బొబ్బిలి మ్యూజియంగా ఉన్న కోటను ఆయనే అప్పట్లో పునరుజ్జీవింపజేశాడు. చిన రంగారావుకు సంతానం లేకపోవడంతో తమ దాయాదులైన పాల్తేరు వాస్తవ్యుల పుత్రుడిని దత్తత తీసుకున్నారు. రావు అన్నారావు, సుబ్బమాంబల చిన్న కొడుకును దత్తత తీసుకున్న చిన రంగారావు అతనికి రాయుడప్ప రంగా రావు అని పేరు పెట్టాడు. చిన రంగారావు తర్వాత క్రీ.శ. 1802 నుంచి 1830 వరకు ఈయన బొబ్బిలిని పాలించాడు. బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణాన్ని ఈయనే మొదలెట్టారు.

రాయుడప్పకు ఇద్దరు భార్యలు. చెలికాని వారి ఆడబిడ్డ చెల్లయ్యమ్మ మొదటి భార్య. ఇనుగంటి వారి ఆడబిడ్డ బుచ్చాయమ్మ రెండో భార్య. చెల్లయ్యమ్మకు శ్వేతాచలపతి రంగారావు, జనార్ధన రంగారావు, సీతా రామచంద్ర రంగారావు, వేంకట రంగారావు అనే నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. బుచ్చాయ్యమ్మకు సీతయ్యమ్మ అనే ఒక కుమార్తె జన్మించింది.

రాయుడప్ప రంగారావు మరణానంతరం క్రీ.శ. 1830లో శ్వేతాచలపతి రంగారావు బొబ్బిలి రాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు. తన తండ్రి చేపట్టిన వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణాన్ని శ్వేతాచలపతి రంగారావు 1837లోనే పూర్తిచేశాడు. శ్వేతాచలపతి గోదావరి మండలానికి చెందిన చింతపట్ల వారి ఆడబిడ్డ వెంకాయ్యమ్మ (వెంకట రమణమ్మ)ను మొదటగా వివాహం చేసుకున్నాడు. తర్వాత దామెర వారి ఆడబిడ్డ వెంగాయమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి సంతానం కలుగక పోవడం వల్ల పిఠాపురం సంస్థానాధీశులు రాజా రావు వేంకట సూర్యారాయణిం గారి రెండో కొడుకు సీతారామ కృష్ణుడిని దత్తత చేసుకున్నారు. ఈయనకు సీతారామ కృష్ణ రాయుడప్ప రంగారావు అని నామకరణం చేశారు. ఈయన ఇనుగంటి వారి ఆడపడచు లక్ష్మీ చెల్లయ్యమ్మను పెండ్లి చేసుకున్నాడు.

క్రీ.శ. 1830 నుంచి 1862 వరకు ముప్పై రెండేండ్ల పాటు పాలన సాగించిన తర్వాత శ్వేతాచలపతి రంగారావు మరణించాడు. వీరి అనంతరం దత్తపుత్రుడు సీతారామకృష్ణ రాయుడప్ప రంగారావు బహద్దూర్ పేరుతో పాలన సాగించాడు. క్రీ.శ. 1863 నుంచి ఐదేండ్లపాటు పాలించిన సీతారామకృష్ణ బొబ్బిలిలో ఆంగ్లో వర్నాక్యులర్ పాఠశాలను స్థాపించాడు. ఈయన క్రీ.శ. 1868లో పిన్న వయసులోనే మరణించాడు.

సీతారామకృష్ణ రాయుడప్ప రంగారావు, లక్ష్మీ చెల్లయ్యమ్మ దంపతులకు సంతానం లేకపోవడం వల్ల వేంకటగిరి సంస్థాన పాలకులు సర్వజ్ఞ కుమార యాచేంద్రుల మూడో కుమారుడు రంగమన్నారు కృష్ణ యాచేంద్రులను రాణి లక్ష్మీ చెల్లయ్యమ్మ క్రీ.శ. 1872లో దత్తత తెచ్చుకున్నారు. ఈయనకు రాణి వేంకట శ్వేతాచలపతి రంగారావు అని పేరు పెట్టారు. క్రీ.శ. 1887లో రాణి లక్ష్మీ చెల్లయ్యమ్మ పరమపదించిన తర్వాత వేంకట శ్వేతాచలపతి రంగారావు పూర్తి స్థాయి బొబ్బిలి పాలన బాధ్యతలు స్వీకరించారు. బొబ్బిలి పాలకుల్లో ఈయన పదకొండో తరానికి చెందిన వారు. శ్రీ రాజా వేంకట శ్వేతాచలపతి రంగారావు బ్రిటీషు ప్రభుత్వం నుంచి మహారాజా, సర్ మొదలగు బిరుదులు పొందారు. అటు తర్వాత కెసిఐఇ, జిసిఐ, సిబిఇ అనే బిరుదులను కూడా ఆయా సందర్భాల్లో ఆయనకు ఇచ్చారు. క్రీ.శ. 1893లో యూరప్ ఖండాన్ని పర్యటించి, బ్రిటీష్ విక్టోరియా మహారాణిని ఈయన కలుసుకున్నారు. నాలుగుసార్లు మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా కూడా ఉన్నాడు.

మహారాజా వారు కవి పండిత పోషకులు, సంస్కృత ఆంధ్రంలో అపార పండితులు. బహు గ్రంథ రచయిత కూడా. క్రీ.శ. 1898లో ఉదకమండలంలో జరిగిన మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశంలో మద్రాసు టెనెన్సీ బిల్లుమీద మాట్లాడుతూ 'రఘువంశం, మనుస్మృతి లాంటి ప్రాచీన గ్రంథాల నుంచి ఉదాహరణలు చూపించి' మెప్పించాడు. వీరి ఈ ప్రసంగానికి, పాండి

త్యానికి, చారిత్రక విజ్ఞానానికి పలువురి ప్రశంసలూ లభించాయి. వీరు ఆంధ్ర విశ్వకళా పరిషత్తుకు తొలి ప్రోచాన్స్‌లర్ (First pro-chancellor -1926). సంస్కృత భాషలో అధ్యయనం, పరిశోధనల కోసం అప్పట్లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈయన లక్ష రూపాయలు విరాళమిచ్చాడు. ఈయన నాట్యం, శిల్పం, చిత్రలేఖనం, కవిత్వాన్ని పోషించిన రసజ్ఞులు. రాజా వేంకట శ్వేతాచలపతి రంగారావు మొదటి భార్య చెలికాని వారి ఆడపడచు వేంకట రమణమాంబ. వీరికి 1880లో వేంకట కుమార కృష్ణ రంగారావు జన్మించాడు. రమణమాంబ స్వర్గస్థులు కాగా, ఆమె సోదరిని వివాహమాడాడు పెద రాజా వారు. ఆవిడా అకాల మరణం చెందగా తిరిగి ఇనుగంటి వారి ఆడబిడ్డ వేంకట లక్ష్మీ రమణమాంబను వివాహం చేసుకున్నాడు. వీరికి రామకృష్ణ రంగారావు బహద్దూర్ జన్మించాడు.



రాజా వేంకట శ్వేతాచలపతి రంగారావు

రాజా వేంకట శ్వేతాచలపతి రంగారావు మరణానంతరం ఆయన పెద్ద కొడుకు వేంకట కుమార కృష్ణ రంగారావు బహద్దూర్ 1917లో జమీపాలనకు వచ్చారు. కొద్ది కాలానికే అంటే.. 1920లో ఈయన మృతి చెందారు. అనంతరం ఈయన కొడుకు రాజా శ్వేతాచలపతి రామకృష్ణ రంగారావు బహద్దూర్ బొబ్బిలి పాలకుడయ్యాడు. తండ్రి అకాల మరణం తర్వాత, వృద్ధులైన తాత బొబ్బిలి మహారాజా వేంకట శ్వేతాచలపతి రంగారావు సజీవులుగా ఉండగానే ఈయన 1928లో పాలన చేపట్టాడు. అప్పటికి ఈయనకు రాజ్యపాలనార్హత వయస్సు లేకపోయినప్పటికీ, వ్యక్తిగత సామర్థ్యం తెలిసిన ఆంగ్లేయ ప్రభుత్వ గవర్నర్ ప్రత్యేకానుజ్ఞతాపత్రం ఇచ్చారు. ఇది ఆయన చిన్నతనంలోనే సాధించిన మొదటి విజయం. 1930లో ఆయన మద్రాసు అసెంబ్లీకి విశాఖపట్టణం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యాడు. 1932-37లో మద్రాసు ముఖ్యమంత్రిగా పనిచేసి కెసిఐఇ బిరుదు పొందారు. 1931లో మద్రాసు ప్రభుత్వం ఈ రాజా వారిని ఆంధ్రా యూనివర్సిటీ ప్రోఛాన్సులర్‌గా నియమించింది. అదే యూనివర్సిటీ వారు ఈయనకు 1937లో గౌరవ డాక్టరేటు ఇచ్చారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్ వ్యవస్థాపన సమయంలో బొబ్బిలి రాజా వారిని సాయం కోరగా ఆయనను బొబ్బిలికి ఆహ్వానించి తగు విరాళాలు ఇచ్చి గౌరవించారు. బొబ్బిలి రాజా వారు నూజివీడు సంస్థానానికి చెందిన తేలప్రోలు రాజావారి కుమార్తె లక్ష్మీ సుభద్రాదేవిని వివాహం చేసుకున్నారు. వీరి కుమారుడు వేంకట గోపాలకృష్ణ రంగారావు. 'బొబ్బిలి కుమార రాజా'గా ప్రజలు పిలుచుకునే వారు. 1962లో చీపురుపల్లి నియోజక వర్గం నుంచి అత్యధిక మెజారిటీతో పార్లమెంట్ మెంబర్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఈయన భార్య మంగతాయారు. వీరికి సుజయ్ కృష్ణ రంగారావు, కుమార కృష్ణ రంగారావు (బాబు నాయన), రామ కృష్ణ రంగారావు అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడు సుజయ్ కృష్ణ రంగారావు బొబ్బిలి నుంచి ఎంఎల్ఏగా ఎన్నికై ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ఉన్నారు.



నూజివీడు గుర్రం గేటు

# నూజివీడు

**నూజివీడు సంస్థానం.. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన సంస్థానం. 569 చదరపు మైళ్ల వరకూ విస్తరించి ఉన్న ఈ సంస్థానం కింద 231 గ్రామాలు ఉండేవి. శోభనాద్రి అప్పారావు పాలన తర్వాత తలెత్తిన వారసత్వ కలహాల వల్ల ఈ సంస్థానం 1882లో ఆరు జమీందారీలుగా విడిపోయింది. అవి.. వెంట్రప్రగడ, ఉయ్యూరు, మీర్జాపురం, కపిలేశ్వరపురం, తెల్లప్రోలు, మేడూరు. ఈ సంస్థాన మూలపురుషులందరి గురించిన చారిత్రిక ఆధారాలు అందుబాటులో లేకపోయినా, కొందరి కథలు మాత్రం ఆసక్తికరం.**

**16వ శతాబ్దంలో 'విజయ' బిరుదుగల** అప్పన్న గారు గొల్లపల్లి దుర్గం నుండి వేట కోసం బయలుదేరాడు. దారిలో ఒకచోట నువ్వుల చేనులో ఒక మేక, తోడేలును ఎదిరించడం చూసి ఆయన ఆశ్చర్యపడ్డాడు. వెంటనే తన బంధువులను, పరివారాన్ని పిలిపించి ఆ చేనులోనే సమావేశం ఏర్పాటు చేశాడు. ఆ ప్రదేశాన్ని శౌర్య నిలయంగా గుర్తించి, అక్కడ 50 ఎకరాల స్థలంలో కోటను నిర్మించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. అది నువ్వుల చేను ప్రదేశం కాబట్టి దానికి 'నూజేల వీడు'గా నామకరణం చేశారు. కాలక్రమేణా అది 'నూజివీడు'గా మారింది. అప్పటి నుంచి నూజివీడు మూడు శతాబ్దాల పాటు ఆ సంస్థానానికి రాజధానిగా ఉంది. సంస్థానం స్థాపించడానికి కారణం 'శౌర్యం గల మేక' కాబట్టి, సంస్థానాధీశులు 'మేకా వారు'గా పేరొందారు. ఈ కోటను అప్పన్న గారు నిర్మించారు కాబట్టి వారి అంశనామం 'అప్పారావు'గా స్థిరపడింది.

నూజివీడు ప్రఖ్యాత పద్మనాయక సంస్థానాలలో ఒకటి. ఈ సంస్థానాధీశులు విప్పర్ల గోత్రజులైన పద్మనాయక రాచవెలమలు. వీరికే మన్నె వెలమలనీ, వెలమ దొరలనీ వాడుక పేర్లు ఉన్నాయి. కృష్ణా గోదావరిల మధ్యనున్న సువిశాల భూభాగాన్ని ఈ పాలకులు 18 పరగణా

లుగా విభజించి పాలించారు. 'తీన్ హజార్ మున్సబ్‌దారు' అనేది మొఘల్ చక్రవర్తులు వీరికి చ్చిన ఖితాబు. అంటే, మూడు వేల సైన్యం ఉంచుకునే అర్హత కలిగిన వారని అర్థం. తహవర్, వజులాలత్, దుస్తుగహా అనే బిరుదులను ఈ సంస్థానాధీశులకు గోల్కొండ నవాబులు ఇచ్చారు.

నూజివీటి వారి పూర్వీకులు దక్షిణ దేశంలో చోళరాజుల సామంతులుగా, సేనానులుగా ఖ్యాతిగొన్నట్లు వీరి బిరుదావళి చెబుతున్నది. ముందు వీరు దక్షిణ చోళులను కొలిచి పులికాట్ ఒడ్డున కోటలను పొందారు. అనంతరం చోళ సేనానులుగా వేంగి చాళుక్యులను జయించినట్లు వీరి బిరుదావళి చెబుతున్నది. తెలుగు చోళులు ఆంధ్రదేశాన్ని ఏలినప్పుడు వీరు కృష్ణా గోదావరీ నదుల మధ్య స్థిరపడ్డారు.

నల్లగొండ, ఖమ్మం మెట్టు, భద్రాచలం నుండి సముద్రతీరం వరకూ గల సువిశాల భూభాగాన్ని విప్పర్ల వంశం వారు పరిపాలించారు. ఇందులో పర్తియాలను (జుజ్జూరు) జూపల్లి శాఖ వారు, పాల్వంచను అశ్వారావు వారు, చార్ మహల్ (గురజ)ను కమదన వారు, నూజివీడు (గొల్లపల్లి)ని అప్పారావు వారు.. వారి వారి అనుకూలతల మేరకు విభజించుకుని పాలించారు.

కాకతీయ సామ్రాజ్య సమయంలో వీరంతా కాకతీయులకు సామంతులుగా ఉన్నారు. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం రాచకొండ పాలనలో వారికి బంధువులుగా సామంతులుగా కొనసాగారు. ఆ తరువాత కళింగ గజపతుల చెంతకు చేరారు. అనంతరం విజయనగర (హంపి) సామంతులుగా ఉన్నారు. ఆ తరువాత నిజాం సేనానులుగా, బ్రిటీష్ పాలనలో జమీందార్లుగా బాధ్యతలు నిర్వహించారు.

## మూలపురుషుడు బసవ దండనాథుడు

కాకతీయ సామ్రాజ్య కాలంలో 77 మంది పద్మనాయక దండనాథులలో బసవ దండనాథుడు విఖ్యాతుడు. ఈయనే తమ వంశ మూలపురుషుడని నూజివీటి సంస్థాన శాఖ వారు గుర్తించినట్లు పద్మనాయక చరిత్రలో ఉన్నది. ఈ బసవన్న కాకతీయ సామ్రాజ్ఞి రాణి రుద్రమదేవి అంగరక్షక దళాధ్యక్షుడు.

క్రీ.శ. 12వ శతాబ్దంలో పాండ్య రాజులు బలవంతులై చోళరాజైన రెండవ మనుమసిద్ధిని జయించి నెల్లూరును ఆక్రమించారు. చోళరాజు మనుమసిద్ధి రాణి రుద్రమదేవిని ఆశ్రయించాడు. దీంతో రుద్రమ కాకతీయ సేనలను మనుమసిద్ధికి సహాయంగా పంపింది. ఈ సేనలకు బసవ దండనాథుడు నాయకత్వం వహించాడు. బసవ దండనాథుడు పాండ్యులను ఓడించి నెల్లూరు సింహాసనం మనుమసిద్ధికి ఇప్పించాడు. ఇందుకుగాను బసవ దండనాథుడు చోళ రాజ్య స్థాపనాచార్య, అరిరాయ గజాంకుశ, రాయ రాహుత్త వేశ్యాభుజంగ అనే బిరుదులు పొందాడు.

బసవనాథుని తరువాత నూజివీడులో మేకా వారి కుటుంబం స్థిరపడే వరకూ ఈ వంశ పూర్వీకుల చరిత్ర అందుబాటులో లేదు. కానీ 'కాకతీయుల కొలువులో వీరు మెలిగిన వారేనని నిష్కర్షగా చెప్పవచ్చు' అని 'ఆంధ్ర సంస్థానములు : సాహిత్య పోషణము' అనే గ్రంథంలో

తూమాటి దొణప్ప రాశారు.

కాకతీయ సామ్రాజ్య అనంతరం రాచకొండ సామ్రాజ్య కాలంలో ఈ వంశం వారు గొల్లపల్లి పాలకులుగా, రాచకొండ ప్రభువులైన రేచర్ల వారికి రాజబంధువులుగా ఉన్నారు. రెడ్డి సామ్రాజ్యం ప్రబలమైన తరువాత వీరు కొంతకాలం అజ్ఞాతంలో ఉన్నట్లు తెలుస్తున్నది. కొండవీడు క్షీణదశకు చేరుకున్న తరువాత వీరు మళ్లీ విజృంభించి కళింగ సామంతులలో ముఖ్యులయ్యారు. శ్రీకృష్ణ దేవరాయలు కాలంలో నూజివీటి పాలకులు విజయనగర సామంతులయ్యారు.

## విఖ్యాత విక్రముడు విజయ అప్పారావు

విప్పర్ల వంశంలో ఏడో తరానికి చెందిన వారు అప్పన్న. ఈయనే నూజివీడు నిర్మాత. విప్పర్ల పద్మనాయకులను మేకా వారిగా సృష్టించి, అప్పారావు అనే గౌరవ నామం తెచ్చిన విక్రముడు. శ్రీకృష్ణదేవరాయల అనంతరం రామరాయల పక్షాన తల్లికోట యుద్ధంలో గోల్కొండ నవాబుతో పోరాడిన యోధుడు ఈ అప్పారావు.

క్రీ.శ. 1565లో జరిగిన ఈ యుద్ధంలో రామరాయలు పరాజితుడయ్యాడు. విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నమై మహమ్మదీయుల వశమైంది. ఈ యుద్ధంలో అప్పన్న శౌర్యాన్ని గుర్తించిన సుల్తాన్ తమ సామంత సర్దారులలో చేర్చుకుని అప్పన్నను గౌరవించారు.

గోల్కొండ సుల్తాన్ బీజాపూర్ (కర్ణాటక) దుర్గాన్ని స్వాధీనం చేసుకునేందుకు ముస్తఫా ఖాన్ నాయకత్వంలో సేనలను పంపాడు. ఈ యుద్ధంలో సహాయంగా వెళ్లిన పద్మనాయక సేనలకు అప్పన్న నాయకత్వం వహించాడు. పోరు సందర్భంలో ముస్తఫా ఖాన్ సేనలు వెనుకడుగు వేసినప్పుడు అప్పన్న బలగం విజృంభించి అత్యంత సాహసాన్ని ప్రదర్శించినట్లు చరిత్రకారులు రాశారు.

క్రీ.శ. 1596లో మొఘల్ రాజకుమారుడు మురాద్ మీర్జా (అక్బర్ కుమారుడు) అహ్మద్‌నగర్ (మహారాష్ట్ర) కోటపై దాడికి తలపెట్టాడు. అహ్మద్‌నగర్ రాణీ చాంద్‌బీబీ గోల్కొండ సుల్తాను సహాయం కోరింది. దీంతో సుల్తాను ఆరువేల సైన్యాన్ని చాంద్‌బీబీకి సహాయంగా పంపాడు. ఈ సేనలు అహ్మద్‌నగర్ చేరుకోక ముందే సాహసోపేతులైన సర్దారు అప్పన్న నాయకత్వంలోని అశ్వికదళం అహ్మద్ నగర్ కోటలోకి ప్రవేశించి మొఘలుల ముట్టడిని తిప్పికొట్టింది. ఈ సందర్భంలోనే అప్పన్న రణకుశలతకు మెచ్చిన రాణీ చాంద్‌బీబీ ఆయనకు 'విజయ' అనే పౌరుష బిరుదునిచ్చి సన్మానించింది. అప్పన్న విజయోత్సాహంతో తిరిగి వచ్చిన సందర్భంలో గోల్కొండ సుల్తాన్ కుతుబ్‌షాహీ అప్పన్నకు 'రావు' బిరుదునిచ్చి సన్మానించాడు. దీంతో అప్పన్న 'విజయాధిక శౌర్యాన్విత సర్దారు విప్పర్ల విజయ అప్పారావు'గా కీర్తి పొందాడు. గోల్కొండ నవాబు ఈ సమయంలోనే వీరికి తహవర్, వజులాలత్, దుస్తుగహ అనే బిరుదులు ఇచ్చి రాజాబహదూర్, నౌబత్ పల్లకీలతో సన్మానించారు. గొల్లపల్లి నుండి నూజివీడుని నిర్మించిన ఈ విఖ్యాత విక్రముడు విజయ అప్పారావు క్రీ.శ. 1597లో గోల్కొండ నవాబ్ మహ్మద్ కుతుబ్‌షాహీకి సహాయంగా సోనేపూర్ దగ్గర జరిగిన యుద్ధంలో వీరస్వర్గం పొందాడు.

# నూజివీడు నర'సింహం' నారయ్యప్పారావు

పద్దెనిమిదో శతాబ్దంలో తెలుగు నేలపై బ్రిటీషు పాలకులను గడగడలాడించిన వీరుడు నరసింహ నారయ్యప్పారావు. దక్షిణ భారత ప్రథమ స్వాతంత్ర్య యోధుల్లో ఇతను చెప్పుకోదగినవాడు. తమిళనాడులో వీరపాండ్య కట్ట బ్రహ్మనకు ఇతడు సమకాలీనుడు. పాండ్యరాజు కట్ట బ్రహ్మన బ్రిటీషు ఫిరంగులకు ఎదురొడ్డి ఆహుతి అయితే, నారయ్యప్పారావు ధైర్య సాహసాలతో పోరాడి తిరిగి రాజ్యం పొంది విక్రముడయ్యాడు.

నారయ్యప్పారావు నూజివీడును పాలించిన మేకా వంశస్థుల్లో పదమూడో తరానికి చెందిన వాడు. ఇతనికే నరసింహ నారయ్యప్పారావు, నారయ అప్పారావు అనే పేర్లూ ఉన్నాయి. ఇతని కాలంలో బ్రిటీషు వారు తమ పలుకుబడి పెంచుకుంటూ సంస్థాన పాలకులను గుప్పిట్లో బిగించి స్వైర విహారం చేస్తుండేవారు. దేశ సంపదను కొల్లగొట్టడమే లక్ష్యంగా సంస్థాన పాలకుల నుంచి కప్పం (పేష్కసు) వసూలు చేస్తుండేవారు. ఈ దౌర్జన్యాన్ని సహించని నారయ్యప్పారావు బ్రిటిషు పాలకులకు కప్పం కట్టకుండా నిరాకరించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. ఇది సహించని బ్రిటీషు వారు క్రీ.శ. 1773లో నూజివీడు జమీందారీని వశపరుచుకోవడానికి సైనిక దళాన్ని పంపారు. అప్పుడు నారయ్యప్పారావు బందరులోని కొందరు కంపెనీ దొరల వద్ద అధిక వడ్డీకి సొమ్మును బదులుగా తీసుకుని బకాయి కట్టేశాడు. అటు తర్వాత ముందుగా మాట్లాడుకున్న వడ్డీ కాకుండా తాము చెప్పినంత డబ్బు ఇవ్వాల్సిందేనని కంపెనీ దొరలు నారయ్యప్పారావుపై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై బందరులో కంపెనీ వారి పరిపాలనా సంఘు అధ్యక్షునిగా ఉన్న వైట్ హిల్‌కు, నారయ్యప్పారావుకు మధ్య విభేదాలు తలెత్తాయి. అవి తగాదాలకూ దారి తీశాయి.

ఇది అన్యాయమని ఈ వ్యవహారం మద్రాసులో తేల్చుకుంటానని నారయ్యప్పారావు ప్రయత్నించాడు. వైట్ హిల్ పలుకుబడి ముందు నారయ్యప్పారావు ప్రయత్నాలు ఫలించలేదు. కంపెనీ పరిపాలన, న్యాయం వంటి వాటిపై పూర్తిగా విశ్వాసం కోల్పోయిన అప్పారావు తిరుగు బాటు చేసే ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇది తెలుసుకున్న కంపెనీ వారు నారయ్యప్పారావును అరెస్టు చేశారు. ఆయనను నిర్బంధంలో ఉంచిన కారాగారం అధికారి హాడ్జెస్ వైట్ హిల్‌కు మద్దతుగా ఓ ఒప్పందం కుదిర్చాడు. అప్పు తీసుకున్న దొరలందరికీ తాము కోరినంత ధనం ఇవ్వాల్సిందిగా నారయ్యప్పారావుతో బాకీ పత్రం రాయించుకున్నాడు. అప్పటికే ఇలాంటి అక్రమాలపై వచ్చిన ఆరోపణలు నిజమేనని తేలడంతో 1781లో వైట్ హిల్‌ను సస్పెండ్ చేశారు కంపెనీ వారు. దీన్ని అవకాశంగా తీసుకున్న నారయ్యప్పారావు తనకు జరిగిన అన్యాయాన్ని మద్రాసు పరిపాలక సంఘం తాత్కాలిక ముఖ్యాధికారి శాడ్లియర్‌కు ఆర్జీ పెట్టుకున్నాడు. ఆయన దానిని కంపెనీ డైరెక్టర్ల కోర్టుకు పంపాడు. కంపెనీ వారు ఈ ఆర్జీని పరిశీలిస్తుండగానే తనకు న్యాయం చేస్తారన్న నమ్మకం కోల్పోయిన నారయ్యప్పారావు 1783లో కొంత సైన్యాన్ని సమకూర్చుకుని తిరుగుబాటుకు సిద్ధపడుతున్నాడనే పుకార్లు వ్యాపించాయి. ఈ పుకార్ల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా మద్రాసు గవర్నర్ సర్ థామస్ రంబోల్డు నూజివీడు సంస్థానాన్ని వశపరుచుకోవాలని ఆజ్ఞలు జారీ చేశాడు. ఈ మేరకు కెప్టెన్ మౌంట్ గోమరి నాయకత్వంలో బ్రిటీష్ సేనలు నూజివీడు కోటను ముట్టడించాయి. ఈ ముట్టడి 1783 నవంబర్ 20న జరిగింది. ఈ పోరా

టంలో కెప్టెన్ మౌంట్ గోమరీకి ఇద్దరు మేజర్లు, ఆరుగురు లెఫ్టినెంట్లు, బ్రిటీష్ సేనలకు నాయకత్వం వహించినట్లు బ్రిటీషు వారి రికార్డుల్లో నమోదై ఉంది.

బ్రిటీష్ దళాలు 21 రోజుల పాటు కోటను ముట్టడించే ప్రయత్నామే చేశాయి కానీ కోటపై తూటా పేల్చేందుకు మొదట సాహసం చేయలేకపోయాయి. ఈ సాహసం ఎందుకు చేయలేక పోయాడో మౌంటు గోమరీ అటు తర్వాత తన రిపోర్టులో రాసుకున్నాడు. నారయ్యాప్పారావుపై దాడి చేస్తే మైలవరం జమీందారులు, బెజవాడ పాలకులు, కలవకొలను పాలకులు, నూజివీడు వారి బంధువులు, స్థానిక ప్రజలు సహించే స్థితిలో లేరని, వారంతా కలిసి మూకుమ్మడి దాడికి సిద్ధంగా ఉన్నారనేది గోమరీ రిపోర్టు సారాంశం.

21వ రోజు నారయ్యాప్పారావు కోటలో సభ జరిపారు. కోటలో ఉన్న తమను బ్రిటీషు దళాలు ఏమీ చేయలేవని స్పష్టమైంది. కానీ ఆంగ్లేయులను పారదోలాలంటే అపార జననష్టం తప్పదు. అంతకు ముందే జరిగిన బొబ్బిలి యుద్ధం పర్యవసానాలు తెలుసు. కనుక శత్రువులకు లొంగకుండా కోట విడిచి తప్పుకోవడం ఉత్తమమని ఆ సభలో నిర్ణయం తీసుకున్నాడు నారయ్యాప్పారావు. ఇందుకోసం ఒక వ్యూహం సిద్ధం చేశాడు కూడా.

1783 డిసెంబర్ 10 తెల్లవారు జామున వ్యూహం ప్రకారం నారయ్యాప్పారావు సేనలు కోట నుంచి దాడి ప్రారంభించాయి. కోట నాలుగు పక్కల నుండి ఒకేసారి యుద్ధం మొదలెట్టాయి. ఇది ఊహించని బ్రిటీషు సేనలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. నారయ్యాప్పారావు 10 వేల పరివారంతో కోటలోని రహస్య మార్గం నుంచి నూజివీడు సరిహద్దు దాటి నిజాం రాజ్యానికి వెళ్లిపోయాడు. అపార ప్రజా బలమున్న నారయ్యాప్పారావును బ్రిటీషు సేనలు వెంబడించినా ఏమీ చేయలేకపోయాయి. భద్రాచలం ప్రాంతంలో తలదాచుకున్న నారయ్యాప్పారావును పట్టుకునేందుకు నిజాం ప్రభుత్వంతో కంపెనీ వారు ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలెట్టారు. రాజ మండ్రి కలెక్టరు, మైలవరం జమీందార్లు రాయబారం నడిపి ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చారు. నారయ్యాప్పారావు తిరుగుబాటును కంపెనీ వారు క్షమిస్తే నారయ్య బాకీ చెల్లించేట్టు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు నారయ్యాప్పారావు జమీందారీని తిరిగి పొందారు. కానీ మొదటి కిస్తీ కట్టి రెండోది కట్టలేకపోయాడు. దీంతో కంపెనీ వారు మళ్లీ సేనలను పంపారు. మరోసారి ఘోర యుద్ధం జరిగింది. శత్రుసేనల ధాటికి తట్టుకోలేక నారయ్యాప్పారావు మారువేషంలో తిరిగి భద్రా చలం వెళ్లిపోయాడు. నూజివీడు కోట నేలమట్టమయింది. నారయ్యాప్పారావును జమీందారీ నుంచి తొలగించి ఆయన కుమారుడు వెంకట నరసింహ అప్పారావుకు అప్పగిస్తున్నట్లు 1784లో కంపెనీ వారు ప్రకటించారు. నారయ్యాప్పారావు భద్రాచలం అడవుల నుంచే అలజడి సృష్టించాడు. అనుచరులను చేర్చుకుని ఆ సైన్యంతో గ్రామాలను కొల్లగొడుతూ, ఖజానా లూటీ చేస్తూ బ్రిటీషు వారిని గడగడలాడించాడు.

నారయ్యాప్పారావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పెద్ద కొడుకు వెంకట నరసింహ అప్పారావు. ఇతడు 1793 దాకా కంపెనీ వారి ఆధీనంలో చీకూ చింతా లేకుండా పాలించాడు. ఆ తర్వాత కప్పం సరిగ్గా కట్టడం లేదనే నెపంతో కంపెనీ వారు వెంకట నరసింహ అప్పారావు

పట్ల విముఖతగా ఉన్నారు. ఇదే సమయంలో నారయ్యప్పారావు రెండో భార్య కుమారుడు రామ చంద్ర అప్పారావుకు పాలన బాధ్యతలు అప్పగించాలని అంతర్గతంగా ఆందోళనలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో కంపెనీ వారు నూజివీడు సంస్థానాన్ని తమ వశం చేసుకుని పరగణాలుగా విభ జించి పాలక వంశీయులకు భృతులు ఏర్పరిచారు. ఇందులో భాగంగా నిడుదవోలు పరగణాలు వెంకట నరసింహ అప్పారావుకు, ఉయ్యూరు పరగణాలు రామచంద్ర అప్పారావుకు అప్పగిం చారు. ఈ సవతి సోదరులిద్దరూ మొదట అన్యోన్యంగా ఉన్నా తర్వాత ఎవరికి వారు సంస్థానా ధిపత్యం కోసం పోరాడారు. కంపెనీ వారు ఈ చిక్కులు, చికాకులతో విసిగి జమీని ఎప్పటిక ప్పుడు పునరుద్ధరిస్తూ తమ 'విభజించు పాలించు' నైజాన్ని ప్రదర్శించారు. వివాదాల వల్ల నూజి వీడు సంస్థానం ఆరు జమీందారీలుగా విడిపోయింది. అవి.. ఉయ్యూరు, వెంట్రప్రగడ, మీర్జాపురం, కపిలేశ్వరపురం, తెల్లప్రోలు, మేడూరు.

నూజివీడు రాజవంశంలో 18వ తరానికి చెందిన రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దూర్ ఉయ్యూరు రాజాగా ప్రసిద్ధికెక్కారు. సర్వజ్ఞ శేఖరులుగా పేరు పొందిన ఈయన కుమారుడు రాజా రంగయ్య అప్పారావు బహద్దూర్. ఈయననే ఎమ్.ఆర్. అప్పారావు అంటారు. ఈయన 1947లో తొలిసారి శాసనసభకు ఎన్నిక కావడమే కాకుండా.. 1962లో ఆంధ్రప్రదేశ్ మంత్రి పదవిని కూడా అలంకరించారు. ఈయన ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా కూడా పనిచేశారు. బరోడా మహారాణి సీతాదేవి నూజివీడు నుంచి విడిపోయిన మీర్జాపురం జమీందారీకి చెందిన మహా రాజకు మారి. ఈవిడ మొదట పెండ్లాడింది ఉయ్యూరు జమీందారు ఎం.ఆర్. అప్పారావునే.



సి. కృష్ణవేణి

మీర్జాపురం రాజ కుటుంబానికి చెందిన వెంకట రామ అప్పారావు బహద్దూర్ సినీ రంగంలో రాణిం చారు. అక్కినేని నాగేశ్వర్‌రావుతో 'మీ ర్జాపురం రాజావారు' అనే పేరున కీలుగుఱ్ఱం (ఫిబ్రవరి, 1949) సినిమా తీసింది ఈయనే. జయ ఫిలిమ్స్, శోభనాచల పిక్చర్స్‌ను ఈయన స్థాపించారు. ఈయన భార్య సి. కృష్ణవేణి నటి, గాయనీ, సినీ నిర్మాత. 'మన దేశం' (నవంబర్ 1949) లాంటి చిత్రాలు నిర్మించారు. ఎన్టీఆర్, ఘంటసాల, ఎస్వీ రంగారావులాంటి మహామహులను సినీ పరిశ్రమకు పరిచయం చేసిన ఘనత ఈవిడది. నూజివీడు సంస్థానాధీశుడైన మేకా వంశానికి చెందిన మేకా వెంకట ప్రతాప్ అప్పా రావు (ఎంవీపీ అప్పారావు) 2014లో నూజివీడు (ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ) నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



భద్రాచల క్షేత్రం

# పాల్వంచ సమేత భద్రాచలం

**సీతారామ లక్ష్మణులు అరణ్యవాస కాలంలో నివసించిన పంచవటీ క్షేత్రం ఈ సంస్థానంలోనే ఉంది. త్రేతాయుగం నుండి నేటికీ పవిత్రభూమిగా కొలుస్తున్న ప్రాంతమిది. పంచవటి, దమ్మక్క, గోపన్న లాంటి భక్తశిఖామణులు వెలసిన భద్రాచల క్షేత్రం ఈ గడ్డ మీదిదే. భద్రాచల స్వామి సంరక్షకులుగా, సంస్థాన పాలకులుగా 27 తరాల పాటు సేవ చేసిన విఖ్యాత 'అశ్వారావు' బిరుదు ప్రదానులు పాలించిన సంస్థానమే.. పాల్వంచ సమేత భద్రాచల సంస్థానం.**

**పాల్వంచ - భద్రాచల సంస్థానం నిజాం రాష్ట్రంలో** స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాచీన సంస్థానం. 800 చదరపు మైళ్ల విస్తీర్ణం, 315 గ్రామాల్లో 40 వేల జనాభా (1927 లెక్కల ప్రకారం) ఈ సంస్థానం సొంతం. పాల్వంచ పూర్వ నామం శంకరగిరి. సంస్థాన విషయంలో పాల్వంచ, భద్రాచలం వేర్వేరు కాదు. సంస్థాన పూర్వీకులకు రాజధానిగా ఉన్న భద్రాచలం.. గోల్కొండ నవాబుల కాలంలో కొంతకాలం విడిపోయింది. తర్వాత తిరిగి పాల్వంచ సమేత మైంది. నిజాం కాలంలోనూ ఇలాగే జరిగింది. గోదావరి మండలంలోని భద్రాచలం, రేకపల్లిని 1860లో అప్పటి నిజాం బ్రిటీషు ప్రభుత్వానికి ఇవ్వడంతో అవి సెంట్రల్ ప్రావిన్సెస్ (Central provinces)లో చేరాయి. ఆ తర్వాత 1874లో భద్రాచలంతో పాటు రేకపల్లి చెన్నపురిలోని తాలూకాలుగా మారాయి. ఇంతకీ పాల్వంచ నుంచి భద్రాచలం ఇలా రెండుసార్లు ఎందుకు విడి పోయింది? తిరిగి ఎలా కలిసింది? – ఈ సంస్థానం మూలాల గురించిన సమాచారం మరింత ఆసక్తికరం.

ప్రఖ్యాత పద్మనాయక వెలమల్లో విఖ్యాత విప్పర్ల గోత్రానికి చెందిన 'అశ్వారావు వారు' ఈ సంస్థాన పాలకులు. 'అశ్వారావు' అనేది వీరికి కాకతీయులు ఇచ్చిన బిరుదు. 'అశ్వారావులు' అంటే అశ్వదళాధిపతులు. కాకతీయ సామ్రాజ్య కాలం నుండి భద్రాచలం రాజధానిగా వీరు పాలన సాగించారు. కాకతీయ సామ్రాజ్యానంతరం వీరి పూర్వీకుల్లో ఒకడైన అన్నప్ప అశ్వారా వుకు ఢిల్లీ సుల్తాను ఈ ప్రాంతాన్ని తిరిగి ఇచ్చినట్లు చరిత్ర చెబుతున్నది. అన్నప్ప అశ్వారావు క్రీ.శ. 1324లో శంకరగిరి, హసనాబాద్ పరగణాలతో కూడిన ప్రాంతమైన పాల్వంచ – భద్రా చలం జమీందారీకి పాలకుడుగా ఉన్నట్లు బ్రిటీష్ రికార్డులు, గోదావరి గెజిట్‌ల వల్ల తెలుస్తున్నది. 'పాల్వంచ జమీందారులే భద్రాచలం జమీందారులు' అని కూడా ఈ గెజిట్ చెబుతున్నది. అన్నప్ప అశ్వారావు ఈ సంస్థానానికి మూలపురుషుడు. ఇతడు నూజివీడు సంస్థాన మూలపు రుషుడైన బసవదండనాథుని వంశానికి చెందినవాడు. అన్నప్ప అశ్వారావు కాలం నుండి పద్దెని మిది తరాల వారు ఈ భూభాగాన్ని స్వతంత్రంగా పాలించినట్లు సంస్థాన చరిత్ర చెబుతున్నది.

ఈ సంస్థాన పాలకుల్లో 16వ శతాబ్దానికి చెందిన సర్వప్ప అశ్వారావు విఖ్యాతుడని సింహాచల ఆస్థాన మంటప శాసనం చెబుతున్నది. ఈ సర్వప్ప నూజివీటి సంస్థాన నిర్మాత విజయ అప్పారావుకు సమకాలికుడు.

క్రీ.శ. 1650 ప్రాంతంలో గోల్కొండ నవాబులు ఢిల్లీ సుల్తాను ఆధిపత్యాన్ని ధిక్కరించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. రాజకీయ విప్లవాలు అనేక రూపాలుగా కొనసాగిన ఈ సందర్భంలో పాల్వంచ సంస్థానాధీశులు ఢిల్లీ సుల్తాన్ పక్షం వహించారు. ఇందుకుగాను సుల్తాను అశ్వారావు వారికి 'రైవత్ వ అవలి మహనా' అనే బిరుదునిచ్చారు.

ఢిల్లీ సుల్తానుల తరపున పాల్వంచ సంస్థానాధీశులు యుద్ధంలో ఉన్న సమయం చూసి క్రీ.శ. 1668లో గోల్కొండ నవాబు తానీషా భద్రాచలాన్ని వశపరుచుకున్నాడు. ఈ సమయంలో అక్కన్న మాదన్నలు తానీషా కొలువులో ప్రధానమంత్రులుగా ఉన్నారు. తానీషా భద్రాచలాన్ని వశపరుచుకున్న ఏడాది తర్వాత అక్కన్న మాదన్నల మేనల్లుడు కంచర్ల గోపన్న భద్రాచల పరగణాకు తహశీల్దారుగా వచ్చాడు. ఆ తర్వాత రామభక్తి పరాయణుడైన గోపన్న 'శ్రీరామదా సు'గా మారిన చరిత్ర, భద్రాచల క్షేత్ర ప్రాశస్త్యం మనకు తెలిసినవే. హైదరాబాద్ షాలిబండ

లోని మహంకాళీ ఆలయాన్ని నిర్మించింది ఈ అక్కన్న మాదన్నలే. క్రీ.శ. 1687లో గోల్కొం డను మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు వశపర్చుకున్నాడు. దీంతో భద్రాచల సంస్థానం తిరిగి అశ్వా రావుల వశమయ్యింది. ఔరంగజేబు భద్రాచలాన్ని తిరిగి అశ్వారావులకు అప్పజెబుతూ 'బాద్ షాహి మున్సబ్‌దార్' అనే బిరుదునిచ్చి సత్కరించాడు.

క్రీ.శ. 1707లో ఔరంగజేబు మరణించిన తర్వాత 1724లో మొఘల్ సర్దారుల్లో ఒకడైన అసఫ్ జాహీ నిజాముల్ ముల్క్ దక్కను సుబేదారుగా వచ్చి నిజాం రాజ్యం స్థాపించాడు.

క్రీ.శ. 1769లో జాఫర్ ఉద్దౌలా అనే మొఘల్ సేనాని పాల్వంచ సంస్థానంపై దాడి చేశాడు. ఆనాటి పాలకుడు నరసింహ అశ్వారావును సంహరించి సంస్థానాన్ని కొల్లగొట్టాడు. కొంతకాలం తర్వాత తురుష్క సేనాని ఇబ్రహీం ఖాన్ (హైదరాబాద్ నిజాం సలాబత్ జంగ్ హయాంలోని ఎలగందల ఖిలేదార్ మీర్జా ఇబ్రహీం దంసా కావొచ్చు) జమీందారులను దోచుకొంటూ ధ్వంస కాండ తలపెట్టాడు. ఇతనిని 'దంసా' అని తెలుగు కవులు పేర్కొన్నారు. ఈ దంసా దమనకాం డతో సంస్థానం మరింత శక్తిని కోల్పోయింది.

నరసింహ అశ్వారావు కుమారుడు రామచంద్ర అశ్వారావు. తండ్రి మరణం తర్వాత భద్రా చల క్షేత్రం స్వామి వారికి రక్షణ బాధ్యత రామచంద్ర అశ్వారావుకు సమస్యగా మారింది. ఈ స్థితిలో రామచంద్ర అశ్వారావు ఆలయంలో స్వామి కనబడకుండా అడ్డుగోడ కట్టి ఉత్సవమూ ర్తులతో బస్తరు ప్రాంతానికి వలస వెళ్లినట్లు భద్రాచల క్షేత్ర చరిత్ర చెబుతున్నది.

కొంతకాలం తర్వాత తిరిగి రామచంద్ర అశ్వారావు సంస్థానాన్ని దక్కించుకొని, నిజాం రాజ్యానికి సామంత రాజుగా పాలించాడు. ఒక సంవత్సరం పాటు పాలించిన అనంతరం క్రీ.శ. 1788లో రామచంద్ర అశ్వారావు మరణించాడు. ఈయనకు సంతానం లేకపోవడంతో పాలనా అధికారం కోసం సంస్థానంలో చాలాకాలం అంతఃకలహాలు చెలరేగాయి.

ఈ సంస్థానాధీశుల్లో ఇరవై ఒకటో తరానికి చెందిన వెంకటరామ నరసింహ అశ్వారావు 1798లో నిజాం నుండి రాజా బహద్దూర్, సవై మున్సబ్‌దారు అనే బిరుదులను, జెండా, నగారా, నౌబత్‌లను, రెండు వేల అశ్విక సేన, మూడు వేల సైన్యాన్ని కలిగి ఉండే అధికారాన్ని పొందారు.

ప్రాచీన సంస్థానాల్లో పేరెన్నికగన్న పాల్వంచ – భద్రాచల సంస్థానం వారసత్వం మహ్మదీ యుల దాడుల వల్ల, చేతులు మారుతూ అప్పుల పాలైంది. దీంతో సంస్థానం హక్కుల కోసం దామెర వారు, సెట్టిపల్లి వారు తగాదాలకు దిగారు. పోటీలు పడ్డారు. క్రీ.శ. 1800 నుంచి 1858 మధ్య జరిగిన అనేక కలహాల వల్ల సంస్థానం క్షీణదశకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో సీతారామ చంద్ర సవై అశ్వారావు బహద్దూర్, సర్ సాలార్ జంగ్ బహద్దూర్ సహాయంతో ఈ తగాదాల నుంచి బైట పడి జమీని చేజిక్కించుకుని, కొంతకాలం పాలించాడు. ఈ సమయంలోనే గతం లోని అప్పులు తీర్చే క్రమంలో గోదావరి మండలంలోని రేకపల్లి, భద్రాచలం ప్రాంతాలను నిజాం ప్రభుత్వం బ్రిటీషు వారికి ధారాదత్తం చేసింది.

సీతారామచంద్ర అశ్వారావు పెండ్లి కాకముందే మరణించాడు. దీంతో ఇతని తల్లి రాణీ లక్ష్మీ నరసయ్యమ్మ కొంతకాలం పాలన సాగించింది. ఈమె కుమార్తె నూజివీడు సంస్థానానికి చెందిన నాలుగో వేంకటాద్రి అప్పారావును పెండ్లాడింది. వీరి కుమారుడు రాజా పార్థసారథి అప్పా

రావు. రాణీ లక్ష్మీ నరసయ్యమ్మ క్రీ.శ. 1857లో మరణించిన తర్వాత మనవడు రాజా పార్థసారథి అప్పారావు పాల్వంచ – భద్రాచలం సంస్థానానికి వారసుడయ్యాడు.


రాజా పార్థసారథి అప్పారావు

రాజా పార్థసారథి అప్పారావు ప్రతిభావంతుడైన జమీందారుగా పేరుగాంచాడు. ఉర్దూ సంస్కృతాంధ్ర పార్సీ భాషల్లో పండితుడు. ఈయన అసమాన వాక్ చాతుర్యాన్ని నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీఖాన్ మెచ్చుకునేవారట. నిజాం పట్టాభిషిక్తుడైన సమయంలో పార్థసారథి అప్పారావుకు విలువైన దుస్తులు, రత్నహారాలు బహుకరించారట. ఈయన తన వ్యవహార దక్షతతోనే పూర్వం బాకీ కింద తీసుకున్న భూభాగాలను బ్రిటీషు వారి నుంచి తిరిగి పొందారట. రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, సొంత పోలీస్ డిపార్ట్‌మెంట్ నిర్వహించుకునే అధికారాలు కూడా ఇచ్చారట. స్వతంత్ర రాష్ట్రాలకు తప్ప మిగిలిన ఏ సంస్థానానికి కూడా లేని ఇలాంటి అధికారాలు పార్థసారథి అప్పారావు పొంది అసమాన ప్రతిభాశాలిగా పేరు సంపాదించాడు. రాజా పార్థసారథి అప్పారావు మైలవరం యువరాణి సీతమాంబను పెండ్లి చేసుకున్నాడు. వీరికి నలుగురు కుమారులు, ఒక కూతురు. వీరిలో పెద్ద కుమారుడు నారయ్యప్పారావు. ఈయన పిఠాపురం రాజకుమారి అన్నపూర్ణా దేవిని పెండ్లాడాడు. వీరికి ముగ్గురు కుమారులు. పెద్దవాడు విజయ అప్పారావు.

పార్థసారథి అప్పారావు తర్వాత 1932 నుంచి ఆయన పెద్ద కొడుకు నారయ్యప్పారావు, తర్వాత ఆయన కొడుకు విజయ అప్పారావు సంస్థానాన్ని పాలించారు. జమీందారీ రద్దు చట్టం మేరకు, పోలీసు చర్య తరువాత ఒడంబడికల ప్రకారం ఈ సంస్థానం ప్రభుత్వ వశమైంది. విజయ అప్పారావు తర్వాతి తరం వారు ఏమయ్యారనేది చారిత్రకంగా అందుబాటులో లేదు. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావు పేట అనే ఒక మండలం ఉంది. ఆశ్వారావు పేటకు ఆ పేరు ఎందుకు వచ్చిందని ప్రముఖ చరిత్రకారుడు కట్టా శ్రీనివాస్ పరిశీలించారు. క్రీ.శ. 1324లో పాల్వంచను పాలించిన అప్పన్న అశ్వారావు పేరు మీదనే ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చినట్లు ఆ వంశానికి చెందిన వారసులు చెబుతున్నారు. ఎనిమిదో తరానికి చెందిన మహీపాల్‌ను శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. ఈ సంస్థానానికి మొదటి రాజధాని పాల్వంచ అయి ఉంటుందనేది ఒక అంచనా. కానీ అశ్వారావు పేట మధ్యలో ఉన్న ఇప్పటి సాధారణ గ్రామం పోలవరపు పాడు మొదటి రాజధాని అయి ఉంటుందనేది మరో వాదన. పాలవాస ప్రాంతానికి సమానమైన పేరుగా పోలవరపు పాడు లేదా పాల్వంచ ఏర్పడడానికి ప్రధాన కారణమైన ఊరు ఇదేనని చెబుతున్నారు. దానికి ఆధారంగా ఈ ప్రాంతంలో బంగారు ఆభరణాలు, నాణేలు లభ్యమయ్యాయి.



ద్వారకా తిరుమల

# ఉల్లిపాలెం, మైలవరం, గురజ

**మైలవరం, ఉల్లిపాలెం, గురజ సంస్థానాలు.. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని ఒకప్పటి సంస్థానాలు. ఈ సంస్థానాలను పరిపాలించింది తెలంగాణలో రాచకొండ కేంద్రంగా పాలన సాగించిన పద్మనాయక ప్రభువుల వంశానికి చెందినవారే. మైలవరం, ఉల్లిపాలెం సంస్థానాలను సూరానేని వారు పాలించగా, గురజ సంస్థానాన్ని నూజివీడు సంస్థానానికి అనుబంధంగా కమదన వారు పరిపాలించారు.**

## ఉల్లిపాలెం

గుంటూరు జిల్లా నగరం మండలంలో ఉంటుంది ఉల్లిపాలెం. ఈ సంస్థానాన్ని కూడా పద్మనా

యక వెలమలైన సురానేని వారే పాలించారు.

ఈ ఎస్టేటు పూర్వం పలిగడ్డ వారు అనే బ్రాహ్మణ కుటుంబం వారిది. చింతపల్లి పాలకులైన కమ్మ ప్రభువులు, రాచూరు పాలకులైన మాణిక్యారావులు అనే వెలమ దొరల తాకిడికి తట్టుకో లేక సమర్థులైన వారి కోసం అన్వేషించారు. మైలవరం సంస్థానం నుంచి సూరానేని రంగారా యణంను క్రీ.శ. 1792 సంవత్సరంలో తీసుకొచ్చి తమ జాగీరులోని కొన్ని గ్రామాలను ఇచ్చి రక్షకులుగా నిలుపుకొన్నారు పలిగడ్డ వారు.

సూరానేని రంగారాయణంకు లింగన్నారావు , అన్నారావు అనే ఇద్దరు కొడుకులున్నారు. లింగన్నారావుకు పెద్ద వెంకన్నారావు, చిన వెంకన్నారావు అనే కుమారులున్నారు. పెద్ద వెంక న్నారావుకి మల్లారావు కొడుకు. ఈయన కాలంలోనే ఎస్టేటు పేష్కసు బాకీ కింద వేలానికి వెళ్లింది. ముప్పై గ్రామాలున్న ఎస్టేటులో చివరకు ఐదు గ్రామాలు మిగిలాయి.

మల్లారావుకు కొడుకులు లేకపోవడం వల్ల తన పినతండ్రి చిన వెంకన్నారావు కొడుకు వేంక టలక్ష్మీ నరసింహా రాయణంను దత్తత తీసుకున్నారు. ఈయన తర్వాత ఎస్టేటు వారసత్వం కొడుకు రామారాయణంకు దక్కింది. ఈయన కొడుకు వేంకట నరసింహా రాయణం సంస్కృ తాంధ్రంలో గొప్ప పండితుడుగా పేరొందాడు. ఈయనకు సంతానం లేకపోవడంతో పిఠాపురం వాస్తవ్యులు రావు శేషయ్య కొడుకును దత్తత తీసుకున్నాడు. ఈ దత్తపుత్రుడు రాజా వేంకట్రామ అప్పారావుగా ప్రసిద్ధుడు. ఈయన మద్రాసు ప్రధానిగా చేసిన రాజా పానుగంటి రామరాయణం తమ్ముడు పార్థసారథి రాయణం కూతురు సీతయ్యమ్మను వివాహమాడారు. రాజా సూరానేని వేంకట్రామ అప్పారావు గుంటూరు మండల పద్మనాయకుల్లో విఖ్యాతుడు. జిల్లా బోర్డు సభ్యు లుగా చాలాకాలం ప్రజాసేవ చేశాడు. మద్రాసు ఇరిగేషన్ బోర్డు సభ్యులుగా పనిచేశాడు. కేసీపీ లిమిటెడ్‌లో చాలాకాలం డైరెక్టర్‌గా ఉన్నాడు. ఈయనకు మగసంతానం లేకపోవడంతో కుమార్తె రమణయ్యమ్మ కొడుకును దత్తత తీసుకుని వేంకట నరసింహారావు అని పేరు పెట్టారు. ఈయన వారసులిప్పుడు విదేశాల్లో ఉన్నారు.

## మైలవరం

కృష్ణా జిల్లాలో విజయవాడకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది మైలవరం. ఈ సంస్థానా ధీశులు సూరానేనివారు. రేచర్ల పద్మనాయకుల ప్రఖ్యాత శాఖల్లో వీరిదీ ఓ ప్రధాన శాఖ. కాకతీ యాంధ్ర సామ్రాజ్య వైభవానికి, మనుగడకు తోడ్పడిన పద్మనాయక వెలమ ప్రభువైన రేచర్ల భేతాళనాయుడు సూరానేని వారి మూలపురుషుడు. భేతాళనాయుడు సూరానేని వారి శాఖకే కాదు, పద్మనాయకులకే మూలపురుషుడు. ఇతని వంశ పరంపరలోని వారే నూట ఇరువై ఏండ్ల పాటు రాచకొండ సామ్రాజ్యాన్ని పాలించిన సంగతి తెలిసిందే. ఈ పద్మనాయకుల ప్రభువుల్లో మాదానాయుని రెండో కుమారుడు నల్ల సూరానాయుడు. ఇతని నుంచే సూరానేని వారి శాఖ ప్రారంభమైంది. ఇతడు భేతాళనాయుని వంశ పరంపరలో పన్నెండో తరానికి చెందినవాడు.

పర్తియాల సంస్థానాధీశులైన జూపల్లి వారు సూరానాయునికి మేనమామలు. రాచకొండ



మైలవరం కోట

సామ్రాజ్యం క్షీణించిన తరువాత సూరానేని వారు మేనమామల రాజ్యభాగమైన మైలవరం ప్రాంతంలో స్థిరపడ్డారు. క్రీ.శ. 1687లో ఈ ప్రాంతం మొఘల్ సుల్తాను ఔరంగజేబు సేనల వశమయ్యింది. సూరానేని వేంకటపతి రాయణం క్రీ.శ. 1689లో మొఘల్ సేనాని నుంచి తిరిగి సంస్థానాన్ని పొందారు. ఈయనకు మొఘలులు 'ముస్తజార్' అనే బిరుదునిచ్చారు. ఈయన కుమారుడు నారాయణుడు మైలవరం కోటను నిర్మించాడు. ఈయన తర్వాత రెండవ వేంకట పతి రాయణం పరిపాలనా బాధ్యతలను స్వీకరించాడు. ఈ వంశంలో వేంకటపతి రాయణం పేరుగల వారు చాలామందే ఉన్నారు. వీరిలో మూడో వేంకటపతి రాయణం నూజివీడు నర' సింహం' అయిన నారయ్యప్పారావుతో కలిసి ఆంగ్లేయులతో పోరాడాడు.

నల్ల సూరానాయుని నుంచి ఈ వంశంలో పద కొండో తరం వాడైన సూరానేని పాపయ్యా గొప్ప ప్రజా సేవకుడిగా పేరొందాడు. చింతలపూడి జమీ లోని ద్వారకా తిరుమల దేవాలయం (చిన్న తిరు పతి) ఈయన కాలంలోనే మైలవరం సంస్థానానికి దక్కింది. అప్పటి నుంచి ఈ వంశీకులు ఆ ఆలయా నికి శాశ్వత ధర్మకర్తలయ్యారు.

ఈ వంశంలోని సూరానేని వేంకట గోపాలరావు బహద్దూర్ ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్ర మాలకు ముగ్ధురాలైన విక్టోరియా మహారాణి 'రాజా' బిరుదునిచ్చి గౌరవించింది. ఈయన వేంకటేశ్వర ఆలయం కట్టించి, రథం చేయించాడు. ఈ రథం 'మై లవరం రథం'గా ప్రసిద్ధి. ఈయన నిర్మించిన మంగ ళగిరి గాలి గోపురం, అగిరిపల్లి కోనేరు దేశ విఖ్యాత నిర్మాణాలుగా స్థానికులు చెప్పుకుంటారు.



మంగళ గిరి గాలిగోపురం

ఈ సంస్థానం చివరి జమీందారు రాజా సూరానేని వేంకట రాజగోపాల నరసింహారావు. ఈయననే ఎస్వీఆర్జీ నరసింహారావుగా పిలుస్తారు. ఈయన ఎలమర్రు రాజా వారి పుత్రికను పెండ్లాడాడు. ఈయన పది సంవత్సరాల పాటు మైలవరం పంచాయతీ అధ్యక్షులుగా, కృష్ణా జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడి (1961 – 1965)గా కృష్ణా జిల్లా పరిషత్ అధ్యక్షుడి (1962)గా పనిచేశారు. ఈ వంశానికి చెందిన సుధాకరరావు ప్రస్తుతం ద్వారకా తిరుమల దేవస్థానం ధర్మకర్తగా ఉన్నారు.


## గురజ (చార్‌మహల్)

కృష్ణా జిల్లాలోని ఒకప్పటి గురజ సంస్థానానికి 'చార్‌మహల్' అనే పేరు కూడా ఉంది. గురజ.. ఈ సంస్థానాధీశుల నివాస స్థానం. వీరు పద్మనాయక వెలమల్లో విప్పర్ల గోత్రానికి చెందిన కమదన వారు. నూజివీడు, గురజ ఒక మూలం నుంచి విడివడిన శాఖలు.

కమదన వారికి చార్‌మహల్ సంస్థానాన్ని నూజివీడు సంస్థానాధీశులు ఇచ్చారని మెకంజీ దొర రాసినట్లు 'పద్మనాయకుల చరిత్ర' చెబుతున్నది. క్రీ.శ. 1757లో నూజివీడు పాలకుడైన మూడవ వేంకటాద్రి అప్పారావు కమదన గురవయ్య కొడుకు పాపయ్యకు నాలుగు పరగణా లకు సన్నదులిచ్చారు. గుడివాడ, కలిదిండి, విన్నకోట, బిత్తర్‌జల్లి (చిత్తర్‌జల్లి) అనే నాలుగు పరగణాలు కలదే చార్‌మహల్ సంస్థానం.

క్రీ.శ. 1783లో నారయ్యప్పారావు స్వాతంత్ర్యం ప్రకటించిన సందర్భంలో ఈస్టిండియా కంపెనీ వారు చార్‌మహల్ వారితో మంతనాలు జరిపి 'తమకు సహకరిస్తే తాము ఆక్రమించిన నూజివీటి ప్రాంతాలను మీకిస్తామని, లేకపోతే మీ సంస్థానాన్ని స్వాధీనం చేసుకుంటామ'ని హెచ్చ రించారు. దీంతో కమదన వారు యుద్ధ సమయంలో సహకరించేందుకు ఒప్పుకున్నారు. కానీ, యుద్ధ సమయంలో కమదన వారి బంధువైన చెలికాని రామారాయణం బ్రిటీష్ వారికి సహాయ నిరాకరణ చేసినట్లు ఈస్టిండియా కంపెనీ కెప్టెన్ మౌంట్ గోమరీ రిపోర్టులు చెబుతున్నాయి. దీనిని బట్టి గురజ సంస్థానం నూజివీటి సంస్థానానికి అనుబంధ సంస్థానంగానే ఉన్నట్లు తెలుస్తున్నది. క్రీ.శ. 1791లో కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ గురజపై నూజివీడు పాలకుల పెత్తనం అవసరం లేదని తీర్మా నించారు. క్రీ.శ. 1792లో కమదన చినపాపయ్య మరణించినప్పుడు ఆయన ఇద్దరు కొడుకులు శోభనాద్రి రావు, నరసింహారావులను జమీపాలకులుగా బ్రిటీషు వారు నిర్ణయించారు. కొంతకా లానికి నరసింహారావు మరణించడంతో శోభనాద్రి రావు ఒక్కడే పాలకుడయ్యాడు.

ఎస్టేటు అప్పుల కారణంగా క్రీ.శ. 1813లో శోభనాద్రి రావు రెండు పరగణాలను విక్రయా నికి పెట్టారు. కలిదిండి పరగణాను బెజవాడ జమీందార్లు, బిత్తర్‌పల్లి పరగణాను మైలవరం జమీందార్లు కొన్నారు. శోభనాద్రి రావు తర్వాత ఆయన పెద్ద కొడుకు పాపయ్య రావుకు గుడి వాడ, విన్నకోట పరగణాలు గల సంస్థానం దక్కింది. అయినా తీరని అప్పుల కారణంగా క్రీ.శ. 1836లో బ్రిటీషు ప్రభుత్వం సంస్థానాన్ని జప్తు చేసి పాపయ్యకు, ఆయన సోదరులకు మను వర్తి నిర్ణయించింది.1843లో సంస్థానాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుంది. పాపయ్య కొడుకు వేంకటగోపాల జగన్నాథరావు పురుష సంతానం లేకుండానే మరణించాడు.



కోటప్పకొండ

# నరసారావుపేట, రాచూరు, ముత్యాలపాడు

**గుంటూరులోని ఒకప్పటి ప్రసిద్ధ సంస్థానాలు నరసారావు పేట, రాచూరు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన కావలి, కందుకూరు మధ్య ఉన్న సంస్థానం ముత్యాలపాడు. నరసారావు పేటను మల్రాజు వారు పాలించారు. రాచూరు+రేపల్లెను కృష్ణానేని వారు పాలించారు. ముత్యాలపాడు సంస్థానాన్ని చిట్నేని వారు ఏలారు. ఈ మల్రాజు వారు, కృష్ణానేని వారు, చిట్నేని వారు ఎవరో కాదు.. ప్రఖ్యాత పద్మనాయక ప్రభువులే. తెలంగాణలోని రాచకొండ కేంద్రంగా పాలన సాగించిన రాచకొండ వెలమలే వివిధ శాఖలుగా విడిపోయి ఈ సంస్థానాలను స్థాపించారు.**

## మల్రాజు వారి 'నరసారావుపేట'

నరసారావుపేట సంస్థానాధీశులు విరియాల గోత్ర పద్మనాయక వెలమలు. వీరి ఇంటి పేరు మల్రాజు వారు. క్రీ.శ. 1234 నాటి పమ్మి దాన శాసనం 'విరియాల మల్రాజు.. కాకతీయ గణపతిదేవ చక్రవర్తికి మహాసామంతుడ'ని చెబుతున్నది. ఈ మల్రాజు వంశీయులే మల్రాజు ఇంటి పేరుగల పద్మనాయక ప్రభువులయ్యారు. ఈ వంశానికి చెందిన గుండయ, గుండారాయణం, గుండారావు వారు, కొండరాజు, కొండమ నాయుడు, కొండారావు అనే పేర్లు సంస్థాన చరిత్రలో ఎక్కువగా కనిపిస్తాయి.

గుంటూరు వంకిదేవరను సంహరించి మల్రాజు వారు కాకతీయులకు సామంతులయ్యారు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం అద్దంకి, కొండవీడు రెడ్డి రాజ్యాలు ప్రాబల్యంలో ఉన్న ప్పుడు వీరు రాచకొండ ప్రభువుల 'కొల్లాపురం' ప్రాంతాన్ని ఆశ్రయించారు. రాచకొండ రాజులు కొండవీటిని జయించిన తర్వాత తిరిగి గుంటూరు మండలానికి వచ్చి బెల్లంకొండ, వినుకొండ దుర్గపాలకులుగా స్థిరపడ్డారు.

రేచర్ల సింగభూపాలుని (క్రీ.శ. 1410–1475) కాలంలో వీరు బెల్లంకొండ పాలకులుగా ఉన్నట్లు శాసనాలు చెబుతున్నాయి. మల్రాజు వారిని 'ఏడుకొండల ప్రభువులు' అంటారు. బెల్లంకొండ, సింగరకొండ, నందికొండ, కొండవీటి కొండ, వినుకొండ, గుత్తికొండ, కోటప్ప కొండ.. ఇవే ఆ ఏడు కొండలు. అగ్నిగుండాలలో వీరి కోట ఉండేది. దీనిని ఏలిన వారిలో మల్రాజు సూరయ్య ప్రధానమైన వాడు. ఈయన సోదరుడు వేంకట నరసింహారావు (క్రీ.శ. 1730–1768). ఈయననే నరసారావు అని కూడా పిలిచేవారు. ఈయనే తన పేరు మీద నర సారావుపేట, ఆ పేట మధ్యలో కోట నిర్మించాడు.

నరసారావు కుమారుడు గుండారావు. ఈయన నూజివీడు ధర్మప్పారావు, వాసిరెడ్డి వెంక టాద్రి నాయుడుకు సమకాలీనుడు. మరాఠీ దోపిడీ దొంగలైన పిండారీల నుంచి కోటను, సంస్థాన ప్రజలను కాపాడుకున్న వీరుడీయన.

గుండారావుకు పురుష సంతానం కలుగలేదు. ఈయన మరణానంతరం భార్య రాణి లక్ష్మమ్మ వేంకట నరసింహారావును దత్తత (క్రీ.శ.1832) తీసుకున్నది. ఈయనకు వేంకట కొండ లరావు అనే పుత్రుడు కలిగాడు. వేంకట నరసింహారావు చిన్న వయసులోనే మరణించాడు. కొండలరావు చిన్నవాడు కావడంతో రాణీ లక్ష్మమ్మ పరిపాలనా బాధ్యతలు చేపట్టింది. ఈవిడ కాలంలో ప్రభుత్వపు బాకీల కింద సంస్థానాన్ని బ్రిటీషు వారు హస్తగతం చేసుకున్నారు.

కొండలరావు తరువాత రాజా నరసింహారావు కొంతకాలం సంస్థానాన్ని పాలించాడు. ఈయన భార్య రాణీ లక్ష్మీ వెంకయ్యమ్మ నూజివీటి సంస్థాన కపిలేశ్వరపురం రాజపుత్రిక. వీరి కొడుకు కొండలరావు. ఈయన చాలాకాలం నరసారావుపేట మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్నాడు. నరసారావు పేట పురపాలక సంఘాధ్యక్షులుగా కూడా ప్రజాసేవ చేశారు. ఈయన స్థాపించిన నరసారావుపేట కళాశాల ఇప్పటికీ ఉంది.

## కృష్ణానేని వారి 'రాచూరు'

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఒకప్పుడు 'మూర్తిజా నగరు' అనే రాజ్యం ఉండేది. అటు తర్వాత అదే రాచూరు సంస్థానమైంది. కొంతకాలం ఈ సంస్థానానికి రేపల్లె రాజ ధానిగా ఉండింది. అందుకే దీన్ని 'రేపల్లె సంస్థానం' అని కూడా పిలుస్తారు. కొంతకాలం రాచూరు నుంచి రేపల్లె విడిపోయి వేరే జమీగా కూడా కొనసాగింది. అందుకే రేపల్లె, రాచూరు వేర్వేరు కాదు, ఒకే సంస్థానం. ఈ సంస్థానాధీశులు పున్నెపల్లి గోత్ర పద్మనాయక ప్రశస్థులు. కృష్ణానేని వీరి ఇంటి పేరు. 'మాణిక్యారావు' అనేది వీరి వంశ బిరుదనామం.

రాచూరు సంస్థానాధీశులు కొండవీటి రెడ్డి రాజ్య పతనానంతరం కుతుబ్‌షాహీ ప్రతినిధు లుగా కొండవీటి పాలకులయ్యారు. క్రీ.శ. 1685లో గోల్కొండ సుల్తాను అనుగ్రహం మేరకు కృష్ణానేని రఘుపతి మాణిక్యారావు కొండవీటిని పాలించినట్లు 'కొండవీటి కైఫియత్'

చెబుతున్నది. ఈ రఘుపతికి 'మాణిక్యారావు' అనే బిరుదును గోల్కొండ సుల్తాను ఇచ్చాడు. ఈయన నుంచే ఆ బిరుదు కృష్ణానేని వారి వంశ గౌరవనామం అయింది.

రఘుపతి మాణిక్యారావు తర్వాత ఆయన కొడుకులు, మనవలు కొండవీటి సీమలో గోల్కొండ నవాబులకు హుజూర్ నాయకులుగా, ఖిల్లాదారులుగా ఉన్నారు.

రఘుపతి మాణిక్యారావు మునిమనవడు అప్పప్రభువు రేపల్లెలో క్రీ.శ. 1705 నాటికి కోట కట్టించాడు. క్రీ.శ. 1717లో అధికారంలో ఉన్న మల్లన్నా మాణిక్యారావు రాచూరులో కోట కట్టించాడు.

క్రీ.శ. 1787 నుండి మూర్తిజానగరు (రాచూరు+రేపల్లె = గుంటూరు మండలం) సర్కారు ఇంగ్లీషు వారి పాలనలోకి వెళ్ళింది. క్రీ.శ. 1792లో అన్నదమ్ముల మధ్య కలహాలు ఏర్పడి సంస్థానం రెండు భాగాలైంది. రేపల్లె జమీ జంగన్న రావుకు, రాచూరు వంతు తిరుపతిరావుకి వచ్చింది.

కాలక్రమంలో ఈ రెండు సంస్థానాల వారు అప్పుల పాలయ్యారు. ఈ సందర్భంలో వాసి రెడ్డి వారికొకరు, మల్రాజు వారికి ఇంకొకరు తమ రాజ్య భాగాలను అమ్ముకున్నారు. క్రీ.శ. 1828–35 సంవత్సరాల మధ్య ఈ సంస్థానాలు కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వారి ఆధీనంలోకి వెళ్లాయి. రేపల్లె పాలకుడు బాకీలు చెల్లించకపోవడం వల్ల బ్రిటిషు ప్రభుత్వం సంస్థానాన్ని జప్తు చేయ డంతో ఈ జమీందారీ అంతరించింది.

మిగిలిన రాచూరు భాగాన్ని జంగన్న కొంతకాలం పాలించాడు. ఈయన తర్వాత కొడుకు వెంకటగోపాలరావు క్రీ.శ. 1870–83 మధ్య సంస్థానానికి కేవలం బ్రిటిషు ప్రభుత్వ పింఛను దారుగా ఉన్నాడు. ఈయన మనవడు కృష్ణానేని వెంకట హయగ్రీవ మాణిక్యారావు ఈ వంశంలో చివరివాడు. ఈయన తర్వాత సంస్థాన పాలన లేదు.

## పెదపవని దొరల 'ముత్యాలపాడు'

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని కావలి, ప్రకాశం జిల్లాలోని కందుకూరు మధ్య ప్రాంతంలోనిది ఈ ముత్యాల పాడు సంస్థానం. పద్మనాయకుల ప్రాచీన సంస్థానాలలో ఇదీ ఒకటి. ముత్యాలపాడు జమీందార్లను 'పెదపవని దొరలు' అని కూడా పిలుస్తారు. వీరి ఇంటి పేరు చిట్నేని వారు. భూపాల భాలేరాయణిం అనేది వీరి వంశ గౌరవ బిరుదు.

ముత్యాలపాడు పద్మనాయకుల మూలపురుషుడు చిట్నేని నరసారాయణిం. ఈయన నైజం రాజ్యంలోని ఆలమూరు గూడెం ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని నవాబుకు సామంతుడుగా పాలన చేశాడు. ఈయన కొడుకు లక్ష్మీ కాంతరాయణిం నవాబు మీద తిరుగుబాటు చేసిన జాగీ రుదారులను ఓడించి మెప్పుపొందడమే కాదు, 'భూపాల భాలేరావు' అనే బిరుదుతోపాటు వెలి గందుల (ఎలగందుల?), హనుమకొండ జాగీరులను కూడా నిజాం నుంచి పొందాడు. ఈయన నుంచే 'భూపాల భాలేరావు' అనే బిరుదు వంశ గౌరవ నామం అయ్యింది. లక్ష్మీకాంతరాయణిం కొడుకు నరసింగ భూపాల భాలేరాయణిం. వారి మనవడు ధర్మభూపాల భాలేరాయణిం.

ధర్మభూపాలుడు తన తండ్రి నరసింగ భూపాలుడితో కలహించి హైదరాబాద్ నవాబు కొలు వులో చేరాడట. అక్కడ తన ప్రతిభాపాటవాలతో నిజాం మెప్పు పొంది గండికోట తాలూకాను

జాగీరుగా పొందాడు. అటు తర్వాత చంద్రగిరి, చిత్తూరు తాలూకాలను కూడా పొంది నవాబు పక్షాన ఫౌజుదారుడయ్యాడు. నెల్లూరు మండలంలోని రావూరునూ పొంది దేశ్‌ముఖ్ ఫర్మా నాను సంపాదించాడు.

నరసింగభూపాలుడి తరవాత ధర్మభూపాలుడి కొడుకు వేంకట కృష్ణ భూపాల భాలేరా యణిం సంస్థాన బాధ్యతలు చేపట్టాడు. ఈయనకు సంతానం లేకపోవడంతో రామచంద్ర భూపాల భాలేరాయణింను దత్తత తీసుకుని సంస్థాన బాధ్యతలు అప్పగించాడు. ఈయన తర్వాత జమీ పాలనకు వచ్చినవాడు నరసింగ భూపాల భాలేరాయణిం. ఈయన రామచంద్ర భూపాలుడి కొడుకు అని 'పద్మనాయక చరిత్ర' అనే గ్రంథంలో కోటగిరి వెంకట నరసింహ సత్య నారాయణరావు రాశారు. కానీ, రామచంద్ర భూపాలునికి సంతానం కలుగలేదని 'ఆంధ్ర సంస్థా నములు : సాహిత్య పోషణము' అనే గ్రంథంలో తూమాటి దొణప్ప రాశారు. ఈ రెండు అంశాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. రామచంద్ర భూపాలుడి తర్వాత ఈ సంస్థాన విష యంలో ఇలాంటి విరుద్ధ అంశాలు చాలానే ఉన్నాయి. బ్రిటిషు వారి కాలంలో ఈ వంశానికి చెందిన పదో తరం జమీందారు వెంకట్రామభూపాల భాలేరాయణిం 1813లో మరణించినట్లు ఆధారాలున్నాయి. ఈయన అనంతరం భార్య రాణి చెల్లయ్మమ్మ రామచంద్ర భూపాల భాలే రాయణింను దత్తత తెచ్చుకుని సంస్థానాన్ని పాలించింది. అనంతరం రామచంద్ర భూపాల భాలేరాయణిం సంస్థాన బాధ్యతలు చేపట్టి బ్రిటీషు వారి నుంచి 'రాజా' బిరుదు పొందాడు. 1860లో ఈయన మరణానంతరం పెద్ద కొడుకు రాజా వేంకట నరసింగభూపాల భాలేరా యణిం సంస్థాన పాలన సాగించాడు. ఈయన తర్వాత 1911లో దత్తపుత్రుడు రాజా సీతారా మచంద్ర శ్రీరంగ భూపాల భాలేరాయణం జమీందారుడయ్యాడు. ఈయన కొడుకు వేంకట సత్యనారాయణ భూపాల భాలేరాయణిం ఈ సంస్థానం చివరి జమీందారు. ఈయన వేంకట గిరి రాజా గోవింద కృష్ణయాచేంద్రుని అల్లుడు.

## జూపల్లి వారి పర్తియాల, వెల్లంకి వారి తిరువూరు

నల్లగొండ నుంచి కృష్ణా గోదావరి నదుల మధ్య సాగర తీరం వరకు గల ప్రాంతాన్ని ప్రాచీన కాలం నుంచి పాలించిన వారు విప్పర్ల గోత్రానికి చెందిన పద్మనాయక ప్రభువులు. వీరు పరిపా లించిన సంస్థానాల్లో పర్తియాల (జుజ్జూరు), పాల్వంచ-భద్రాచలం, నూజివీడు, గురజ (చార్ మహల్) ముఖ్యమైనవి.

విప్పర్ల వంశ భాగాల్లో మొదటిదైన పర్తియాల సంస్థానం నేటి నల్లగొండ (తెలంగాణ), కృష్ణా (ఆంధ్రప్రదేశ్) జిల్లాలతో కలిసి ఉండేది. తిరువూరు (చీమలపాడు), మైలవరం, జుజ్జూరు, విజ యవాడ, కనకగిరి, జములవాయి, చింతలపూడి పరగణాలు ఈ సంస్థాన పరిధిలోనివి. విప్పర్ల వంశానికి చెందిన జూపల్లి వారు పర్తియాల సంస్థానాన్ని పాలించారు. క్రీ.శ. 1783 వరకు వీరి పాలన సాగిన తర్వాత ఈ వంశీయులు అంతరించారు. తర్వాత ఈ సంస్థానాన్ని కలవకొలను వారు పాలించారు. ఈ సంస్థానానికి చెందిన జములవాయి, మేడూరు, కనకగిరి పరగణాలు అటు తర్వాత తిరువూరు (కృష్ణా మండలం) సంస్థానంగా ఏర్పడింది. దీన్ని వెల్లంకి వారు పాలిం చారు. వీరు పద్మనాయక వెలమల్లో పెంపాల గోత్రానికి చెందినవారు.

# చారిత్రక ఘట్టాలు

1303 ఓరుగల్లుపై తురుష్కుల తొలిదండయాత్ర
1316 రేచర్ల సింగమనేని కంచి యుద్ధం
1320 కమ్మటం యుద్ధం – ప్రతాప రుద్రుని కోసం కంపిలి రాముడిని ఓడించిన రేచర్ల సింగమనేని.
1323 ప్రతాపరుద్రని నిర్యాణం, కాకతీయ రాజ్యపతనం
1336 మాలిక్ మక్బూల్‌ను ఓరుగల్లు నుంచి తరిమివేసిన ముసునూరి కాపయ నాయక
1350 బహమనీ సుల్తాన్, అల్లావుద్దీన్ బహమన్ షా చేతిలో కాపయ ఓటమి
1356 ఓరుగల్లుపై బహమనీల దాడి, కాపయ ఓటమి, వదులుకున్న భువనగిరి కోట
1361 భువనగిరి కోటను తిరిగి పొందిన కాపయ నాయకుడు
1361 జల్లిపల్లి పోరాటం
1365 రాచకొండ దుర్గ నిర్మాణం
1369 రేచర్ల పద్మనాయకులు, కాపయ మధ్య భీమారం యుద్ధం, కాపయ మరణం
1377 రేచర్ల అనపోతానేని ధరణి కోట యుద్ధం
1381 రెండో సింగమనేని కొత్తకొండ యుద్ధం
1384 కుమార సింగమనేనికి రాజ్యాధికారం
1397 బహమనీ సుల్తాన్ ఫిరోజ్ షా రాజ్యాధికారం
1397 రెండో సింగమ పానుగంటి పోరు ప్రారంభం
1399 రెండో సింగమ పానుగంటి పోరు ముగింపు
1404 రెండో అనపోతనేని మెదక్ యుద్ధం
1417 రెండో అనపోతనేని పానుగంటి పోరు ప్రారంభం
1419 రెండో అనపోతనేని పానుగంటి పోరు ముగింపు
1420 కొండవీటిపై రెండో సింగమనేని పోరాటం
1422 బహమనీ సుల్తాన్ ఫిరోజ్ షా మరణం, అహ్మద్ షా రాజ్యాధికారం
1425 ఓరుగంటిపై రెండో సింగమనేని పోరాటం
1435 సంజర్ ఖాన్ ఓరుగల్లు ఆక్రమణ, రెండో అల్లావుద్దీన్ అహ్మద్‌షా పాలన ప్రారంభం
1458 రెండో అల్లావుద్దీన్ అహ్మద్‌షా అంతం
1458 హుమాయిన్ పాలన ప్రారంభం
1461 హుమాయిన్ పాలన ముగింపు
1468 కపిలేశ్వర గణపతి మరణం
1518 గోల్కొండలో కుతుబ్ షాహీల స్వతంత్ర పాలన ప్రారంభం
1543 కులీ కుతుబ్ షా మరణం, జంషీద్ కుతుబ్ షా పాలన ప్రారంభం
1550 జంషీద్ కుతుబ్ షా మరణం, ఇబ్రహీం కుతుబ్ షా (1518–1580) పాలన ప్రారంభం
1565 తల్లికోట యుద్ధం
1565 విజయనగర రాజ్య పతనం
1580 ఇబ్రహీం కుతుబ్ షా మరణం, మహమ్మద్ కులీ కుతుబ్ షా (1565–1612) పాలన ప్రారంభం
1591 చార్మినార్ నిర్మాణం
1612 మహమ్మద్ కులీ కుతుబ్ షా మరణం, సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్ షా (1593–1626) పాలన ప్రారంభం
1626 సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్ షా మరణం, అబ్దుల్ హాసన్ కుతుబ్ షా (1614–1672) పానల ప్రారంభం

1640 చెన్నపట్టణంలో ఈస్టిండియా కంపెనీ
వారి సెయింట్ జార్జి కోట నిర్మాణం
1652 మొఘల్ బాద్‌షా సేనానిగా కళింగ
దేశాన్ని స్వాధీనం చేసుకునేందుకు
షేర్ మహమ్మద్ ఖాన్ రాక
1627 బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్
షా మరణం
1672 అబ్దుల్ హసన్ కుతుబ్ షా మరణం,
అబుల్ హసన్ తానీషా పాలన
ప్రారంభం
1677 శివాజీతో తానీషా సంధి
1680 శివాజీ మరణం
1687 గోల్కొండను వశపరుచుకున్న
మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు,
కుతుబ్ షాహీల పాలన అంతం
1707 మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మరణం
1724 37 ఏండ్ల (1687 నుంచి)
మొఘలుల పాలన అంతం
1724 అసఫ్‌జాహీ వంశాన్ని స్థాపించిన
నిజాముల్ ముల్క్, అసఫ్ జాహీల
పాలన ప్రారంభం
1748 నిజాముల్ ముల్క్ మరణం, నాసిర్
జంగ్ పాలన ప్రారంభం, తంగమ్మ
పేట యుద్ధం
1751 సలాబత్ జంగ్ పాలన ప్రారంభం
1757 బొబ్బిలి యుద్ధం
1761 రెండో అసఫ్‌జాహీ నిజామలీ ఖాన్
పాలన ప్రారంభం
1766 కోస్తాంధ్రలో ఆంగ్లేయుల ఆధిపత్యం
మొదలు
1799 టిప్పు సుల్తాన్ మరణం
1800 రాయలసీమ జిల్లాలలన్నీ బ్రిటీషు
వారి ఆధీనం
1803 మూడో అసఫ్‌జాహీ సికిందర్ జా
పాలన ప్రారంభం, కోఠి బ్రిటీష్
రెసిడెన్సీ నిర్మాణం ప్రారంభం
1808 కోఠి బ్రిటీష్ రెసిడెన్సీ నిర్మాణం పూర్తి
1829 నాలుగో అసఫ్‌జాహీ నసిరుద్దౌలా
పాలన ప్రారంభం
1855 నిజాం ప్రభుత్వ ఖాజానా ప్రారంభం
1856 పారిశ్రామిక ప్రదర్శన ఏర్పాటు
1857 ఐదో అసఫ్‌జాహీ అఫ్జలుద్దౌలా
పాలన ప్రారంభం, సిపాయిల
తిరుగుబాటు
1858 సొంత నాణేలుగా హాలీ సిక్కాలు
1859 తుర్రేబాజ్ ఖాన్ మరణం
1864 రెవెన్యూ బోర్డు ఏర్పాటు
1867 రాజ్యం ఏడు డివిజన్‌లుగా విభజన,
అటవీ శాఖ ఏర్పాటు
1869 ఆరో అసఫ్‌జాహీ మహబూబ్
ఆలీఖాన్ పాలన ప్రారంభం
1871 తంతి తపాలా శాఖ ఏర్పాటు
1874 వాడి- సికింద్రాబాద్ రైలు మార్గం పూర్తి
1875 రెవెన్యూ సర్వే శాఖ ఏర్పాటు
1885 జాతీయ కాంగ్రెస్ స్థాపన
1886 సికింద్రాబాద్ – విజయవాడ రైలు
మార్గం పూర్తి
1892 ఆర్యసమాజ్ హైదరాబాద్ శాఖ
ప్రారంభం
1895 గణేష్ ఉత్సవాలు ప్రారంభం
1893 మంత్రుల సభ ఏర్పాటు
1905 రాజ్యం నాలుగు సుభాలుగా విభజన
1911 ఏడో అసఫ్‌జాహీ ఉస్మాన్ ఆలీఖాన్
పాలన ప్రారంభం
1914 పురావస్తు శాఖ ఏర్పాటు
1930 ఉప్పు సత్యాగ్రహం, ఆంధ్ర
మహాసభ ఆవిర్భావం
1938 హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ స్థాపన
1947 భారతావనికి సిద్ధించిన
స్వాతంత్ర్యం
1948 ఇండియన్ యూనియన్‌లో కలిసిన
హైదరాబాద్ సంస్థానం

# ఉపయుక్త గ్రంథాలు


1. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రము
2. శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి
3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సురవరం ప్రతాపరెడ్డి
4. రాచకొండ చరిత్రము – తేరాల సత్యానారాయణ శర్మ
5. పద్మనాయక చరిత్ర – కోటగిరి వెంకట నరసింహ సత్యానారాయణ రావు
6. ఆంధ్ర సంస్థానములు ః సాహిత్య పోషణము – డా. తూమాటి దొణప్ప
7. కాకతీయులు – పి.వి. పరబ్రహ్మశాస్త్రి
8. కాకతీయ యుగము – ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం
9. తెలంగాణ చరిత్ర – డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

1. History of the Deccan by J.D.B Gribble
2. A History of South India from prehistoric Times to the Fall of Vijayanagar – by KA Nilakanta Sastri
3. The History of Andhra Country 1000 A.D. – 1500 A.D. – by Yashoda Devi
4. Andhra Chronology (90–1800 A.C.) by V. Ramesam
5. The Aristocracy of Southern India – by A. Vadivelu
6. Early Vijayanagara studies in its history and culture – edited by GS Dikshit
7. A family history of Venkatagiri Rajas – by Alladi Jagannatha Sastri
8. A Revised enlarged accont of bobbili zamindaari